www.peoplesnews.in

హైదరాబాద్

# పీపుల్స్ న్యూస్

ప్రజల గొంతుక...

దినపత్రిక

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్   సంపుటి : 15   సంచిక : 69   శుక్రవారం, డిసెంబర్ 05, 2025 , పేజీలు - 12   వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad




రండి.. అక్షరాన్ని
అనుకున్న విధంగా రాద్దాం

అసలైన అక్షరాన్ని రుచి చూపేందుకు..
కన్నది విన్నది పంచుకున్నది ప్రజలకు అందించాలని..
వారి సాధకబాధకాల్లో మమేకమై
పరిష్కార మార్గాలకు దిక్సూచిగా
మారాలని అనుకుంటున్నారా? విశాలమైన జర్నలిజం
వృత్తిలో రాణించాలని కోరుకుంటున్నారా? అయితే..

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక

జిల్లా, మండల మరియు నియోజకవర్గాల
వారిగా రిపోర్టర్లు కావలెను

సంప్రదించండి
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్
9866330400

## సుప్రీంలో రాహుల్ గాంధీకి ఊరట

- భారత ఆర్మీపై అనుచిత వ్యాఖ్యల కేసు
- ట్రయల్ కోర్టు చర్యలను నిలిపివేసిన సుప్రీం

**న్యూఢిల్లీ,డిసెంబర్ 04 :** భారత ఆర్మీపై అనుచిత వ్యాఖ్యల కేసులో కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీకి ఉపశమనం లభించింది. రాహుల్‌గాంధీపై ట్రయల్ కోర్టు చర్యలను నిలిపివేస్తూ సుప్రీంకోర్టు గురువారం మధ్యంతర ఉత్తర్వులను 2026, ఏప్రిల్ 22 వరకు మిగతా2లో...

## ఆదిలాబాద్‌కు వరాల జల్లు

ఎయిర్‌పోర్టు నిర్మించి..పరిశ్రమలు రప్పిస్తాం

యూనివర్సిటీ ఏర్పాటుకు తక్షణ హామీ

సిమెంట్ పరిశ్రమను తెరిపించి యువతకు ఉద్యోగాలు

రూ.18.7 కోట్ల విలువైన అభివృద్ధిపనులకు శంకుస్థాపన

ఆదిలాబాద్ పర్యటనలో సిఎం రేవంత్ వెల్లడి



**ఆదిలాబాద్,డిసెంబర్ 04 :** ఆదిలాబాద్ జిల్లాకు సిఎం రేవంత్ రెడ్డి వరాల జల్లు ప్రకటించారు. ఎయిర్ పోర్టు, యూనివర్సిటీ, తుమ్మడిహట్టి ద్వారా నీళ్లు తీసుకొచ్చే బాధ్యత తనదని ప్రకటించారు. ఈ క్రమంలో ఎయిర్‌పోర్టుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక ప్రకటన చేశారు. ఏడాదిలోపు ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్టు పనులు ప్రారంభిస్తామని వ్యాఖ్యానించారు. వరంగల్‌తో పాటు ఆదిలాబాద్‌కు అన్ని రకాల వసతులతో కూడిన ఎయిర్‌పోర్టు ఉండాల్సిందేనని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇక్కడ ఎయిర్‌పోర్టు వస్తే ఆదిలాబాద్‌కు పరిశ్రమలు వస్తాయని పేర్కొన్నారు సీఎం రేవంత్ రెడ్డి. ఎర్రబస్సే కాదని.. ఆదిలాబాద్‌కు ఎయిర్ బస్సు కూడా తీసుకువస్తామని చెప్పుకొచ్చారు. ఆదిలాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మిగతా2లో...



## భారత్ చేరుకున్న రష్యా అధ్యక్షుడు పుతిన్

ఘనంగా స్వాగతం పలికిన ప్రధాని మోడీ

ఇరువురు నేతలు కలసి ప్రధాని నివాసానికి చేరిక

నేడు పలు కీలక ఒప్పందాలపై సంతకాలు

**న్యూఢిల్లీ,డిసెంబర్ 04 :** రష్యా అధ్యక్షుడు పుతిన్ భారత్‌కు చేరుకున్నారు. ఢిల్లీ సమీపంలోని ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో దిగిన ఆయనకు ప్రధాని మోదీ స్వయంగా స్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుంచి ఇద్దరు నేతలు ఒకే కారులో ప్రధాని అధికారిక నివాసానికి ప్రయాణమయ్యారు. ఉక్రెయిన్ యుద్ధం మిగతా2లో...

## హెల్త్ సెక్యూరిటీ బిల్లు

- లోక్‌సభలో ప్రవేశ పెట్టిన నిర్మలమ్మ



**న్యూఢిల్లీ,డిసెంబర్ 04 :** లోక్‌సభలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ హెల్త్ సెక్యూరిటీ సెస్, నేషనల్ సెక్యూరిటీ సెస్ బిల్లు 2025ను ప్రవేశపెట్టారు. రెండు ప్రయోజనాల రీత్యా కేంద్రం ఈ బిల్లును ప్రవేశపెట్టింది. ఒకటి ఆరోగ్య భద్రత, రెండు జాతీయ భద్రత ఈ రెండు అంశాలపై ఈ బిల్లును మిగతా2లో...

## పంచాయితీ రిజర్వేషన్లపై జోక్యం చేసుకోం

పిటిషన్లపై విచారణలో హైకోర్టు స్పష్టీకరణ



2లో

## రాబోయే రోజుల్లో ప్రపంచాన్ని శాసించనున్న ఎఐ

2047 నాటికి మూడు ట్రిలియన్ల ఎకానమీకి ప్లాన్

వేయికోట్ల రూపాయలతో స్టార్టప్ లను ప్రోత్సహిస్తాం

క్వాంటం టెక్నాలజీ'లో తెలంగాణను గ్లోబల్ లీడర్


నీతి ఆయోగ్ క్వాంటం సదస్సులో భట్టి, శ్రీధర్ బాబు



**హైదరాబాద్,డిసెంబర్ 04 :** రాబోయే రోజుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఏఐ ప్రపంచాన్ని శాసిస్తుందని డిప్యూటీ సీఎం విక్రమార్క పేర్కొన్నారు. అయితే, తెలంగాణ 2047 నాటికి మూడు ట్రిలియన్ల ఎకానమీకి చేరుకోవాలని ప్లాన్ చేస్తున్నాం అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. హైదరాబాద్ లో నిర్వహించిన క్వాంటం పవర్డ్ ఎకానమీ స్ట్రాటజీ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. క్వాంటం టెక్నాలజీ గురించి దేశం చర్చిస్తుంది.. దాని ఆవిష్కరణకి తెలంగాణను ఎంచుకున్నందుకు నీతి ఆయోగ్ కి ధన్యవాదాలు చెప్పుకొచ్చారు. డిజిటల్, టాలెంట్ కి హైదరాబాద్ కి కేంద్రంగా మారింది అన్నారు. అలాగే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా టెక్నాలజీని ప్రమోట్ చేసే పనిలో ఉన్నారు.. నీతి ఆయోగ్ కూడా గ్లోబల్ సమ్మిట్ లో భాగస్వామ్యం కావాలని కోరుతున్నాం.. మిగతా2లో...

## బీజాపూర్ ఎన్‌కౌంటర్‌లో 18 మంది మృతి

- వివరాలు వెల్లడించిన డీఐజీ కమలోచన్ కశ్యప్



**రాయపూర్,డిసెంబర్ 04 :** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపుర్-దంతెవాడ సరిహద్దు అడవుల్లో భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య భీకర ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఘటనలో 9 మంది మహిళలతో సహా మొత్తం 18 మంది మావోయిస్టులు మృతి చెందినట్టు బస్తర్ ఐజీ సుందర్ రాజ్ తెలిపారు. బీజాపూర్‌లో డీఐజీ కమలోచన్ కశ్యప్, మిగతా2లో...

## అనుముల రేవంత్ రెడ్డి కాదు.. అవినీతి అనకొండ: కేటీఆర్




**హైదరాబాద్,డిసెంబర్ 04 :** హిల్ట్ పాలసీ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.5 లక్షల కోట్ల భారీ భూమి కుంభకోణానికి పాల్పడుతున్నది బీఆర్ఎస్ వర్కింగ్ కేటీఆర్ ఆరోపించారు. ఒకప్పుడు ప్రభుత్వాలు ప్రజలు పరిశ్రమల కోసం, ఉద్యోగ ఉపాధి కల్పన కోసం ఇచ్చిన భూములను ఇప్పుడు ప్రవేట్ వ్యక్తులకు రేవంత్ సర్కార్ ధారాదత్తం చేస్తున్నదని విమర్శించారు. పరిశ్రమలు వద్దు అంటూ అపార్ట్‌మెంట్లు, విల్లాలు, కమర్షియల్ కాంప్లెక్సులు కట్టుకోమని పారిశ్రామిక భూములను ఇస్తున్నదని ధ్వజమెత్తారు. పారిశ్రామిక భూముల బదలాయింపుపై కేటీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ నిజనిర్ధారణ బృందం జీడిమెట్ల ఇండస్ట్రియల్ పార్క్‌లో పర్యటించింది. ఈ సందర్భంగా హమాలీలతో మాట్లాడారు. మీడియాతో మాట్లాడుతూ.. మిగతా2లో...




## రాచకొండ, సైబరాబాద్ పోలీస్ వెబ్‌సైట్లు హ్యాక్..

**హైదరాబాద్,డిసెంబర్ 04 :** తెలంగాణ పోలీసులకు సైబర్ నేరగాళ్లు షాకిచ్చారు. ఇటీవలే హైకోర్టు వెబ్‌సైట్‌ను హ్యాక్ చేసిన సైబర్ క్రిమినల్స్.. తాజాగా రాచకొండ, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ వెబ్‌సైట్లను పనిచేయకుండా చేశారు. దీంతో గద పది రోజులుగా రెండు కమిషనరేట్ల వెబ్‌సైట్లు పూర్తిగా నిలిచిపోయాయి. వీటిలోకి మాల్‌వేర్ చొరబడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. వెబ్‌సైట్లను క్లిక్ చేస్తే అధికారిక సమాచారానికి బదులుగా మిగతా2లో...

## పర్యాటక కేంద్రంగా ఉమ్మడి జిల్లా అభివృద్ధి

తద్వారా స్థానికుకలు ఉద్యోగ,ఉపాధి అవకాశాలు

ప్రజల కష్టాలు తెలిసన వ్యక్తి సిఎం రేవంత్

ఆదిలాబాద్ పర్యనటనలో మంత్రి జూపల్లి కృష్ణారావు



**ఆదిలాబాద్,డిసెంబర్ 04 :** మినీ కాశ్మీర్ గా పేరొందిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పారు. తద్వారా స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. అర్హులైన లబ్దిదారులకు సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తానని హామీనిచ్చారు.పేదలు కష్టాలు తెలిసిన వ్యక్తి సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తున్నారు. గతంలో పాలించిన కేసీఆర్ పుణ్యమా అని ధనిక రాష్ట్రం అప్పుల కుప్పగా తయారైందన్నారు. రూ. 8 లక్షల కోట్ల రూపాయల అప్పుల చేస్తే.. దానికి ప్రతీ నెల ప్రజా ప్రభుత్వం వడ్డీ చెల్లిస్తుంది. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్న ఇచ్చిన మాటకు కట్టుబడి ఈ రెండేళ్లలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు మిగతా2లో...

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక



# భారత్ చేరుకున్న రష్యా అధ్యక్షుడు పుతిన్

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభమైన తర్వాత తొలిసారిగా రెండు రోజుల పాటు ఇండియా పర్యటనకు వచ్చారు. ప్రధాని నరేంద్రమోడీ ఆయనను స్వయంగా ఎయిర్‌పోర్ట్‌లో స్వాగతించారు. పుతిన్ 23వ ఇండియా-రష్యా శిఖరాగ్ర సమావేశంలో పాల్గొననున్నారు. రెండు దేశాల మధ్య రక్షణ, వాణిజ్య రంగాలలో పలు కీలక ఒప్పందాలు జరిగే అవకాశం ఉంది. ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభానికి కొన్ని నెలల ముందు 2021 డిసెంబరులో పుతిన్ చివరిసారి ఢిల్లీలో పర్యటించారు. ఆ తర్వాత ఆయన మన దేశానికి రావడం ఇదే తొలిసారి. రష్యా చమురు కొనుగోలు చేస్తోందన్న కారణంతో భారత్‌పై అమెరికా అదనపు సుంకాలు అమలు చేస్తున్న వేళ ఈ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. పుతిన్ కు ప్రధాని మోదీ ప్రైవేటు విందు ఇవ్వనున్నట్లు సమాచారం. శుక్రవారం ఇరునేతలు ఇండియా-రష్యా 23వ వార్షిక శిఖరాగ్ర సమావేశంలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా పలు రక్షణ, వాణిజ్య ఒప్పందాలు కుదిరే అవకాశం ఉంది. భారత్‌తో సంబంధాలు, సహకారాన్ని మరింత పెంపొందించుకోవడానికి రష్యా ఎదురు చూస్తోందని పుతిన్ ఇప్పటికే తెలిపారు. ఇంధనం, పరిశ్రమలు, అంతరిక్షం తదితర రంగాల్లో అనేక ఉమ్మడి ప్రాజెక్టులు పూర్తి చేసుకోవడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. భారత్ నుంచి దిగుమతులు మరింత పెంచుకునే అంశంపైనా చర్చలు జరపనున్నట్లు వెల్లడించారు. గురువారం వ్లాదిమిర్ పుతిన్ పాలం వైమానిక దళ స్టేషన్‌లో దిగగా ప్రధాని మోదీ ఆయనకు స్వాగతం పలికారు. శుక్రవారం ఉదయం 11.00: పుతిన్ రాష్ట్రపతిని కలిసేందుకు రాష్ట్రపతి భవన్‌కు వెళతారు. ఉదయం 11.30కు రాజ్‌ఘాట్ వద్ద నివాళి అర్పిస్తారు. ఉదయం 11.50: నరేంద్ర మోదీతో సమావేశం. మధ్యాహ్నం 1.50: హైదరాబాద్ హౌస్‌లో సంయుక్త విలేకరుల సమావేశం ఉంటుంది. సాయంత్రం 7.00 గంటలు: పుతిన్ రాష్ట్రపతి భవన్‌కు వెళ్లి రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో సమావేశం అవుతారు. రాత్రి 9.00 గంటలకుఆయన తన పర్యటనను ముగించుకుని భారతదేశం నుండి బయలుదేరుతారు. పుతిన పర్యటన సందర్భంగా ఢిల్లీలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# ఆదిలాబాద్‌కు వరాల జల్లు

(మొదటి పేజీ తరువాయి)

సీఎం పాల్గొన్నారు. అనంతరం ప్రసంగించారు. ఆదిలాబాద్ అభివృద్ధి బాధ్యత నేనే తీసుకుంటానని చెప్పుకొచ్చారు. ఎర్రబస్సు రావడమే కష్టమనుకున్న ఆదిలాబాద్‌లో ఎయిర్ బస్‌ను దించి.. పరిశ్రమలు తీసుకొచ్చే బాధ్యత ప్రజా ప్రభుత్వం తీసుకుంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఏడాది తిరిగేలోపు ఆదిలాబాద్‌లో విమానాశ్రయం నిర్మాణ పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఆదిలాబాద్‌లో ముఖ్యమంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా రూ.18.7 కోట్ల విలువైన అభివృద్ధిపనులకు శంకుస్థాపన చేసిన అనంతరం స్థానిక ఇందిరా ప్రియదర్శిని మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. రెండేళ్ల క్రితం ఓటును ఆయుధంగా మార్చి నిరంకుశ ప్రభుత్వాన్ని సాగనంపారు. ప్రజలు తెచ్చుకున్న ప్రజా ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకుంటోంది. సంక్షేమం-అభివృద్ధి రెండుకళ్లుగా భావిస్తూ ముందుకెళ్తున్నాం. రెండేళ్లుగా ఒక్క రోజు కూడా సెలవు తీసుకోకుండా పనిచేస్తున్నా. చిన్న వయసులోనే నాకు గొప్ప అవకాశం దక్కడం.. ప్రజల దీవెన, దేవుడి సంకల్పం. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి రాజకీయాలకతీతంగా కృషి చేస్తున్నాం. గత ప్రభుత్వం పదేళ్లపాటు విపక్ష ఎమ్మెల్యేలను ప్రభుత్వ కార్యక్రమా లకు కూడా అనుమతించలేదు. ఎమ్మెల్యేలను కూడా సచివాలయంలోకి రాకుండా అడ్డుకున్న ప్రభుత్వాన్ని గత పదేళ్లలో చూశాం. ఏ ఆశయంతో సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారో.. గత పదేళ్లలో అది నెరవేరలేదు. రాష్ట్ర అభివృద్ధికి తెలంగాణ రైజింగ్-2047 డాక్యుమెంటరీ రూపొందించాం. పెట్టుబడులు సాధించే లక్ష్యంతో ఈనెల 8, 9న గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్నాం అని అన్నారు. పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇంద్రవెల్లి స్ఫూర్తిగానే గత ప్రభుత్వంపై నేను పోరాటం ప్రారంభించానని అన్నారు. అధికారంలోకి రాగానే ఇంద్రవెల్లి అమరుల స్థూపం పర్యాటకంగా అభివృద్ధి చేసే దస్త్రంపై సంతకం పెట్టాను. ఆదిలాబాద్‌కు సాగునీరు అందేలా ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును వైఎస్ఆర్ చేపట్టారు. మాజీ సీఎం కేసీఆర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును పక్కకు పెట్టి రూ.లక్ష కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారు. మూడేళ్లకే కాళేశ్వరం కూలింది. ప్రజల సొమ్ము దోచుకుని అక్రమ సొమ్ము కోసం ఇవాళ ఆ కుటుంబంలో గొడవలు పడుతున్నారు. అంబేడ్కర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును తుమ్మిడిహెట్టి వద్దే నిర్మించి ఆదిలాబాద్‌కు నీరు ఇస్తాం. ఎన్నికల ఉత్సవం పూర్తి కాగానే మరో 40వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తాం అని సీఎం హామీ ఇచ్చారు. తమ్మిడిహట్టి దగ్గర ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు కట్టితీరుతామని స్పష్టం చేశారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి తానే వస్తానని తెలిపారు. ఈ ప్రాంతంలో అపారమైన సున్నపు గనులు ఉన్నాయని వివరించారు సీఎం రేవంత్‌రెడ్డి. ఇంద్రవెల్లిని పర్యాటక కేంద్రంగా మారుస్తున్నామని పేర్కొన్నారు. త్వరలోనే ఆదిలాబాద్‌కు మళ్లీ వస్తాని.... రోజంతా సమస్యలపై సమీక్షిస్తానని తెలిపారు. ఎడ్యుకేషన్, ఇరిగేషన్, కమ్యూనికేషన్‌లో ఆదిలాబాద్ అభివృద్ధి చెందుతోందని వివరించారు. ఆదిలాబాద్‌లో తప్పకుండా యూనివ ర్సిటీ ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. వర్సిటీ ఎక్కడ కట్టాలో స్థానిక నేతలంతా కలిసి ఒక నిర్ణయానికి రావాలని సూచించారు సీఎం రేవంత్‌రెడ్డి. ఇంద్రవెల్లి లో యూనివర్సిటీ కడితే బాగుంటుందని తన భావన అని తెలిపారు. ఏడాదిలో 60 వేల ఉద్యోగాలు ఇచ్చామని అన్నారు. రాబోయే రోజుల్లో మరో 40 వేల ఉద్యోగాలు ఇస్తామని స్పష్టం చేశారు. సర్పంచ్‌లను చూసి ఎన్నుకోవాలని, పనిచేసే వారికే అవకాశం ఇవ్వాలన్నారు. రాష్ట్ర మంత్రులు వివేక్ వెంకటస్వామి, జూపల్లి కృష్ణారావు, తదితరులు సభలో పాల్గొన్నారు.

# రాబోయే రోజుల్లో ప్రపంచాన్ని శాసించనున్న ఎఐ

(మొదటి పేజీ తరువాయి)

ఈ తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ అన్ని రంగాల పెట్టుబడులు ఆహ్వానిస్తున్నాం.. యంగ్ ఇండియా స్టార్టప్ కోసం ఫండింగ్ చేయాలని నిర్ణయించాం.. 1000 కోట్ల రూపాయలతో స్టార్టప్ లను ప్రోత్సహిస్తామని భట్టి విక్రమార్క వెల్లడించారు. 'క్వాంటం సిటీ'గా హైదరాబాద్ ను తీర్చిదిద్దేలా తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. 'క్వాంటం టెక్నాలజీ'లో తెలంగాణను గ్లోబల్ లీడర్ గా మార్చేలా నిపుణులు, పరిశ్రమల భాగస్వామ్యంతో దేశంలోనే తొలిసారిగా 'లాంగ్ టర్మ్ క్వాంటం స్ట్రాటజీని రూపొందించా మన్నారు. గచ్చిబౌలిలోని 'ఐఐఐటీ హైదరాబాద్'లో 'నీతి ఆయోగ్ రోడ్ మ్యాప్ ఫర్ క్వాంటం అండ్ తెలంగాణ క్వాంటం స్ట్రాటజీని గురువారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అప్పట్లో విద్యుత్, ఇంటర్నెట్ లాంటి ఆవిష్కరణలు ప్రపంచం రూపురేఖలు మార్చాయన్నారు. అదే తరహాలో రాబోయే రోజుల్లో క్వాంటం టెక్నాలజీ కూడా అనేక మార్పులకు శ్రీకారం చుట్టబోతుందన్నారు. ఏఐ, క్వాంటం టెక్నాలజీ తదితర కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్ లో తెలంగాణను గ్లోబల్ లీడర్ గా మార్చేలా పకడ్బందీ ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. 'లాంగ్ టర్మ్ క్వాంటం స్ట్రాటజీలో భాగంగా రీసెర్చ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సైబర్ సెక్యూరిటీ, లైఫ్ సైన్సెస్ యాక్సిలరేషన్, టాలెంట్ పైప్‌లైన్ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. కమ్యూనికేషన్, క్వాంటం కంప్యూటింగ్‌లో ఆర్‌అండ్ డీ, ఇన్నోవేషన్స్ ను ప్రోత్సహించేలా రూపొందించిన ఈ పాలసీ దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఒక రోల్ మోడల్ గా నిలుస్తుందన్నారు. ఇది కేవలం తమ ప్రభుత్వం రూపొందించిన ఒక పాలసీ మాత్రమే కాదని, క్వాంటం టెక్నాలజీలో దేశానికి దిశా నిర్దేశర చేసే 'డైరెక్షన్' అని అన్నారు. ఈ టెక్నాలజీ లో దేశానికి ఒక బెంచ్ మార్క్ సెట్ చేసేలా ప్రత్యేకంగా 'సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్'కు కూడా శ్రీకారం చుట్టామన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి స్టార్టప్స్, కొత్త ఆలోచనలకు భరోసానిచ్చేలా 'ఫండ్స్ ఆఫ్ ఫండ్స్'ను ప్రారంభించబోతున్నట్లు చెప్పారు. 'ఇండస్ట్రీ డే' పేరిట ప్రతి వారంలో ఒకరోజు అధికారులు, ప్రతి నెలలో ఒక రోజు సంబంధిత మంత్రి పారిశ్రామికవేత్తలతో ప్రత్యేకంగా సమావేశమవుతారన్నారు. పరిశ్రమలు ఎదుర్కొంటున్న సవాళ్లు, పరిష్కార మార్గాలు, రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం అనుసరించాల్సిన వ్యూహాలపై సలహాలు, సూచనలు స్వీకరిస్తారన్నారు.

# అనుముల రేవంత్ రెడ్డి కాదు.. అవినీతి అనకొండ: కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చారని గుర్తుచేశారు. మార్కెట్‌లో గజం ధర లక్షన్నర రూపాయలు పలుకుతుంటే ప్రభుత్వం మాత్రం కేవలం రూ.4000కు ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్తున్నదని విమర్శించారు. హైదరాబాద్ నగరంలో ఇండ్లకు, పాఠశాలలు, దవాఖానలు, చివరికి స్మశానాలకు స్థలం లేదు.. కానీ ప్రైవేట్ వ్యక్తులకు 9300 ఎకరాల భూమిని ప్రభుత్వం అప్పనంగా ఇస్తామంటున్నదని మండిపడ్డారు. ఈ 9300 ఎకరాల భూములను తిరిగి వెనక్కి తీసుకొని అక్కడ కాంగ్రెస్ చెప్తున్న ఇందిరమ్మ ఇండ్లు, యంగ్ ఇండియా స్కూళ్లు, హాస్పిటళ్లు కట్టాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో స్థలం లేదని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటిదాకా ఒక్క ఇందిరమ్మ ఇల్లు కూడా కట్టలేదన్నారు. ఇక్కడ ఉన్న కంపెనీలు తరలి వెళ్తే హైదరాబాద్ నగరంలో వాటిపైన ఆధారపడిన లక్షల మంది ఉపాధి పోతుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఈ కుంభకోణాన్ని ప్రజలకు వివరించేందుకే పారిశ్రామిక వాడల్లో పర్యటిస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రైవేట్ వ్యక్తులకు ఇస్తున్న భూముల ధర నిర్ధారణ, దాని వెనుక ఉన్న అసలు నిజాలు నిర్ధారణ జరగాలన్న ఉద్దేశంతోనే ఈ పర్యటనలు చేస్తున్నామని వెల్లడించారు. ఈ అంశాన్ని బీఆర్ఎస్ ఇక్కడితో వదిలిపెట్టదని, కాంగ్రెస్ పార్టీ హిల్ట్ పాలసీ కుంభకోణంపై త్వరలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. నగరంలోని కాలనీల ప్రజలకు ఈ అంశాన్ని వివరిస్తామని తెలిపారు. రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ప్రజా సంఘాలు, ప్రతిపక్ష పార్టీలను కలుపుకొని ముందుకు పోతామని చెప్పారు. అనుముల రేవంత్ రెడ్డి కాదని, అవినీతి అనకొండ అని విమర్శించారు. 9300 ఎకరాల ప్రభుత్వ భూమిపై కన్నేసి లక్షల కోట్ల రూపాయలు దోచుకొని ఢిల్లీకి మూటలు పంపడానికి చేస్తున్న ఈ స్కామ్ ను బీఆర్ఎస్ అడ్డుకుంటుందని స్పష్టం చేశారు. హిల్ట్ పాలసీని వెనక్కి తీసుకొని లక్షల కోట్ల విలువచేసే ప్రజల భూమిని కాపాడే దాకా తమ పోరాటం కొనసాగుతుందన్నారు. ఇది కేవలం ఆరంభం మాత్రమేనని చెప్పారు. అవసరమైతే న్యాయపోరాటం చేస్తామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాగానే ఈ పాలసీది రద్దు చేస్తామని, అవసరమైతే దీనికోసం ఒక చట్టాన్ని తీసుకువస్తామని వెల్లడించారు. రేవంత్ రెడ్డి భూ కుంభకోణంలో భాగస్వాములు కావద్దని పారిశ్రామికవేత్తలకు విజ్ఞప్తి చేశారు.

# పర్యాటక కేంద్రంగా ఉమ్మడి జిల్లా అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

వేసుకున్నాం అని జూపల్లి వివరించారు. ఆదిలాబాద్ లో ఏయిర్ పోర్టు ఏర్పాటుకు 700 ఎకరాల భూసేకరణ కోసం సీయం ఉత్తర్వులు జారీ చేశారు. అంతేకాకుండా 61 వేల ఉద్యోగాలను భర్తీ చేశాం. రానున్న రోజుల్లో మరో 40 వేల ఉద్యోగాలను భర్తీ చేస్తాం. చనాక- కొరాట బ్యారేజ్ నిర్మాణాన్ని పూర్తి చేయడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. పదేండ్లలో ఒక ఎకరానికి కూడా సాగునీరు ఇవ్వలేక పోయింది. చనాక -కొరాట బ్యారేజ్ పెండింగ్ పనులను పూర్తి చేసి ప్రారంభిస్తామని హామీనిచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు పంటనష్టం ఇవ్వలేదు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరానికి రూ.10 వేల పంట నష్టం ఇస్తుంది. మిగిలిన రైతులకు నివేదిక ఆధారంగా పంటనష్టం చెల్లిస్తాం. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏం చేయొచ్చో.. రెండేళ్లలో చేసి చూపించాం. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్తు, సబ్సిడీ గ్యాస్ నూతన రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇండ్లు, రైతులకు రూ.21 వేల కోట్లకు పైగా రుణమాఫీ,

# సుప్రీంలో రాహుల్ గాంధీకి ఊరట

(మొదటి పేజీ తరువాయి)

పొడిగించింది. రాహుల్‌గాంధీ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్, జస్టిస్ సతీష్ చంద్రలతో కూడిన ధర్మాసనం విచారణకు స్వీకరించింది. ఈ అంశాన్ని వివరంగా విచారిస్తామని తెలిపింది. 2022లో చేపట్టిన భారత్ జోడోయాత్రలో రాహుల్‌గాంధీ భారత సైన్యంపై అవమాన కరమైన వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలపై ఫిర్యాదుదారు ఉదరు శంకర్ శ్రీవాస్తవ పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ట్రయల్ కోర్టు సమన్లు జారీ చేయడాన్ని సవాలు చేస్తూ రాహుల్‌గాంధీ దాఖలు చేసిన పిటిషన్‌ను అలహాబాద్ హైకోర్టు మే 29న కొట్టివేసింది. దీంతో ఈ ఉత్తర్వులపై రాహుల్ గాంధీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ ఏడాది ఆగస్టు 4న రాహుల్ పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు ధర్మాసనం.. తదుపరి విచారణ తేదీ వరకు స్టే విధించింది.

# హెల్త్ సెక్యూరిటీ బిల్లు

(మొదటి పేజీ తరువాయి)

రూపొందించినట్లు సీతారామన్ తెలిపారు. ఆరోగ్యానికి హాని కలిగించే వస్తువులపైనే ఉదాహరణకు పాన్ మసాలా వంటి వస్తువులపై పన్ను విధించబడుతుందని ఈ బిల్లు ప్రవేశపెట్టిన సందర్భంగా నిర్మలాసీతారామన్ స్పష్టం చేశారు. కాగా, ఈ బిల్లును ప్రతిపక్ష ఎంపీలు వ్యతిరేకించారు. ప్రభుత్వం ధూమపానం చేసేవారిపై పన్ను విధిస్తుంటే.. ఢిల్లీ గాలి మాత్రం మరింత విషపూరితంగా ఉందని సిపిఐ(ఎం) ఎంపీ శివదాసన్ ఎద్దేవా చేశారు. దీనిపై ఎన్‌సిపి ఎంపి సుప్రియా సూలే స్పందించారు. ఈ బిల్లుని తేవడం మంచిదే కానీ.. సెస్ రూపంలో పన్నులు ఎందుకు వసూలు చేస్తున్నారని ఆమె ప్రశ్నించారు. పన్నుల ద్వారా ఆదాయం పెరుగుతుంది. కానీ ఈ ఆదాయం రాష్ట్రాలకు అందదు అని కేంద్రంపై ఆమె ఆరోపించారు. బీడి మాత్రం 40 శాతం స్లాబ్‌లోకి వెళ్లలేదు. 28 శాతం స్లాబ్ లేనందున బీడి 18 శాతం శ్లాబ్ కిందకి వచ్చింది అని నిర్మలా సీతారామన్ అన్నారు.

# బీజాపూర్ ఎన్‌కౌంటర్‌లో 18మంది మృతి

(మొదటి పేజీ తరువాయి)

ఎస్పీ జితేంద్ర కుమార్ యాదవ్‌తో కలిసి ఎన్‌కౌంటర్ వివరాలను గురువారం వెల్లడించారు. ఎన్‌కౌంటర్ నుంచి ప్రాణాలతో బయటపడిన మావోయిస్టులు త్వరగా లొంగిపోతే మంచిదని, లేకుంటే ప్రాణాలు పోగొట్టుకోవాల్సిన పరిస్థితి ఉంటుందని హెచ్చరించారు. కాల్పుల్లో మృతి చెందిన వారిపై రూ.1.3 కోట్ల రివార్డు ఉందని చెప్పారు. మృతుల్లో మావోయిస్టు పీఎల్జీ రెండో బెటాలియన్ కమాండర్ వెల్ల మోడియంతో పాటు కంపెనీ నెంబర్ 2, 7లకు చెందిన కీలక మావోయిస్టులు.. రైను ఓఎం, సన్ను అవలం, నందా మీడియం, లాలు, రాజు పూణెం, రమేష్ కవాసి, లక్ష్మీ తాటి, బండి, మద్వి, సుకీ లేఖం, సోమ్డి కుంజం, చందు కుర్సం, మాసే, రీనా మార్కం, సోనీ మద్వి, సంగీత పద్దంగా గుర్తించామన్నారు. మరో ఇద్దరిని గుర్తించాల్సి ఉందని తెలిపారు. బస్తర్ పరిధిలో గత 19 నెలల్లో వివిధ ఎన్‌కౌంటర్లలో 469 మంది మావోయిస్టులు మృతి చెందినట్లు ఐజీ వివరించారు. మావోయిస్టులు లొంగిపోకుంటే భద్రతా దళాలను ఎదురుకోవాల్సి ఉంటుందని తీవ్రంగా హెచ్చరించారు.

# పంచాయితీ రిజర్వేషన్లపై జోక్యం చేసుకోం

**హైదరాబాద్,డిసెంబర్ 04 :** పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లలో జోక్యం చేసుకోలేమని హైకోర్టు స్పష్టం చేసింది. చట్టప్రకారం ఎన్నికల పక్రియలో జోక్యం చేసుకోలేమని ధర్మాసనం తెలిపింది. తెలంగాణ ప్రభుత్వం కేటాయించిన రిజర్వేషన్‌ల వ్యవహారంలో దాఖలైన ఆరు పిటిషన్‌లపై విచారించిన హైకోర్టు గురువారం తీర్పు వెలువరించింది. ఎస్సీ, ఎస్టీ జనాభా లేని చోట కూడా ఆయా కులాలకు వార్డుమెంబర్లు, సర్పంచి రిజర్వేషన్లు కేటాయించారన్న పిటిషనర్లు కోర్టు దృష్టికి తెచ్చారు. 2011 జనాభా లెక్కల ప్రకారం సర్పంచి రిజర్వేషన్లు కేటాయించడం వల్ల తప్పులు దొర్లాయని తెలిపారు. రిజర్వేషన్లు కేటాయించిన చోట సంబంధిత కులానికి చెందిన వ్యక్తులు లేకపోతే ఎన్నికల నిర్వహించబోమని ఎన్నికల సంఘం కోర్టుకు తెలిపింది. ఎస్ఈసీ వాదనను రికార్డు చేసుకున్న హైకోర్టు.. పిటిషన్లపై విచారణ ముగించింది.

# రాచకొండ, సైబరాబాద్ పోలీస్ వెబ్‌సైట్లు హ్యాక్..

(మొదటి పేజీ తరువాయి)

పరిష్కరించేందుకు రెండు కమిషనరేట్లలోని ఐటీ బృందాలు యత్నిస్తున్నాయి. వెబ్‌సైట్ల పునరుద్ధరణకు ఎన్ఐసీ పర్యవేక్షణలో ప్రతినిధులు పనిచేస్తున్నారు. రెండు కమిషనరేట్ల పోలీస్ సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేస్తున్నారు. మళ్లీ హ్యాకింగ్ కాకుండా అధునాతన ఫైర్‌వాల్స్ ఆడిట్ చేస్తున్నారు. ఆడిహ్యాకింగ్‌కు కారణమైన ముఠాలను గుర్తించేందుకు సైబర్ క్రైమ్ పోలీసులతో సమన్వయం చేస్తూ సర్వర్‌ల భద్రతను బలోపేతం చేసే పనిలో నిమగ్నమయ్యారు. కాగా, ఇదే తరహాలో పలు ప్రభుత్వ శాఖల వెబ్‌సైట్లు కూడా హ్యాక్ అయినట్లు సమాచారం

# ఎసిబి వలలో ల్యాండ్ రికార్డు ఏడీ శ్రీనివాస్

● దాదాపు వందకోట్ల ఆస్తుల గుర్తింపు

**హైదరాబాద్,డిసెంబర్ 04 :** అక్రమాస్తుల కేసులో రంగారెడ్డి జిల్లా ల్యాండ్ రికార్డు ఏడీ శ్రీనివాస్‌ను ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. దాదాపు వందకోట్ల ఆస్తులు ఉన్నట్లుగా గుర్తించారు. ఏడీ శ్రీనివాస్ నివాసం, బంధువుల ఇళ్లలో సోదాలు నిర్వహించిన ఏసీబీ అధికారులు తెలంగాణ, ఏపీ, కర్ణాటకల్లో భారీగా ఆస్తులు ఉన్నట్టు గుర్తించారు. మొత్తం ఆరు ప్రాంతాల్లో సోదా లు చేసిన అధికారులు.. రాయదుర్గం మైహోంభుజలో ప్లాట్, కర్ణాటకలో 11 ఎకరాల వ్యవసాయ భూమి, అనంతపురంలో 11 ఎకరాలు, మహబూబ్‌నగర్‌లో నాలుగు ప్లాట్లు, నారాయణపేటలో రైస్ మిల్లు,3 ప్లాట్లు ఉన్నట్టు అధికారులు తెలిపారు. సోదాల్లో రూ.5లక్షల నగదు, 1.6 కిలోల బంగా రం, 770 గ్రాముల వెండి, 2 కార్లు, పలు పత్రాలను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.


# ఆదాలాబాద్‌కు ఇక మహర్దశ

## సిఎం హామీతో మారనున్న ముఖచిత్రం: మంత్రి వివేక వెంకటస్వామి

**ఆదిలాబాద్,డిసెంబర్ 04 :** సిఎం హామీలతో ఆదిలాబాద్ రూపురేఖలు మారనున్నాయని మంత్రి వివేక్ అన్నారు. అలాగే రాష్ట్రంలో జరిగే పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు 95 శాతం స్థానాల్లో విజయం సాధిస్తారని, ఎన్నికల్లో ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీకి పరాభవం తప్పదని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి అన్నారు. గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేయడంతో పాటు వాటిని పట్టణాలకు ధీటుగా అభివృద్ధి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళికలను రూపొందించిం దన్నారు. ఆదిలాబాద్ సిఎం సభలో పాల్గొన్న అనంతరం ఆయన తనను కలిసిన విలేకర్లతో మాట్లా డారు. ఆదిలాబాద్‌కు ఎయిర్‌పోర్టు, విశ్వవిద్యాలయం రావడం ప్రజాప్రభుత్వం విజయమని అన్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను క్రమక్రమంగా అమలు చేస్తున్నా మన్నారు. సన్నబియ్యం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల విద్యుత్ ఫ్రీ, నూతన రేషన్ కార్డులు అందించిన ఘనత తమ ప్రభుత్వానిదేనని తెలిపారు.

## ఎన్నికల నియమావళి తప్పకుండా పాటించాలి

**గోరి కొత్తపల్లి ఎస్సై దివ్య.**



**రేగొండ,డిసెంబర్4(పీపుల్స్ న్యూస్)**రెండవ సాధారణ స్థానిక ఎన్నికల నేపథ్యంలో ప్రతి ఒక్కరు ఎన్నికల నియమావళి పాటించాలని గోరి కొత్తపల్లి పోలీస్ స్టేషన్ ఎస్ఐ సాకపురం దివ్య ఒక ప్రకటనలో గోరి కొత్తపల్లి మండలంలో మొదటి విడత స్థానిక సర్పంచులు వార్డు సభ్యులు ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఎన్నికల నియమావళి కోడ్ అమల్లో ఉంటుందని వివిధ వర్గాల ప్రజలకు రాజకీయ పార్టీల నాయకులు పాటించాలన్నారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున ముఖ్యంగా వాట్సప్ గ్రూపు అడ్మిన్ లకు తెలియజేయు విషయం ఏమనగా మీ యొక్క వాట్సాప్ గ్రూప్ లలో ఎవరైనా ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి, ఎన్నికలకు విరుద్ధంగా పోస్టులు పెట్టినచో వారి పైన చట్టపరమైన చర్యలు తీసుకోబడునని, ఎవరైనా మైకులు కానీ డీజే లు గాని పెట్టాలి అనుకుంటే సంబంధిత అధికారుల దగ్గర పర్మిషన్ తీసుకోవాలి.లేనిచో చట్టపరమైన చర్యలు తీసుకోబడునని ఎస్ దివ్య కొత్తపల్లిగోరి మండల ప్రజలకు సూచించారు.


## ఎమ్మెల్యే గండ్రను కలిసిన రేపాక ఏకగ్రీవ సర్పంచ్ గుల్ల స్వప్న-తిరుపతి



**రేగొండ,డిసెంబర్4(పీపుల్స్ న్యూస్)** రేగొండ మండలం రేపాక గ్రామానికి చెందిన కాంగ్రెస్ అభ్యర్థి గుల్ల స్వప్న తిరుపతి ఏకగ్రీవంగా సర్పంచిగా గెలవడంతో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ను మర్యాదపూర్వకంగా కలిశారు. మొదటి విడత 11న జరిగే ఎన్నికల్లో గుల్ల స్వప్న తిరుపతి కాంగ్రెస్ పార్టీ సర్పంచిగా ఏకగ్రీవం అయ్యారు.దానితో ఎమ్మెల్యే గండ్రకు కృతజ్ఞతలుగా క్యాంపు కార్యాలయంలో గురువారం రేగొండ మండలం రేపాక గ్రామ ఏకగ్రీవ ఎన్నికైన సర్పంచ్ గుళ్ల స్వప్న - తిరుపతి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ని మంజూరునగర్ లోని ఎమ్మెల్యే క్యాంపు జిల్లా వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గూటోజు కిష్టయ్యతో కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సర్పంచ్ కు శాలువా కప్పి, స్వీటు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. రేపాక గ్రామ ప్రజల ఐక్యతతో, అభివృద్ధి లక్ష్యంతో ఏకగ్రీవంగా సర్పంచ్ ను ఎన్నుకోవడం సంతోషమని ఎమ్మెల్యే గండ్ర అన్నారు.

## ప్రజాసేవలో చెరగని ముద్ర వేసిన అజాతశత్రువు మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ కొణిజేటి రోశయ్య

**టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం**



**కూకట్ పల్లి , డిసెంబర్ 04, (పీపుల్స్ న్యూస్ ) :**నిబద్ధత, సౌమ్యత, ప్రజాసేవలో చెరగని ముద్ర వేసిన అజాతశత్రువు మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ కొణిజేటి రోశయ్య అని టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం అన్నారు. గురువారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ కొణిజేటి రోశయ్య వర్ధంతి సందర్భంగా గాంధీ భవన్ లో రోశయ్య చిత్రపటానికి టీపీసీసీ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, పీసీసీ ఉపాధ్యక్షులు టి. కుమార్ రావు, తెలంగాణ రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్, పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం లు పాల్గొని పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ సాధారణ జీవనం, ఉన్నత ఆచరణతో రాష్ట్ర రాజకీయాలకు నాణ్యత తీసుకువచ్చిన రోశయ్య ఆర్థిక క్రమశిక్షణ, ప్రజాహిత నిర్ణయాలు, నైతిక పాలనకు ప్రతీక. ఆయన నాయకత్వం, ప్రజల పట్ల ఉన్న ప్రేమ, పార్టీ పట్ల చూపిన అంకితభావం ఈ తరానికి కూడా మార్గదర్శకమే అన్నారు. ఆయనను స్మరించుకుంటూ, ప్రజాసేవ, బాధ్యతాయుత పాలన, నైతిక రాజకీయాలు అనే ఆయన చూపిన మార్గంలో కట్టుబడి ముందుకు సాగుతున్నాం అని అన్నారు.

## శ్రీ గురు దత్తాత్రేయ స్వామి ఆలయంలో ఘనంగా దత్త జయంతి వేడుకలు







**పటాన్ చెరు , డిసెంబర్ 04, (పీపుల్స్ న్యూస్ ) :** దత్త జయంతిని పురస్కరించుకొని తెల్లాపూర్ మున్సిపల్ పరిధి , లోని ముత్తంగి గ్రామంలో గల శ్రీ గురు దత్తాత్రేయ స్వామి దేవాలయం లో జాతర మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఉపేందర్, సీనియర్ నాయకులు శ్రీనివాస్, ప్రభాకర్ గుప్తా, శ్రీనివాస్ రెడ్డి, మేరాజ్ ఖాన్, రామకృష్ణ, పుర ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

# అటవీ భూముల ఆక్రమణ ఎట్టి పరిస్థితుల్లో అనుమతించవద్దు.. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**వైల్డ్ లైఫ్ సంరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలి**





**ఖమ్మం, డిసెంబర్ -04 (పీపుల్స్ న్యూస్):**జిల్లాలోని అటవీ భూముల ఆక్రమణకు ఎట్టి పరిస్థితుల్లో అనుమతించవద్దని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి స్పష్టం చేశారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన అటవీ సంరక్షణ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్ లతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ సీతారామ ఎత్తిపోతల పథకానికి సంబంధించి కాల్వల నిర్మాణానికి అవసరమైన అటవీ భూముల సేకరణ నిమిత్తం అటవీ శాఖకు ప్రత్యామ్నాయ భూ కేటాయింపు కోసం గిరిజన కార్పోరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో అందుబాటులో ఉన్న 100 ఎకరాలు బదిలీ చేసేందుకు కార్యాచరణ చేపట్టాలని సూచించారు. భూమిని గుర్తించి 15 రోజులు గడిచినప్పటికీ ఎటువంటి పురోగతి లేకపోవడం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. గిరిజన కార్పొరేషన్ సొసైటీ భూములకు సంబంధించి ప్రత్యేకంగా సర్వేయర్ లను కేటాయించి భూముల సర్వే వెంటనే చేపట్టాలని, సోమవారం నాటికి 100 ఎకరాల భూమి సిఏ కోసం బదలాయింపు ప్రక్రియ పూర్తి కావాలని కలెక్టర్ ఆదేశించారు.పోడు భూముల పట్టా పొందిన కొంత మంది రైతులను మభ్యపెట్టి సమీపంలో ఉన్న అటవీ భూముల ఆక్రమణలకు పాల్పడుతున్నట్లు సమాచారం అందుతుందని, రెవెన్యూ శాఖ అధికారులు, అటవీ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉంటూ ఇంచు అటవీ భూమి కూడా అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. వైల్డ్ లైఫ్ సంరక్షణకు చర్యలు తీసుకోవాలని అటవీ జంతువులను వేటాడితే 25 వేల నుంచి లక్ష రూపాయల వరకు జరిమానా విధించడం జరుగుతుందని అన్నారు. పోడు భూముల పట్టా ఉన్నవారు ఎవరైనా అడవి జంతువుల వేటకు పాల్పడిన, అటవీ భూముల ఆక్రమణకు ప్రయత్నించిన గతంలో జారీ చేసిన పట్టా రద్దు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అటవీ ప్రాంతంలో పోడు భూములలో 11 కేవి లైన్ లలో ప్రాధాన్యత క్రమంలో ఇన్సులేట్ చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అన్నారు. నీలాద్రి అర్బన్ పార్క్ పక్కన ఉన్న సింగరేణి కాలరీస్ బ్లాస్టింగ్ సమయం లో జింకలు పార్క్ కాంపౌండ్ దూకి రోడ్డు పైకి వచ్చి ప్రమాదాల బారిన పడుతున్నాయని, పార్క్ కాంపౌండ్ వాల్ ఎత్తును వీలైనంత పెంచేందుకు చర్యలు తీసుకోవాలని, ఎఫ్.ఆర్.ఓ. దగ్గర ఉండి అవసరం మేరకు నిర్మాణ పనులు జరిగేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు.నీలాద్రి, వెలుగుమట్ల, పులిగుండాల అర్బన్ పార్క్ లను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. యువత, పిల్లలను ఆకర్షించేలా అర్బన్ పార్క్ లో జంతువులను ఏర్పాటు చేయాలని అన్నారు. నైట్ సఫారీ ఏర్పాటు అవకాశాలు పరిశీలించాలని అన్నారు.అటవీ ప్రాంతంలో జరిగే నిర్మాణాలలో తప్పని సరిగా డ్యూరబుల్ పరికరాలు వినియోగించాలని అన్నారు. గ్రామం నుంచి కలెక్టర్ క్యాంపు కార్యాలయం వరకు కోతుల సమస్య ఉందని అన్నారు. రోడ్డుపై ఎక్కడ కూడా కోతులకు ఆహార పదార్థాలు ఇవ్వవద్దని, దీనికి సంబంధించి అవగాహన కార్యక్రమాలు, బోర్డులను ఏర్పాటు చేయాలని అన్నారు.జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్ మాట్లాడుతూ గిరిజనులు సాగుచేసే భూములకు ప్రభుత్వం అందించిన పోడు పట్టాలు ఎట్టి పరిస్థితుల్లో విస్తరించడానికి వీలు లేదని, పోడుపట్టాల్లో సమీపంలో ఉన్న అటవీ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆర్వోఎఫ్ఆర్ భూముల బండ్ లపై ఉపాధి హామీ క్రింద గచ్చకాయ ప్లాంటేషన్ చేపట్టనున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో ఇరిగేషన్ ఎస్ఇ ఎం. వెంకటేశ్వర్లు, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు విజయలక్ష్మి, జిల్లా మత్స్య శాఖ అధికారి శివప్రసాద్, ఏడి సర్వే ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాసులు, వ్యవసాయ, హార్టికల్చర్, అగ్నిమాపక, విద్యుత్, మైన్స్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, పంచాయతీ రాజ్, గ్రౌండ్ వాటర్, సింగరేణి అధికారులు, తహసిల్దార్ లు, ఎఫ్ఆర్ఓలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గత అభివృద్ధిని చూసి ఓటేసి ఆశీర్వదించండి..

**గడప గడపన ప్రచారం చేపట్టిన రేగొండ కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి గడ్డం విజయ సుధాకర్.**







**రేగొండ,డిసెంబర్4(పీపుల్స్ న్యూస్):**గతంలో తన హాయంలో రేగొండ గ్రామ సర్పంచిగా చేపట్టిన అభివృద్ధిని చూసి ఓటేసి ప్రజలు ఆశీర్వదించాలని మరోసారి కాంగ్రెస్ పార్టీ తరపున సర్పంచ్ బరిలో ఉన్న గడ్డం విజయ సుధాకర్ ఇంటింట ప్రచారం చేపడుతున్నారు. రేగొండ కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి గడ్డం విజయ సుధాకర్ దంపతులు గురువారం స్థానిక మాజీ మండల ప్రజా ప్రతినిధులతో పాటు జిల్లా నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అభ్యర్థి విజయ సుధాకర్ ప్రజలతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో చేపట్టిన చేపడుతున్న అభివృద్ధిని చూడాలని అలాగే రేగొండ గ్రామపంచాయతీ మండలంలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దామని, మరోసారి అవకాశం ఇస్తే మరింత అభివృద్ధికి అధికారుల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆశీస్సులతో రేగొండ గ్రామపంచాయతీని తీర్చిదిద్దుతానని ప్రచారాన్ని విజయ సుధాకర్ నాయకులతో కలిసి గడిపల్లె, రేగొండ రావులపల్లె గ్రామాలలో ప్రజలను కలిసి ఓటు అభ్యర్థిస్తున్నారు. 11న జరిగే పోలింగ్ రోజు ఉదయం కేంద్రాలకు వచ్చి తమ అమూల్యమైన ఓటును బ్యాట్ గుర్తుపై వేసి ఆశీర్వదించాలని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని యువత మహిళలను రైతులను వృద్ధులను కోరుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో చేపట్టిన సంక్షేమ పథకాలతో ఒక్కో ఇంటికి విద్యుత్తు, సన్న బియ్యం, ఫ్రి బస్సు, సబ్సిడీ గ్యాస్ తో నేరుగా ప్రతి ఇంటికి 2000 నుంచి 3000 వరకు అందుతున్నాయని ఇలాంటి సంక్షేమ పథకాలు మరిన్ని ప్రజలకు చేరువైనల అధికార పార్టీ అభ్యర్థులను గెలిపించాలని రేగొండ కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి గడ్డం విజయ సుధాకర్ విజ్ఞప్తి చేశారు.

# ఆదరిస్తే గ్రామాభివృద్ధికి పాటుపడతా..


**అధికార కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం.**
**సుల్తాన్పూర్ కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి కాసెట్టి సక్కుబాయి రాజయ్య.**





**రేగొండ,డిసెంబర్ 4(పీపుల్స్ న్యూస్)**అధికార కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆశీస్సులతో ప్రజలు ఆదరిస్తే అభివృద్ధికి కృషి చేస్తామని సుల్తాన్పూర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కాసెట్టి సక్కుబాయి రాజయ్య ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు.సర్పంచి అభ్యర్థి కాసెట్టి సక్కుబాయి రాజయ్య దంపతులు తమ ప్రచారాన్ని గురువారం సుల్తాన్పూర్ గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సర్పంచ్ అభ్యర్థి భర్త కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాజయ్య తన రాజకీయ జీవితం మొదటి నుంచి ఎమ్మెల్యే గండ్ర అడుగులతో ప్రారంభమయ్యాయని, నియోజకవర్గం అభివృద్ధి నిరంతరం శ్రమించే ఎమ్మెల్యే గండ్ర పార్టీ అభ్యర్థిగా నిర్ణయించడంతో బరిలోకి దిగినట్లు కాసెట్టి రాజయ్య సక్కుబాయి దంపతులు పేర్కొన్నారు. రెండేళ్ల కాలంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ పాలనలో ఇచ్చిన హామీలను నెరవేస్తూ.. నూతన గోరి కొత్తపల్లి మండలంలో అనేక సంక్షేమ అభివృద్ధి పథకాలను చేపట్టి దశబ్ద కాలంగా ప్రజలు, ప్రయాణికులు ఎదుర్కొంటున్న సుల్తాన్పూర్-జంషెడ్ బేగ్ బెట్ బ్రిడ్జి నిర్మాణం ఇటీవలనే ప్రారంభించారని, అలాగే అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా కృషి చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర పథకాలను చూసి ఓటు వేసి ఆశీర్వదించాలని అభ్యర్థి దంపతులు ఇంటింటా ప్రచారం కొనసాగిస్తున్నారు. ఇంటింటి ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి పనులను దృష్టి లో ఉంచుకుని భూపాలపల్లి నియోజకవర్గం లో మొదటి విడత స్థానిక సంస్థల ఎన్నికల్లోనిఉమ్మడి రేగొండ, గోరి కొత్తపల్లి మండలాల్లో కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేస్తున్న సర్పంచ్ వార్డు మెంబర్ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపిస్తే మరింత అభివృద్ధికి ఎమ్మెల్యే గండ్ర ఆధ్వర్యంలో చేపడతానని అభ్యర్థి సక్కుబాయి రాజయ్య ప్రజలకు హామీలు ఇస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించడం, రైతులకు అందిస్తున్న రైతు భరోసా, రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి సన్న బియ్యం, విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రైతు రుణ మాఫీ, ప్రతి పేద కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత కరెంటు, నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు, సన్న వడ్లకు 500 బోనస్ మహిళలకు ఇస్తున్న వడ్డీ లేని రుణాలు మాత్రమే కాకుండా భవిష్యత్తు లో ఇంకా ఎన్నో సంక్షేమ పథకాలు, పనులు చేయడానికి సహకరిస్తూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీ ఇచ్చి గెలిపించాలి అని సుల్తాన్పూర్ గ్రామ ప్రజలకు అభ్యర్థి సక్కుబాయి రాజయ్య దంపతులు విజ్ఞప్తి చేశారు.

# ఎన్నికల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సౌకర్యం

**జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.**
**పంచాయతీ ఎన్నికలపై ఎన్నికల కమీషనర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్.**





**ములుగు జిల్లా ప్రతినిధి డిసెంబర్ 04 (పీపుల్స్ న్యూస్)**పంచాయతీ ఎన్నికలలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోస్టల్ బ్యాలెట్ కు దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్క ఎన్నికల సిబ్బందికి తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సౌకర్యం కల్పించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు.పంచాయతీ ఎన్నికలపై రాష్ట్ర ఎన్నికల కమీషనర్ ఐ. రాణి కుముదిని నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంపత్ రావు తో కలిసి పాల్గొన్నారు.పంచాయతీ ఎన్నికల ఫలితాల ప్రకటన నియమాలు, ఏకగ్రీవ స్థానాలలో ఉప సర్పంచ్ ఎన్నిక, పోస్టల్ బ్యాలెట్ ఏర్పాటు, నామినేషన్ల పై వచ్చే ఫిర్యాదులు, తదితర అంశాల పట్ల ఎన్నికల కమిషనర్ రివ్యూ నిర్వహించి వార్డు సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నికైన చోట ఉప సర్పంచ్ ఎన్నికలకు చర్యలు తీసుకోవాలని, ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామ సర్పంచ్ పోస్టులకు సంబంధించి ఫలితాలు నిబంధనల ప్రకారం ప్రకటించాలని అన్నారు.అనంతరం అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పంచాయతీ ఎన్నికల పోస్టల్ బ్యాలెట్ వచ్చిన ప్రతి దరఖాస్తు పరిశీలించి తప్పని సరిగా అర్హులకు పోస్టల్ బ్యాలెట్ అందించాలని, ప్రతి గ్రామం, మండలాల వారీగా వివరాలు సేకరించి సంబంధిత రిటర్నింగ్ అధికారులు పోస్టల్ బ్యాలెట్ జారీ చేసేలా చూడాలని అన్నారు.మొదటి విడత పోలింగ్ జరిగే గ్రామాల్లో ఓటు హక్కు ఉండి ఎన్నికలు విధులు నిర్వహించే సిబ్బంది డిసెంబర్ 8 నాడు, రెండవ విడత వారికి 12 నాడు, మూడవ విడత వారికి 15 నాడు ఫెసిలిటేషన్ కేంద్రాలలో పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసేలా ఆదేశాలు జారీ చేయాలని కలెక్టర్ సూచించారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాల వద్ద వెబ్ కాస్టింగ్ , సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాల వద్ద మైక్రో అబ్జర్వర్ నియామకం చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో డి పి ఓ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

శుక్రవారం, డిసెంబర్ 05, 2025 | హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక | 4

# నిర్మల్ పోలీసింగ్ రాష్ట్రంలో ఆదర్శంగా నిలవాలి

**రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి.**



**హైదరాబాద్, క్రైమ్ బ్యూరో, డిసెంబర్ 04, (పీపుల్స్ న్యూస్ ) :** నిర్మల్ పోలీసింగ్ రాష్ట్రంలో ఆదర్శంగా నిలవాలని రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి అన్నారు. నిర్మల్ జిల్లాలో గురువారం రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి తన పర్యటనలో భాగంగా ఎల్లపల్లి వద్ద పోలీస్ అధికారులు, సిబ్బంది కొరకు నూతనంగా నిర్మించిన భవనాలను ఆయన పాల్గొని ప్రారంభించారు. అనంతరం నూతన జిల్లా ఎస్పీ క్యాంప్ కార్యాలయ భవన నిర్మాణానికి భూమి పూజ కార్య క్రమం రాష్ట్ర డీజీపీ చేతుల మీదుగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు సిబ్బందికి మెరుగైన వసతులు, సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ నిర్మాణాలు, భవిష్యత్‌లో నిర్మల్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయనున్నాయన్నారు. నూతనంగా నిర్మించిన ఈ ఆధునిక భవనాలు పోలీసు సిబ్బందికి మెరుగైన పనిస్థలం, నివాస వాతావరణం అందించడమే కాకుండా, జిల్లాలో సేవల నాణ్యతను పెంచేందుకు దోహదపడతాయని అన్నారు., ప్రజా సేవలో మరింత నిబద్ధతతో పనిచేయాలని అన్ని స్థాయి అధికారులను డీజీపీ సూచించారు. ఈ కార్యక్రమాల్లో ఎం.ఎల్.ఏ మహేశ్వర్ రెడ్డి, ఐ.జి.పి(పి అండ్ ఎల్)ఎండీ.టి.జి.పి.హెచ్.సి రమేష్, జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్,పోలీస్ అధికారులు, జిల్లా ఉన్నతాధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# డిజిపి కార్యాలయంలో ఘనంగా మాజీ గవర్నర్ కె. రోశయ్య వర్ధంతి వేడుకలు



**హైదారాబాద్,క్రైమ్ బ్యూరో, డిసెంబర్ 04, (పీపుల్స్ న్యూస్) :**మాజీ గవర్నర్ , ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కె.రోశయ్య వర్ధంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారిక కార్యక్రమంగా డిజిపి కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. శాంతిభద్రతల అదనపు డిజిపి మహేష్ ఎం భగవత్ రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల గవర్నర్ పనిచేసిన రోశయ్య సేవలను ఆయన స్మరించుకున్నారు. శాంతి భద్రతల ఏఐజి రమణకుమార్, డిజిపి కార్యాలయ పోలీస్ అధికారులు, మినిస్ట్రీయల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.?

# సైబరాబాద్, రాచకొండ పోలీస్ వెబ్ సైట్లు హ్యాక్

**హైదరాబాద్, డిసెంబర్ 4:** సైబర్ నేరాలపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తూ, ప్రజలను అప్రమత్తం చేస్తున్న పోలీసులకే సైబర్ నేరగాళ్లు షాకిచ్చారు. ఏకంగా పోలీస్ శాఖకు చెందిన రెండు వెబ్‌సైట్లను కేటుగాళ్లు హ్యాక్ చేశారు. సైబరాబాద్, రాచకొండ పోలీస్ వెబ్‌సైట్లను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేశారు. దీంతో వారం రోజులుగా రెండు కమిషనరేట్ల పోలీస్ వెబ్ సైట్లు పని చేయని పరిస్థితి. వెబ్ సైట్లలో మాల్వేర్ చొరబడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీస్ స్టేషన్ల వివరాలతో పాటు పోలీస్ అధికారుల కాంటాక్ట్ నంబర్లు కూడా హ్యాక్‌కు గురైనట్లు తెలుస్తోంది. దీంతో రెండు కమిషనరేట్ల ఐటీ బృందాలు వెంటనే రంగంలోకి దిగాయి. సమస్యను వేగంగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాయి.వెబ్ సైట్ల పునరుద్ధరణకు నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ () పర్యవేక్షణలో ఢిల్లీకి చెందిన సైబర్ సెక్యూరిటీ సంస్థ ప్రతినిధులు పనిచేస్తున్నారు. రెండు కమిషనరేట్ల వెబ్‌సైట్లకు అవసరమైన సాఫ్ట్‌వేర్‌ను పోలీసులు అప్డేట్ చేయిస్తున్నారు. మరోసారి హ్యాకింగ్‌కు గురి కాకుండా అధునాతన ఫైర్వాల్స్ ఐటీ టీమ్ ఆడిట్ చేస్తోంది. రెండు కమిషనరేట్లకు చెందిన వెబ్‌సైట్లకు హ్యాకింగ్ చేసిన ముఠాను పట్టుకునేందుకు సైబర్ క్రైమ్ పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

# హిడ్మా ఎన్‌కౌంటర్‌పై మావోయిస్టు పార్టీ కీలక లేఖ

**హైదరాబాద్, డిసెంబర్ 4:** మావోయిస్టు కీలక నేత హిడ్మా ఎన్‌కౌంటర్‌పై మావోయిస్టు పార్టీ మరో సంచలన లేఖను విడుదల చేసింది. హిడ్మాది పూర్తిగా బూటకపు ఎన్‌కౌంటర్ అంటూ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ ప్రతినిధి వికల్ప్ పేరుతో లేఖ విడుదలైంది. హిడ్మాతో పాటు శంకర్లను పట్టుకుని చిత్రహింసలు పెట్టి చంపేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీకి చెందిన కొందరు కలప వ్యాపారుల ద్రోహం వల్లనే వీళ్ళు దొరికిపోయారని మండిపడ్డారు. అనారోగ్యంతో ఉన్న హిడ్మా, శంకర్లు చికిత్స కోసం విజయవాడకు వెళ్లినట్లు చెప్పారు.కలప వ్యాపారులతో కలిసి విజయవాడకు వెళితే వాళ్ళని పట్టుకున్నారన్నారు. వారం రోజుల పాటు చిత్రహింసలకు గురిచేసి ఆంధ్రా పోలీసులు చంపేశారని ఆరోపించారు. హిడ్మా, శంకర్ల ఎన్‌కౌంటర్లపై సమగ్ర దర్యాప్తు చేయాలని దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ ప్రతినిధి వికల్ప్ లేఖలో స్పష్టం చేశారు.కాగా.. గత నెలలో (నవంబర్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో రెండు భారీ ఎన్‌కౌంటర్లు జరిగిన విషయం తెలిసిందే. నవంబర్ 18న జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావో కీలక నేత హిడ్మాతో పాటు ఆయన భార్య, పలువురు అనుచరులు హతమవ్వగా, నవంబర్ 19న జరిగిన ఎన్‌కౌంటర్‌లో కామ్రేడ్ శంకర్ సహా ఆరుగురు మృతి చెందారు. ఈ రెండు ఎన్‌కౌంటర్లలో మొత్తం 13 మంది మావోయిస్టులు హతమయ్యారు. అలాగే ఘటనా స్థలంలో దొరికిన డైరీలోని సమాచారం ఆధారంగా ఏపీలోని పలు జిల్లాల్లో పోలీసులు తనిఖీలు చేసి దాదాపు 50 మంది మావోయిస్టులను పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు తరలించారు.

# విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు ఎంతో అవసరం














## పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్ చెరు, డిసెంబర్ 04, (పీపుల్స్ న్యూస్ ) :** ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులకు విద్యతోపాటు క్రీడలు ఎంతో అవసరమని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్ చెరు డివిజన్ పరిధిలోని మైత్రి మైదానంలో పటాన్ చెరు ప్రైవేట్ రికగ్నైజ్డ్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గస్థాయి ప్రైవేట్ పాఠశాలల క్రీడా పోటీలను ఎమ్మెల్యే జిఎంఆర్ లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి క్రీడలపై ఆసక్తి పెంపొందిస్తే మానసిక వికాసం, శారీరక ధారుడ్యం లభిస్తుందని తెలిపారు. ర్యాంకుల మాయలో పడి క్రీడలను నిర్లక్ష్యం చేయవద్దని పాఠశాల యాజమాన్యాలకు, విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. పటాన్చెరు నియోజకవర్గంలో క్రీడల అభివృద్ధికి ఎల్లప్పుడూ సంపూర్ణ సహకారం అందించడంతో పాటు.. ఆధునిక వసతులతో స్టేడియాలు అందుబాటులోకి తీసుకొని వస్తున్నామని



తెలిపారు.ఈ కార్యక్రమంలో పటాన్ చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, ట్రస్మ రాష్ట్ర కోశాధికారి రాఘవేంద్ర రెడ్డి, ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ నియోజకవర్గ అధ్యక్షులు సాయి తేజ, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, ఎస్సై మహేశ్వర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# రంగారెడ్డి జిల్లా ల్యాండ్ రికార్డ్స్ ఏడి శ్రీనివాస్ నివాసంలో ఏసీబీ సోదాలు

**హైదరాబాద్:** రంగారెడ్డి జిల్లా ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాస్ నివాసంలో ఏసీబీ సోదాలు () నిర్వహిస్తున్నది. ఆయనపై ఆదాయానికి మించి ఆస్తుల కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో ఆరు బృందాలతో ఏసీబీ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్



జిల్లాల్లో సోదాలు కొనసాగుతున్నాయి. రాయ్‌దుర్గ మై హోమ్ భుజ, బాలానగర్, రంగారెడ్డి కలెక్టరేట్ తోపాటు జిల్లాలో ఆరు చోట్ల సోదాలు చేస్తున్నారు. శ్రీనివాస్ సోదరుడు, బంధువులు ఇండ్లలో తనిఖీలు చేస్తున్నారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ భారీగా అక్రమాస్తులు సంపాదించినట్లు గుర్తించారు. అదేవిధంగా పలు చోట్ల షెల్ కంపెనీల పేరుతో వ్యాపారాలు చేస్తున్నట్లు అధికారులు భావిస్తున్నారు. మహబూబ్‌నగర్‌లో ఒక రైస్ మిల్లు కూడా ఉన్నట్లు గుర్తించారు.

# హైదరాబాద్‌లో చలాన్లపై డిస్కౌంట్

**హైదరాబాద్ :** మీ వాహనంపై ఎన్ని ట్రాఫిక్ చలాన్లు ఉన్నాయి.? ఎక్కువ చలాన్లు ఉన్నాయని డిస్కౌంట్ వచ్చాక కడదామని చూస్తున్నారా.? ఈ మధ్య సోషల్ మీడియాలో ట్రాఫిక్ చలాన్లపై భారీగా రాయితీలు ఇచ్చారంటూ వార్తలు వచ్చాయి. అవి చూశారా.? అయితే మీరు పప్పులో కాలేసినట్టే. గత కొన్నిరోజులుగా ట్రాఫిక్ చలాన్లపై భారీగా రాయితీలు ఇస్తున్నారంటూ ఇంటర్నెట్‌లో వచ్చిన వార్తలపై హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు స్పందించారు. అదంతా పూర్తిగా అవాస్తవం అని తేల్చి చెప్పారు.



ప్రజలు ఇలాంటి తప్పుడు వార్తలు నమ్మొద్దని పోలీసులు సూచి ంచారు.ముఖ్యంగా డిసెంబర్ 13న ట్రాఫిక్ చలాన్లపై 100 శాతం వరకు తగ్గింపు ఇస్తున్నారంటూ జరుగుతున్న ప్రచారంపై పోలీసులు స్పష్టతనిచ్చారు. తమ ట్విట్టర్ హ్యాండిల్‌లో పోస్ట్ చేసి క్లారిటీ ఇచ్చారు. డిసెంబర్ 13న ట్రాఫిక్ చలాన్లకు సంబంధించి ఎలాంటి లోక్ అదాలత్‌ను నిర్వహించడం లేదని పోలీసులు పూర్తీ క్లారిటీ ఇచ్చారు. అలాంటి అధికారిక నోటిఫికేషన్ కూడా ఏది జారీ కాలేదని అన్నారు. కావున ప్రజలు ఇలాంటి ఫేక్ న్యూస్‌లు చూసి మోసపోవద్దు అని.. ట్రాఫిక్ చలాన్లపై ఎలాంటి రాయితీలు లేవని తేల్చి చెప్పారు. ప్రస్తుతం దీనిపై అధికారిక ప్రకటన ఏది లేదని.. తప్పుడు సమాచారాన్ని ఫార్వార్డ్ చేయకుండా.. బాధ్యతాయుతమైన పౌరులుగా వ్యవహరించాలని హైదరాబాద్ సిటీ పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అటు ఇటీవల ట్రాఫిక్ చలాన్లపై రాయితీలు ప్రకటించడం సరికాదని.. అలా చేస్తే వాహనదారుల్లో ఎలాంటి భయం ఉండదని.. నిబంధనల ఉల్లంఘన ఇంకా ఎక్కువ జరుగుతుందని హైకోర్టు పేర్కొన్న విషయం తెలిసిందే.

# పవన్ మాటలను వక్రీకరిస్తూ ప్రజల మనోభావాలతో ఆడుకోరాదు




**ధర్మవరం(అనంతపురం):** రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి పవన్‌కల్యాణ్ మాటలను వక్రీకరించి ప్రజల మనోభావాలతో ఆడుకోవడం మంచిదికాదని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన గురువారం పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు రెండు తెలుగురాష్ట్రాలూ సమానమే అన్నారు. ఆయన ఎప్పుడూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల అభివృద్ధిని కోరుకుంటారన్నారు. కోనసీమ ఎప్పుడూ పచ్చదనంతో ఉండేది,ఈ పచ్చదనం గురించి ఆంధ్ర, తెలంగాణ ప్రజలు చర్చించకునే వారు అన్నారే కానీ ఎక్కడా తెలంగాణ ప్రజల వల్ల అన్యాయం జరిగిందని అనలేదన్నారు. దీనిని వక్రీకరించడం బావ్యం కాదన్నారు. అదేవిధంగా పేర్నినాని లాంటి వాళ్లు తిన్నింటి వాసాలు లెక్కపెడతారని గ్రహించిన ఆంధ్ర ప్రజలు ఆయనకు, ఆయన పార్టీకి గత ఎన్నికల్లో బుద్ధి చెప్పినా జ్ఞానోదయం కాలేదని మండిపడ్డారు. త్వరలో వైసీపీకి గోరీ కట్టే రోజు దగ్గరలోనే ఉందని ఆయన అన్నారు.

## వందే భారత్‌కు ప్రశాంతి నిలయంలో స్టాపింగ్




**గుంతకల్లు(అనంతపురం):** కలబురగి-బెంగళూరు-కలబురగి వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను ఇకపై సత్యసాయి ప్రశాంతి నిలయం రైల్వే స్టేషన్‌లోనూ నిలపనున్నట్లు రైల్వే అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ రైలును జనవరి 2వ తేదీ నుంచి ఎస్-ఎసపీఎన్ స్టేషన్‌లో రెండు నిమిషాలసేపు స్టాపింగ్‌ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. అలాగే ఈ రైలు వేళలను కూడా సవరించినట్లు తెలిపారు. కలబురగి-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (నం. 22231) ఉదయం 5-15 గంటలకు కలబురగిలో బయలుదేరి, మధ్యాహ్నం 2 గంటలకు బెంగళూరుకు చేరేది.ఇకపై ఈ రైలు ఉదయం 6-10 గంటలకు బయలుదేరుతుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 22232) బెంగళూరులో 15 నిమిషాలు ఆలస్యంగా బయలుదేరి, మునుపటి సమయంలోనే గమ్యస్థానానికి చేరుతుందన్నారు. ఇదేవిధంగా యశ్వంతపూర్-మచిలీపట్టణం ఎక్స్‌ప్రెస్ (నం. 17212) బెంగళూరులో జనవరి 1 నుంచి మధ్యాహ్నం 1-15 గంటలకు కాకుండా 12-45 గంటలకే బయలుదేరుతుందన్నారు.కానీ గమ్యస్థానానికి యథా ప్రకారంగానే చేరుతుందన్నారు. బెంగళూరు-భువనేశ్వర్ మధ్య నడిచే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ (నం. 18464)ను గిద్దలూరు స్టేషన్ నుంచి డోన్ స్టేషన్ వరకూ సమయాలను మార్పుచేసినట్లు తెలియజేశారు. ముంబై-కోయంబత్తూరు కుర్లా ఎక్స్‌ప్రెస్ (నం. 11013) జనవరి 1 నుంచి ధర్మవరం నుంచి ధర్మపురం స్టేషన్ వరకూ వేళలను స్వల్పంగా మార్పుచేసినట్లు వివరించారు.

# పదవి పోయిన తర్వాత ఏపీలో ఎన్ని రోజులు ఉన్నావ్ జగన్



**విజయనగరం , డిసెంబరు 4 :** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పదవి పోయిన తర్వాత ఏపీలో జగన్ ఎన్ని రోజులు ఉన్నారో చెప్పాలని అన్నారు. ఆయన తమ ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలని సవాల్ విసిరారు. (గురువారం) విజయనగరంలో హోంమంత్రి అనిత పర్యటించారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు హోంమంత్రి అనిత.జగన్ హయాంలో ప్రజా సమస్యలను పరిష్కరించకుండా గాలికొదిలేశారని మండిపడ్డారు. ధాన్యం అమ్మిన రైతులకు 24 గంటల్లోగా డబ్బులు జమ చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని చెప్పుకొచ్చారు. టిడ్కో ఇళ్లు పేదలకు అందకుండా చేసిన పాపం జగన్‌దని.. లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు అందిస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదని తెలిపారు. ఆయుధాలు విడిచిపెట్టి మావోయిస్టులను లొంగిపోవాలని కోరుతున్నామని అన్నారు. ప్రకృతి వైపరీత్యాలను అడ్డుకోలేమని... ఆపదలో ఉన్న వారిని సకాలంలో ఆదుకుంటామని హోంమంత్రి అనిత పేర్కొన్నారు

# ఏపీకి మరో పిడుగులాంటి వార్త



**అమరావతి:** నైరుతి బంగాళాఖాతంలోని వాయుగుండం తీవ్ర అల్పపీడనంగా బలహీనపడి పశ్చిమ దిశగా కదులుతోందని భారత వాతావరణ విభాగం అంచనా వేసింది. ఇది ఈ రోజు అల్పపీడనంగా బలహీనపడు తుందని వెల్లడించింది. ఈ ప్రభావంతో తమిళనాడులో మరో రెండు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు కొనసాగుతాయని వెల్లడించింది. ఏపీలో గురువారం నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ప్రకాశం, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్ఆర్ కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.దిత్వా తుపాను ప్రభావంతో ఇప్పటికే శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో పలుచోట్ల వర్షాలు కురుస్తున్నాయి. నెల్లూరులో బుధవారం రాత్రి నుంచి ఎడతెరిపిలేని వర్షం పడుతోంది. నగరంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాగులు, చెరువులు పొంగిపొర్లుతున్నాయి. గూడూరులో వర్షం దంచి కొడుతోంది. చిల్లకూరు జాతీయ రహదారి నీటమునిగింది. గూడూరులో లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. గూడూరు, పారిచర్లవారి పాలెం, విందూరుకు రాకపోకలు నిలిచిపోయాయి. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. పంబలేరు, ఉప్పుటేరు వాగులు పొంగిపొర్లుతున్నాయి, వాకాడు బ్యారేజ్ 8 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. గూడూరు దైవాలదిబ్బ నుంచి స్థానికులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

# అమరావతి కోసం రెండో విడత ల్యాండ్ పూలింగ్ ప్రారంభం



**పల్నాడు జిల్లా, డిసెంబర్ 4:** అమరావతి కోసం రెండో విడత ల్యాండ్ పూలింగ్ ప్రక్రియ (గురువారం) ప్రారంభమైంది. ఇందులో భాగంగా అమరావతి మండలం యండ్రాయిలో గ్రామ సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి నారాయణ, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పాల్గొన్నారు. రెండో విడతలో అమరావతి మండలంలో నాలుగు గ్రామాలకు చెందిన రైతుల నుంచి అధికారులు భూమిని సేకరించనున్నారు. ముందుగా యండ్రాయి గ్రామంలో ల్యాండ్ పూలింగ్ ప్రక్రియను అధికారులు మొదలుపెట్టారు. ఈ సందర్భంగా అమరావతి కోసం యండ్రాయి రైతు నంబూరి బలరాం 4 ఎకరాల భూమిని ఇచ్చారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సమక్షంలో మంత్రి నారాయణకు పొలం పత్రాలను రైతు నంబూరి అందజేశారు.అందుకే ఆలస్యం: మంత్రి నారాయణగత వైసీపీ ప్రభుత్వం గుత్తేదారులకు బిల్లులు చెల్లించకపోవడంతో రాజధాని నిర్మాణం ఆలస్యమైందని ఈ సందర్భంగా మంత్రి నారాయణ విమర్శించారు. గుత్తేదారులకు చెల్లించాల్సిన బకాయిలు ఇచ్చి మళ్లీ రాజధాని పనులు ప్రారంభించే సమయానికి వర్షాలు ముంచెత్తాయని తెలిపారు. అంతర్జాతీయ రాజధాని నిర్మాణంలో భాగంగా స్మార్ట్ ఇండస్ట్రీలు, ఇంటర్నేషనల్ విమానాశ్రయం, ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ సిటీ ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారని అన్నారు. రెండో విడతలో రైతులు ఇచ్చే 7000 పైగా ఎకరాల భూముల్లో 2500 ఎకరాలలో అంతర్జాతీయ స్పోర్ట్స్ సిటీ ఏర్పాటు చేయనున్నామని వెల్లడించారు.గతంలో భూ సమీకరణ సమయంలో రాజధాని రైతుల విషయంలో అనుసరించిన విధానాన్నే ఇక్కడ కూడా అమలు చేస్తామని చెప్పారు. ట్రంకు రోడ్లు, ప్రధాన రహదారులను వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నాలుగు, ఆరు లైన్ల రహదారి నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించామని.. ఇక్కడ కూడా ఏడాది కాలంలోనే స్పోర్ట్స్ సిటీ నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి నారాయణ పేర్కొన్నారు.

# అంతా రాజకీయాల కోసమే పరకామణి కేసుపై జగన్ కీలక వ్యాఖ్యలు



**అమరావతి, డిసెంబర్ 4:** పరకామణి వివాదం ఆశ్చర్యం కలిగించే కేసు అని మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు. గురువారం మీడియాతో మాటాడుతూ. పరకామణి కేసులో దొరికింది 9 డాలర్లు అని.. ప్రాయశ్చిత్తంగా రూ.14 కోట్ల ఆస్తులను టీటీడీకి ఇచ్చారని తెలిపారు. దొంగ దొరకగానే కేసు నమోదైందని.. తిరుపతి కోర్టులో చార్జ్ షీట్ వేశారని తెలిపారు. మెగా లోక్ అదాలత్‌లో కేసును పరిష్కరించారని అన్నారు. జ్యుడిషియల్ విచారణ జరిగాక.. మళ్లీ కేసును తెరపైకి తెచ్చారని మండిపడ్డారు.రాజకీయాల కోసం ఇదంతా తిరగదోడుతున్నారని మండిపడ్డారు. పరకామణి దొంగ.. జీయర్ స్వామి మఠంలో క్లర్క్‌గా పనిచేశారని అన్నారు. పరకామణి లెక్కింపులో ఎన్నో ఏళ్లుగా ఉన్నారని తెలిపారు. తిరుమల హుండీ లెక్కింపును తాము పారదర్శకం చేశామని వెల్లడించారు. పరకామణిలో ప్రతిచోట సీసీ కెమెరాలు పెట్టించామన్నారు. తిరుమలలో పారదర్శక వ్యవస్థ సృష్టిస్తే తమపై నిందలా అంటూ వ్యాఖ్యలు చేశారు. పరకామణి కేసు పట్టుకున్న వ్యక్తిని మరణించేలా చేశారన్నారు. చోరీ చేస్తున్న దొంగను పట్టుకోవడం నేరమా అంటూ మాజీ సీఎం జగన్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.రైతుల పరిస్థితి దారుణం.సేవ్ ఆంధ్రప్రదేశ్ అనేలా రాష్ట్రంలో పాలన ఉందని ఏపీలో రైతుల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. వైసీపీ హయాంలో వ్యవసాయాన్ని పండగ చేశామని.. పండగలా ఉన్న వ్యవసాయాన్ని దండగలా ఈ ప్రభుత్వం మార్చిందని మండిపడ్డారు. 19 నెలల చంద్రబాబు పాలనలో 17 సార్లు ప్రకృతి వైపరిత్యాలు వచ్చాయన్నారు. తుఫానుతో నష్టపోయిన రైతులకు ఒక్క పైసా రాలేదని అన్నారు. తుఫాను కంటే ముందే కొనాల్సిన పంటల కొనుగోలు చేయలేదని ఫైరయ్యారు. రూ.1,100 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ బకాయిలు ఇవ్వలేదని ఆరోపించారు.రైతులకు హక్కుగా ఉన్న పంట బీమా పథకాన్ని రద్దు చేశారని.. కేజీ అరటిపండ్లు అర్ధ రూపాయంటే రైతులు ఎలా బతకాలని ప్రశ్నించారు. తమ హయాంలో అరటి, చీని రైతుల కోసం ప్రత్యేక రైళ్లు నడిపామని.. ఏపీ నుంచి ఢిల్లీ, ముంబైకి రైళ్లలో 3లక్షల టన్నులు ఎక్స్‌పోర్ట్ చేశామని చెప్పుకొచ్చారు. రైతులకు ఏ పంటకూ మద్దతు ధర వచ్చే పరిస్థితి లేదన్నారు. తమ హయాంలో ఏర్పాటు చేసిన కోల్డ్ స్టోరేజీలను మూసేశారని.. ఈక్రాప్ వ్యవస్థను చంద్రబాబు భ్రష్టు పట్టించారని దుయ్యబట్టారు.

# నిప్పులు చెరిగిన ఎమ్మెల్యే సునీత తోపువి కోతలే తప్ప చేతలుండవు



**అనంతపురం:** తాను తోపునని చెప్పుకునే మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డివి మాటల్లో కోతలు తప్పా... చేతల్లో అభివృద్ధి ఎక్కడా చూపించలేని దద్దమ్మ అని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆత్మకూరు మండలం తోపుదుర్తి గ్రామంలో నూతనంగా నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్, సీసీ రోడ్లను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తోపుదుర్తి గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్ లేక గత కొన్ని సంవత్సరాలుగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని అన్నారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో ఇక్కడ రెండు చెరువులు నిండాయని తెలిపారు.పంటలు సాగు చేయాలంటే విద్యుత్ సమస్యలు ఎక్కువగా ఉండేవని గుర్తు చేశారు. ఈ సమస్యలు అధిగమించేందుకు విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు చేయించామన్నారు. గత ప్రభుత్వంలో ఇక్కడ ఎమ్మెల్యేగా ఉన్న ఓ దద్దమ్మ వీటిని పూర్తి చేయలేకపోయారని విమర్శించారు. ప్రకాష్ రెడ్డి ఎక్కడ చూసినా కమీషన్ల కక్కుర్తితో టీడీపీ హయాంలో ప్రారంభించిన ఏ ఒక్క పనిని ముందుకు సాగనివ్వలేదన్నారు. ఆయన సొంత గ్రామంలో కనీసం విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయించుకోలేని అసమర్థుడు.. ఆ సైకో తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అంటూ నిప్పులు చెరిగారు.విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం ఆగిపోయి పూర్తిగా రద్దు చేస్తారన్న క్రమంలో తాను చొరవ తీసుకొని కాంట్రాక్టర్‌తో మాట్లాడి పాత ధరలకే నిర్మాణం చేపట్టామన్నారు. నిర్ణీత కాలంలోనే పూర్తి చేశామని, ప్రారంభోత్సవం కాస్త ఆలస్యమైందన్నారు. ఈ సబ్ స్టేషన్‌తో తోపుదుర్తి, వేపచెర్ల, పాలచెర్ల గ్రామాల్లోని సుమారు రెండు వేల మంది ప్రజలు, రైతులకు ఉపయోగం ఉంటుందన్నారు. ఎన్నికల ముందు మాత్రమే తాను రాజకీయాల గురించి మాట్లాడతానని, ఇప్పుడు ఓట్లు వేసినా, వేయకపోయినా అందరూ తన వారే అన్నారు.గతంలో ఇక్కడున్న తోపు ఏదో చేస్తారన్న ఉద్దేశంతో గెలిపిస్తే కనీసం సొంత గ్రామానికి రోడ్డు వేయించలేకపోయారని ఎద్దేవా చేశారు. ఇళ్ల నిర్మాణాల పేరుతో రూ.80 కోట్లు దోపిడీ చేశారని ఆరోపించారు. సొంత గ్రామానికి రోడ్డు వేసుకోలేక అనంతపురం, తగరకుంట రోడ్డులో వెళ్లే చాలామంది ఐదేళ్లపాటు నరకం చూశారన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరులో గతంలో పార్టీని చూశారని.. ఇప్పుడు ఆ పరిస్థితి ఉండకూడదన్నారు. గ్రామంలో మారెమ్మ ఆలయ నిర్మాణంతో పాటు పలు పనుల గురించి తన దృష్టికి తీసుకొచ్చారని... త్వరలోనే చేపడతామని ఎమ్మెల్యే.. గ్రామస్థులకు హామీ ఇచ్చారు.

# తెలుగు చదువుకుంటేనే ఉద్యోగం వెంకయ్యనాయుడు కీలక వ్యాఖ్యలు



భారతీయ భాషలను కాపాడాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ

**కృష్ణా , డిసెంబరు 4 :** తెలుగు భాషపై భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. తెలుగు చదువుకుంటేనే ఉద్యోగం ఇస్తామంటేనే తెలుగు చదువుతారని వ్యాఖ్యానించారు. మచిలీపట్నం కృష్ణా యూనివర్సిటీలో కృష్ణా తరంగ్ - 2025 ఉత్సవాలను ఇవాళ(గురువారం) ప్రారంభించారు. రామోజీ గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు జయంతి సందర్భంగా తెలుగు భాషను ప్రభుత్వ కార్యక్రమాల్లో ఉత్తర, ప్రత్యుత్తరాలు చేసేలా ఉండాలని తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు సూచించారు. అదే రామోజీరావుకి ఇచ్చే ఘన నివాళి అని తెలిపారు.ఇంగ్లీష్ వాళ్లు వారి భాషను అధికార భాషగా ఏర్పాటు చేసుకుని పాలన చేశారని... మనం తెలుగు వాళ్లం కాబట్టి తెలుగును పరిపాలన భాషగా చేసుకోవాలని సూచించారు. ఆలోచిస్తున్నారని చెప్పుకొచ్చారు. మెడికల్, ఇంజనీరింగ్ బోధన ఆయా మాతృభాషల్లో జరిగేలా ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. మనకు ఇంగ్లీష్ మాట్లాడటం రాకపోయినా పేపర్ మీద రాసుకుని మాట్లాడతారని పేర్కొన్నారు వెంకయ్య నాయుడు.ఇంగ్లీష్ మాట్లాడితేనే గొప్ప అని కొంతమంది భావిస్తున్నారని.. ముందు మాతృభాషకు ప్రాధాన్యత ఇవ్వాలని... ఆ తర్వాత సోదర భాషలు నేర్చుకోవాలని కోరారు. తాను చదువుకునే రోజుల్లో తెలియక హిందీ వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్నానని గుర్తుచేశారు. తాను వీధి బడిలో చదువుకుని... ఉప రాష్ట్రపతి వరకు వెళ్లానని తెలిపారు. దేశంలో 22 భాషలు ఉన్నాయని... రాజ్యసభలో ఈ భాషలోనైనా మాట్లాడవచ్చనే ఉత్తర్వులు ఇచ్చామని వెంకయ్య నాయుడు పేర్కొన్నారు.

# విశాఖ సమ్మిట్‌తో 50 వేల ఉద్యోగాల అవకాశాలు



**అమరావతి, డిసెంబరు 4:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన 13వ ఎస్ఐపీబీ సమావేశం (గురువారం) ఏపీ సచివాలయంలో జరిగింది. ఈ సమావేశానికి సంబంధించిన వివరాలను మీడియాకు మంత్రి కందుల దుర్గేశ్ వివరించారు.సీఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్‌లో కూడా భారీగా ఎంవోయూలు జరిగాయని గుర్తుచేశారు. పెద్ద ఎత్తున వివిధ రంగాల్లో పెట్టుబడులు వచ్చాయని పేర్కొన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లోనే కాకుండా స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను ఈ 18 నెలల్లో ఇచ్చామని తెలిపారు మంత్రి కందుల దుర్గేశ్.రూ.20,440 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపామని అన్నారు. 26 సంస్థలు తమ యూనిట్ల ఏర్పాటుకు అంగీకరించాయని వివరించారు. విశాఖ సమ్మిట్ ద్వారా 50వేల ఉద్యోగాలు వస్తాయని భావించామని అన్నారు. తమ ప్రభుత్వం ద్వారా ఎర్లిబర్డ్ ఇన్సెంటివ్‌లు కూడా ఇస్తున్నామని చెప్పుకొచ్చారు. ఎంవోయూలు సరైన దిశలో అమలు చేయడానికి సీఎం, మంత్రివర్గ ఉపసంఘం, మంత్రులు ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. వీటన్నింటిని వరల్డ్ ఎకనామిక్ ఫోరంతో ప్రెజంట్ చేయడానికి కృషి చేయాలని సీఎం చంద్రబాబు చెప్పారని అన్నారు. ఇన్నిపెట్టుబడులు రావడానికి కారణం తమ ప్రభుత్వానికి పెరిగిన క్రెడిబిలిటీనే కారణమని మంత్రి కందుల దుర్గేశ్ పేర్కొన్నారు.ఎనర్జీ సెక్టర్‌లో 40శాతం ఎంవోయూలు: మంత్రి టీజీ భరత్‌నర్జీ సెక్టర్‌లో 40శాతం ఎంవోయూలు జరిగాయని మంత్రి టీజీ భరత్ వ్యాఖ్యానించారు. ఎంవోయూలు ఫాలోఅప్‌కు గురువారం) రివ్యూ జరిగిందని తెలిపారు. పోర్టల్‌లో ఎంవోయూలు అప్‌లోడ్ చేశామని.. ఇవీ ఏ స్థాయిలో ఉన్నాయో ఎప్పటికప్పుడు తెలిసేలా ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరానికి వెళ్లే లోపు వీలైనన్ని గ్రౌండ్ అయ్యేలా చూడాలని సీఎం చంద్రబాబు చెప్పారని అన్నారు. జనవరి 18వ తేదీలోగా గ్రౌండ్ చేయడం ద్వారా రూ. 1000 కోట్ల పెట్టుబడి ఏపీకి వస్తే వారికి ఓ ఆఫీసర్ ప్రత్యేకంగా ఫాలోఅప్ అవుతారని చెప్పుకొచ్చారు మంత్రి టీజీ భరత్.ప్రపం చం మొత్తంలో విశాఖపట్నంలో ఏర్పాటు చేసే గూగుల్‌కు ఒక బజ్ వచ్చిందని వివరించారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో తాము ముందుకు వెళున్నామని తెలిపారు. మంత్రులు, పారిశ్రామిక వేత్తలు, అధికారులతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి, ఎప్పటికప్పుడు పర్యవేక్షించేలా మంత్రి నారా లోకేష్ చర్యలు తీసుకున్నారని తెలిపారు. విశాఖపట్నం సమ్మిట్‌లో 30శాతం గ్రౌండ్ అయితే ఏపీ అద్భుతాలు సాధించినట్లేనని వివరించారు. ఈ పరిశ్రమలు అన్ని గ్రౌండ్ అయ్యేలా చూడాల్సిందేనని చంద్రబాబు ఆదేశించారని మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు.

# ఇండిగో విమాన సర్వీసుల రద్దు దేశవ్యాప్తంగా కలకలం






**ఢిల్లీ:** దేశవ్యాప్తంగా పలు ఎయిర్‌పోర్టుల్లో ఇండిగో విమాన సర్వీసులు రద్దు కావడం కలకలానికి దారితీసింది. సిబ్బంది కొరత కారణంగా నేడు కూడా ఫ్లైట్ సర్వీసుకు ఆటంకాలు ఏర్పడ్డాయి ఢిల్లీ, ముంబై, హైదరబాద్ సహా పలు ఎయిర్‌పోర్టుల్లో ఫ్లైట్స్ క్యాన్సిల్ అయ్యాయి. ఢిల్లీ ఎయిర్‌పోర్టులో గురువారం 30 ఫ్లైట్లు, హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో మరో 33 సర్వీసులు క్యాన్సిల్ అయ్యాయి. ఈ రోజు సుమారు 170 ఫ్లైట్ సర్వీసులు క్యాన్సిల్ అయ్యే అవకాశం ఉన్నట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. సేవల్లో తీవ్ర ఆటంకాలు ఏర్పడిన విషయాన్ని అంగీకరించిన ఇండిగో కస్టమర్లకు క్షమాపణలు తెలిపింది. కార్యకలాపాలకు సంబంధించి అనుకోని ఇబ్బందులు, సాంకేతిక సమస్యలు, చలికాలంలో షెడ్యూలింగ్ మార్పులు, ప్రతికూల వాతావరణం, ఏవియేషన్ వ్యవస్థలో రద్దీ, పైలట్‌ల డ్యూటీలకు సంబంధించి కొత్త నిబంధనల వంటివి సమస్యను మరింత పెంచాయని పేర్కొంది. పరిస్థితులను చక్కదిద్దేందుకు షెడ్యూల్‌లో మార్పులు చేశామని తెలిపింది. మరో 48 గంటల్లో అంతా చక్కదిద్దుకుంటుందని భరోసా ఇచ్చింది.ప్రస్తుతం ఇండిగో రోజూ దాదాపు 2200 ఫ్లైట్ సర్వీసులు నిర్వహిస్తోంది. 90 దేశీయ, 40 విదేశీ గమ్యస్థానాలకు ఫ్లైట్ సర్వీసులను నిర్వహిస్తోంది. అయితే, సిబ్బంది కొరత కారణంగానే ఈ పరిస్థితి తలెత్తినట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. సవరించిన ఫ్లైట్ డ్యూటీ టైమ్ నిబంధనల కారణంగా సిబ్బందికి కొరత ఏర్పడినట్టు తెలుస్తోంది. పైలట్‌లకు డ్యూటీ భారం తగ్గించి మరింత విశ్రాంతిని ఇచ్చేలా డ్యూటీ షెడ్యూల్ కోసం ఈ నిబంధనలను రూపొందించారుఇక ఇండిగో సేవల్లో ఆటంకాల నేపథ్యంలో డీజీసీఏ గురువారం అత్యవసర సమావేశం నిర్వహించింది. అంతకుముందే ఈ అంశంపై విచారణ కూడా ప్రారంభించింది. ప్రస్తుత పరిస్థితికి కారణాలను, పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై ఓ నివేదిక ఇవ్వాలని ఇండిగోను ఆదేశించిందిడీజీసీఏకు ఇండిగో గతంలో ఇచ్చిన సమాచారం ప్రకారం, నవంబర్‌లో మొత్తం 1232 ఫ్లైట్ సర్వీసులు రద్దయ్యాయి. వీటిలో ఫ్లైట్ డ్యూటీ టైమ్ పరిమితుల వల్ల 755, ఎయిర్‌పోర్టులో ఆంక్షల కారణంగా 258 రద్దయ్యాయి. ఏటీసీ వ్యవస్థ వైఫల్యం కారణంగా 92, ఇతరత్రా కారణాల వల్ల 127 విమానాలు రద్దయ్యాయి. సమయపాలనకు సంబంధించి ఎయిర్‌లైన్స్ పనితీరు అక్టోబర్‌లో 84.1 శాతం నుంచి నవంబర్‌లో 67.7 శాతానికి చేరుకుంది.కొత్త ఎఫ్‌డీటీఎల్ నిబంధనల ప్రకారం, పైలట్‌లకు వారంలో 48 గంటల పాటు విశ్రాంతిని ఇవ్వాలి. గతంలో రాత్రి పూట ఆరు ల్యాండింగ్స్‌కు అనుమతి ఉండగా ప్రస్తుతం వాటిని రెండుకు కుదించారు. ఈ నిబంధనలను ఎయిర్‌లైన్స్ సంస్థలు గతంలో వ్యతిరేకించాయి. ఇక సవరించిన నిబంధనల తొలి దశ జులై 1న నుంచీ అమల్లోకి వచ్చింది. రెండో దశ రూల్స్ నవంబర్ 1 నుంచి అమల్లో ఉన్నాయి.

# ప్రతిపక్ష నేతను ఎందుకు కలవనివ్వడం లేదు – పుతిన్ పర్యటనకు ముందు రాహుల్ విమర్శలు



**ఢిల్లీ :** రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ గురువారం సాయంత్రం భారత్‌కు రానుండగా, అందుకు కొన్ని గంటల ముందు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కేంద్రంపై విమర్శలు గుప్పించారు. విదేశీ అతిథులు భారత్ పర్యటనకు వచ్చినప్పుడు ప్రతిపక్ష నేతను కలవకూడదని కేంద్ర ప్రభుత్వం సూచిస్తోందని రాహుల్ ఆరోపించారు. ఇది పూర్తిగా అసురక్షిత భావ ఫలితమని ఆయన తెలిపారు.రాజధాని ఢిల్లీలోని పార్లమెంట్ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడిన రాహుల్ గాంధీ, “విజిటింగ్ డిగ్నిటరీలు సాధారణంగా ప్రతిపక్ష నేతను కూడా కలుస్తారు. ఇది చాలా కాలంగా ఉన్న పార్లమెంటరీ సంప్రదాయం. వాజపేయీ గారి సమయంలోనూ, మన్మోహన్ సింగ్ గారి సమయంలోనూ ఇదే జరిగింది. కానీ ప్రస్తుతం ఈ సంప్రదాయాన్ని ప్రధాని నరేంద్ర మోదీ, విదేశాంగ మంత్రిత్వశాఖ పాటించడం లేదు” అంటూ విమర్శించారు.విదేశీ అతిథులు భారత్‌కు వచ్చినప్పుడు, తాను విదేశాలకు వెళ్లినప్పుడు కూడా ప్రభుత్వం ప్రతిపక్ష నేతను కలవొద్దని సూచిస్తోందనే సందేశం వస్తోందని రాహుల్ పేర్కొన్నారు. “మేం కూడా భారత్‌ను ప్రాతినిధ్యం వహిస్తున్నాం. కేవలం ప్రభుత్వం మాత్రమే దేశాన్ని సూచించదు. విదేశీ నాయకులు ప్రతిపక్ష అభిప్రాయాలు కూడా తెలుసుకోవడం చాలా ముఖ్యం” అని చెప్పారు. ప్రభుత్వం ఇలా ఎందుకు చేస్తోందని అడిగిన ప్రశ్నకు రాహుల్, “ఇది వారి అసురక్షిత భావం తప్ప మరేం కాదు” అని సమాధానమిచ్చారు.కేంద్రంపై ప్రియాంక గాంధీ తీవ్ర విమర్శలు రాహుల్ గాంధీ వ్యాఖ్యలకు అనుగుణంగానే కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా కూడా స్పందించారు. “విజిటింగ్ డిగ్నిటరీలు ప్రతిపక్ష నేతను కలవడం ప్రోటోకాల్. ప్రజాస్వామ్యంలో కొన్ని నిబంధనలు, సంప్రదాయాలు ఉంటాయి. ఇవి పాటించాల్సిందే” అని ఆమె అన్నారు. “కానీ ఎన్డీఏ ప్రభుత్వం ప్రతి విషయంలోనూ ఒకే ధోరణి చూపుతోంది. అన్ని వ్యవస్థలను తమ ఆధీనంలోకి తెచ్చుకోవాలి, ఇతర స్వరాలకు స్థలం ఇవ్వకూడదు, ప్రజాస్వామ్య పరిపాట్లను చెరిపేయాలన్నట్లు చూస్తోంది. ఇలాంటి చర్యలు ప్రభుత్వంలోని అసురక్షిత భావానికే సూచిక” అంటూ ప్రియాంక గాంధీ వ్యాఖ్యానించారు. “విదేశీ నాయకులు భారత్‌కు వచ్చినప్పుడు ప్రతిపక్ష నేతను కలవడం సాధారణ సంప్రదాయం. దీనిని ఎందుకు మార్చాలి? ఏ అసురక్షిత భావం కోసం ఆ నిబంధనలను విస్మరించాలి” అని ఆమె ప్రశ్నించారు.పుతిన్ పర్యటన నేపథ్యంరష్యా అధ్యక్షుడు వ్లాది మిర్ పుతిన్ గురువారం సాయంత్రం ఢిల్లీకి చేరుకోనున్నారు. శుక్రవారం ప్రధాని నరేంద్ర మోదీతో ఆయన శిఖరాగ్ర భేటీ జరగనుంది. పుతిన్ పర్యటనలో ప్రధానంగా రక్షణ రంగ సహకారం, భారత్– రష్యా వాణిజ్యాన్ని ఇతర దేశ ఒత్తిడి నుంచి రక్షించే వ్యూహాలు, చిన్న పరిమాణ అణు రియాక్టర్లలో సహకార అవకాశాలు ప్రధాన అంశాలుగా ఉండనున్నాయి. గత కొన్ని సంవత్సరాలుగా రష్యాతో భారత్ సంబంధాలు కొనసాగుతుండగా, ఉక్రెయిన్ యుద్ధం తర్వాత ఏర్పడ్డ అంతర్జాతీయ పరిస్థితుల్లో ఈ పర్యటనకు ప్రత్యేక ప్రాధాన్యం వచ్చింది.

# భారత్‌లో పుతిన్ పర్యటన ప్రపంచంలో అత్యంత సంపన్నుడి నివాసంలో బస




**ఢిల్లీ :** భారత్–రష్యా దేశాల మధ్య మరింత మెరుగైన సంబంధాలు నెలకొల్పేందుకు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత్‌లో పర్యటించనున్నారు. భారత్–రష్యా వార్షిక సదస్సు కోసం వస్తున్న పుతిన్. రెండు రోజుల పాటు ఉండనున్నారు. పుతిన్ రాక సందర్భంగా ఇప్పటికే రష్యా సెక్యూరిటీ భారత్ చేరుకోగా.. భారత్ కూడా ఎన్‌ఎస్‌జీని రంగంలోకి దించి.. 5 అంచెల పటిష్ఠ భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేసింది. మరోవైపు.. పుతిన్ భారత పర్యటనలో. ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడిగా పేరుగాంచిన హైదరాబాద్ చివరి నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్‌కు చెందిన హైదరాబాద్ హౌస్‌లో బస చేయనున్నారు. 1 అశోక్ రోడ్‌లో ఉన్న ఈ చారిత్రక భవనాన్ని.. ప్రస్తుతం ప్రధానమంత్రి స్టేట్ గెస్ట్ హౌస్‌గా ఉపయోగిస్తున్నారు. ప్రస్తుతం పుతిన్ సహా ప్రపంచ నాయకులకు ఆతిథ్యం ఇస్తూ.. భారత్‌కు గర్వకారణంగా నిలుస్తోంది.ఒకప్పుడు నిజాం అపారమైన సంపదకు, బ్రిటిష్ పాలనలో ఆయన ‘హిస్ ఎగ్జాల్టెడ్ హైన్నెస్’ అనే ఉన్నత హోదాకు గుర్తుగా నిర్మించబడిన ఈ అద్భుత కట్టడం.. ప్రస్తుతం భారతదేశ విదేశాంగ సంబంధాలకు కీలక కేంద్రంగా మారింది. బ్రిటిష్ పాలకులు తమ రాజధానిని ఢిల్లీకి తరలించినప్పుడు. చివరి నిజాం రాజు అయిన మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ తన కీర్తికి తగిన స్థలాన్ని కోరుకున్నారు. వైస్రాయ్ హౌస్‌కు దగ్గరగా స్థలం దక్కనప్పటికీ.. కింగ్స్ వే (ప్రస్తుత రాజ్‌పథ్) చివరన.. ప్రిన్సెస్ పార్క్‌లో హైదరాబాద్, బరోడా, పాటియాలా, జైపూర్, బికనీర్ వంటి ఐదు ప్రధాన సంస్థానాలకు స్థలాలను కేటాయించారు. అయితే.. నిజాం రాజు కోరిక మేరకు.. ప్రఖ్యాత ఆర్కిటెక్ట్ ఎడ్విన్ లూటియన్స్, వైస్రాయ్ హౌస్‌కు ఏ మాత్రం తీసిపోని విధంగా ఈ హైదరాబాద్ హౌస్ ప్యాలెస్‌ను రూపొం దించారు.1920ల్లోనే భారీ వ్యయంతో ఈ హైద రాబాద్ హౌస్‌ను నిర్మించారు. ప్రస్తుత విలువ ప్రకారం చూస్తే. ఆ నిర్మాణం ఖర్చు సుమారు రూ.170 కోట్లు. ఇక ఎడ్విన్ లూటియన్స్.. తన పాత డిజైన్ల ఆధారంగా సీతాకోకచిలుక ఆకా రంలో ఈ హైదరాబాద్ హౌస్‌ను నిర్మిం చారు. 8.2 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ ప్యాలెస్.. 36 గదులు, ముఘల్ నమూనాలతో యూరోపియన్ శైలి కట్టడాలు, గంభీ రమైన మెట్ల మార్గాలు, మధ్యలో ఒక గోపురం కలిగి ఉంది. భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత.. ఆపరేషన్ పోలో ద్వారా హైదరాబాద్ యూనియన్‌లో విలీనమైన తర్వాత.. ఈ ప్యాలెస్ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోకి వచ్చింది.1974లో భారత విదేశా ంగ మంత్రిత్వ శాఖ ఈ హైదరాబాద్ హౌస్‌ను స్వాధీనం చేసుకు ంది. ప్రధానమంత్రి స్టేట్ గెస్ట్ హౌస్‌గా మార్చింది. అంతర్జాతీయ ప్రముఖులు, ప్రపంచ నాయకులు ఇక్కడ ఉన్నత స్థాయి విందు లు, సమావేశాలు, జాయింట్ ప్రెస్‌మీట్‌లలో పాల్గొనేందుకు ఈ హైదరాబాద్ హౌస్‌ను ఉపయోగిస్తున్నారు. 1 అశోక్ రోడ్‌లో ఉన్న ఈ అద్భుత కట్టడం.. ఒకప్పుడు ప్రపంచ సంపన్నుడికి చెందిన ఈ విలాసవంతమైన భవనం కాగా.. నేడు శక్తివంతమైన నాయకుల మధ్య జరిగే చర్చలకు వేదికగా నిలుస్తోంది.

# పని ఒత్తిడి తగ్గించేందుకు అదనపు సిబ్బందిని తీసుకోవాలి



**న్యూ ఢిల్లీ :** ఎన్నికల సంఘం చేపడుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా పలు రాష్ట్రాల్లో బూత్ స్థాయి అధికారుల ఆత్మహత్య ఘటనలు జరగడంపై సుప్రీంకోర్టు స్పందించింది. పని ఒత్తిడితో ఇబ్బం దులు ఎదురైనప్పుడు అదనపు సిబ్బందిని నియామించుకోవాలని అన్ని రాష్ట్రాలను సూచించింది. ఎస్ఐఆర్‌ను గడువులోని పూర్తి చేయాలని ఈసీ బూత్ స్థాయి అధికారులపై ఒత్తిడి తెస్తోందన్న పిటిషన్‌పై సుప్రీం ఈ వ్యాఖ్యలు చేసింది. పని ఒత్తిడి కారణంగా బూత్ స్థాయి అధికారులు రాజీనామా చేయడంతో పాటు పలువ ురు ఆత్మహత్యలు చేసుకున్నారని పిటిషనర్ తరుపున న్యాయవాది కోర్టుకు వివరించారు. గడువులోగా పని పూర్తి కాకపోతే ఎఫ్ఐ ఆర్ నమోదు చేస్తామని ఎన్నికల సంఘం బెదిరింపులకు పాల్పడుతోందన్నారు. దీనిపై విచారణ జరిపిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం చట్ట ప్రకారం ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల సంఘంతో కలిసి కొన్ని పనులు చేయాల్సి ఉంటుందని పేర్కొంది. అయితే వర్క్ లోడ్ కారణంగా అధికారులు ఇబ్బంది పడుతుంటే అదనపు సిబ్బ ందిని రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకోవచ్చని స్పష్టం చేసింది. ఉద్యోగికైనా ఎస్ఐఆర్ విధుల నుంచి మినహాయింపు కావా లని ఏదైనా కారణం చూపిస్తే వేరే ప్రత్యామ్నాయంగా నియమించవచ్చని సర్వోన్నత న్యాయస్థానం వెల్లడించింది.

# జైషే మహిళా వింగ్‌లో పెరిగిన నియామకాల సంఖ్య



**పాకిస్థాన్ :** ఉగ్రవాద సంస్థ జైషే తన కార్యకలాపాలను విస్తరించేందుకు మహిళలతో ఓ ఉగ్రవాద గ్రూప్ ను తయారుచేస్తున్న విషయం తెలిసిందే. మసూద్ అజార్ సోదరి సాదియా అజార్ మహిళా గ్రూపుకు నేతృత్వం వహిస్తున్నారు. ‘జమాతుల్–ముమినాత్’ ( పేరుతో ఓ ప్రత్యేక యూనిట్‌ను తయారు చేస్తున్నది. అయితే, కొద్ది వారాల వ్యవధిలోనే వేల సంఖ్యలో మహిళల్ని ఆకర్షించినట్లు తేలింది. ఈ విషయాన్ని స్వయంగా మసూద్ అజారే సోషల్ మీడియా వేదికగా వెల్లడించడం గమనార్హం. ఉగ్రవాద సంస్థ మహిళా విభాగంలో నియామకాల సంఖ్య పెరుగుతోందని జైష్ చీఫ్ మసూద్ అజార్ అందులో పేర్కొన్నారు. ఇప్పుడు జిల్లా యూనిట్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ‘జైషే మహిళా విభాగంలో నియామకాల సంఖ్య పెరుగుతోంది. చాలా తక్కువ సమయంలోనే 5,000 మందికిపైగా మహిళలు చేరారు. ఇదంతా అల్లా దయ వల్లే జరిగింది. చాలా మంది సోదరీమణులు నియామకం పొందిన వెంటనే తమ మానస్థిక స్థితిమారిపోయినట్లు చెబుతున్నారు. జీవిత లక్ష్యాన్ని గ్రహించినట్లు చెప్పారు. ఇప్పుడు జిల్లా యూనిట్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ప్రతి జిల్లాకు ఒక ముంటాజియా (మేనేజర్) ఉంటారు’ అని ఆ పోస్టులో పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్ అవుతోంది.

# బీజాపూర్ ఎన్‌కౌంటర్ 20కి పెరిగిన మృతుల సంఖ్య



**ఛత్తీస్‌గఢ్, డిసెంబర్ 04:** బీజాపూర్ జిల్లాలో బుధవారం భారీ ఎన్‌కౌంటర్‌చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ఎన్‌కౌంటర్‌లో మృతుల సంఖ్య 20కి పెరిగింది. భద్రతా బలగాలకు మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో తొలుత ఐదుగురు మావోయిస్టులు మృతి చెందినట్లు అధికారులు గుర్తించారు. ఎన్ కౌంటర్ జరిగిన ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ చేస్తున్న క్రమంలో మరికొన్ని మావోయిస్టుల మృతదేహాలు కనిపించినట్లు తెలుస్తోంది. మొత్తంగా మృతుల సంఖ్య 20కి చేరినట్లు సమాచారం. పశ్చిమ బస్తర్ డివిజన్ ప్రాంతంలో మావోయిస్టులకు, భద్రతా బలగాలకు మధ్య భీకర ఎదురు కాల్పులు జరిగాయి. బుధవారం జరిగిన ఈ ఆపరేషన్ లో డీఆర్‌జీ, ఎస్‌టీఎఫ్, కోబ్రా భద్రతాబలగాలు పాల్గొన్నాయి.అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో టెన్షన్ వాతావరణం ఉంది. ఇక్కడ జరిగిన ఎన్‌కౌంటర్లు జిల్లాపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ఇటీవల మారేడుమిల్లి ప్రాంతంలో జరిగిన రెండు ఎన్‌కౌంటర్ల ప్రభావం ఈ ప్రాంతంలో ఇంకా తగ్గలేదు. ఇలాంటి సమయంలో మంగళవారం నుంచి మావోయిస్టు పార్టీకి చెందిన పీఎల్‌జీవో వారోత్సవాలు ప్రారంభం అయ్యాయి. ఈ నేపథ్యంలోనే బుధవారం బీజాపూర్రప్రాంతంలో భారీ ఎన్ కౌంటర్ చోటుచేసుకుంది. ఈ రెండు ఘటన నేపథ్యంలో పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు సరిహద్దులో ఉన్న ఏజెన్సీ ప్రాంతాల్లో ఎప్పుడు ఏం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

# అంతర్రాష్ట్ర బస్సులో పట్టుబడిన రూ.72 లక్షల నగదు




**కేరళ, డిసెంబర్ 03:** కొట్టాయంలోఅంతర్రాష్ట్ర బస్సులో లెక్కల్లో చూపని సుమారు రూ.72 లక్షల నగదును ఎక్సైజ్ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా ఏపీ, కేరళ మధ్య నడిచే అంతరాష్ట్ర బస్సులో ఈ డబ్బును గుర్తించారు. వీటిని తరలిస్తున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. క్రిస్మస్, నూతన సంవత్సరం, కేరళలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సందర్భంగా మాదకద్రవ్యాల, నల్లధనం అక్రమ రవాణ వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలను అరికట్టడానికి రాష్ట్రవ్యాప్తంగా ఎక్సైజ్ శాఖ అధికారులు తనిఖీలు ప్రారంభించారు. కొట్టాయంలోని కురవిలంగాడ్‌లో జరిగిన తనిఖీలలో, అధికారులు బస్సులోని ఒక బ్యాగ్‌లో దాచిన నగదు కట్టలను కనుగొన్నారు. మరింత అనుమానం రావడంతో ఇద్దరు ప్రయాణికులను తనిఖీ చేయగా, వారి వద్ద మరింత నగదు ఉన్నట్లు గుర్తించారు.స్వాధీనం చేసుకున్న మొత్తం రూ.72 లక్షలు( ఉందని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. పోలీసులకు పట్టుబడకుండా ఉండేందుకు స్మగ్లర్లు అంతర్రాష్ట్ర బస్సులను ఎక్కువగా వినియోగిస్తుంటారు. చిన్న ప్రైవేట్ వాహనాల మాదిరిగా కాకుండా, బస్సులను తనిఖీల కోసం చాలా అరుదుగా ఆపివేస్తారు. ప్రయాణికులకు అసౌకర్యం కలుగుతుందని చాలా అరుదుగా మాత్రమే బస్సులను తనిఖీ చేస్తుంటారు. ఈ అవకాశాన్ని కొన్ని ముఠాలు అక్రమాల కోసం వాడుకుంటున్నాయి

# బెంగాల్‌లో బాబ్రీ మసీదు నిర్మిస్తామన్న తృణమూల్ ఎమ్మెల్యేపై వేటు



**బెంగాల్:** బాబ్రీ మసీదుకు పునాది వేస్తామంటూ వివాదానికి తెరతీసిన తృణమూల్ నేత, భరత్‌పూర్ ఎమ్మెల్యే హుమాయున్ కబీర్‌పై వేటు పడింది. ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్టు టీఎమ్‌సీ ప్రకటించింది. బీజేపీ మద్దతుతో ఆయన మతసామరస్యం దెబ్బతినే వ్యాఖ్యలు చేశారని టీఎమ్‌సీ నేత, కోల్‌కతా మేయర్ ఫర్హాద్ హకీమ్ మండిపడ్డాడు. గతంలోనే పార్టీ ఆయనను పలుమార్లు హెచ్చరించిందని గుర్తు చేశారు .‘ఇప్పటికే ఆయనకు మూడు సార్లు వార్నింగ్ ఇచ్చాము. కానీ ఆయన పద్ధతి మార్చుకోలేదు. అందుకే సస్పెండ్ చేశాము. ఆయనతో పార్టీకి ఎలాంటి సంబంధం లేదు’ అని ఫర్హాద్ హకీమ్ తేల్చి చెప్పారు.బాబ్రీ మసీదు నిర్మిస్తామన్న ఆయన కామెంట్స్ తెలిసి పార్టీ ఆశ్యర్యపోయిందని హకీమ్ తెలిపారు. ‘సడెన్‌గా బాబ్రీ మసీదు ప్రస్తావన ఎందుకు? మేము గతంలోనే ఆయనను హెచ్చరించాము. పార్టీ నిర్ణయం మేరకు ఆయనను సస్పెండ్ చేశాము’ అని అన్నారు.ఎమ్మెల్యే హుమాయున్ కబీర్ శైలి గతంలో కూడా వివాదాలకు దారి తీసింది. పార్టీ వ్యవహారాల్లో కూడా ఆయన తీరు కాంట్రవర్సీటీకి కారణమైంది. ఇటీవల ఆయన మాట్లాడుతూ బెల్డంగాలో డిసెంబర్ 6న బాబ్రీ మసీదుకు పునాది రాయి వేస్తామని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇక పార్టీ నుంచి సస్పెండ్ కావడంపై కూడా కబీర్ స్పందించారు. త్వరలో టీఎమ్‌సీ సభ్యత్వానికి రాజీనామా చేసి కొత్త పార్టీ పెడతానని చెప్పుకొచ్చారు.

# సనాతన ధర్మం నిర్మూలన పేరుతో భయాందోళనలు



**చెన్నై:** సనాతన ధర్మాన్ని నిర్మూలిస్తామంటూ కొందరు సమాజంలోని ప్రజల మధ్య భయాందోళనలు రేకెత్తిస్తున్నారని గవర్నర్ ఆర్.ఎన్.రవి ఆగ్రహం వ్యక్తం చేశారు. వారణాసిలో ‘తమిళ కాశీ సంగమం’ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన ఓ ఆధ్యాత్మిక సదస్సులో పాల్గొన్న ఆయన ప్రసంగిస్తూ.. వచ్చి పవిత్ర గంగా జలాలను తీసుకెళ్లారన్నారు. తమిళ ప్రజల హృదయాల్లో కాశీ చిరస్థాయిగా నిలిచిపోయిందని, దీనికి శివపెరుమాళ్ నిదర్శనమన్నారు. కాలాలు మారేకొద్దీ సనాతన ధర్మాన్ని నిర్మూలిస్తామంటూ తమిళనాడు రాష్ట్రంలో కొందరు మాట్లాడుతున్నారన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు చేసి, ప్రజల మధ్య అనవసరమైన భయాందోళనలు రేకెత్తించడమే వారి ఉద్దేశమన్నారు. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో భారతీయార్ కోసం ప్రత్యేక కుర్చీని కేంద్రం ఏర్పాటు చేసిందని, ఇలాంటి అనేక మంచి పనులు కేంద్రం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి ఎల్.మురుగన్ తదితరులు పాల్గొన్నారు.

# సవాల్ విసురుతున్న గంజాయి మాఫియా !



గంజాయి మాఫియా విజృంభిస్తోంది. తాజాగా నెల్లూరు జిల్లాలో గంజాయి మాఫియా గ్యాంగ్ ఘాతుకానికి కొట్టాచిట్టం పెంచలయ్య బలయ్యారు. ఇది ఆరంభం మాత్రమే. ఎందుకంటే ఇప్పటి వరకు గంజాయి మాఫియా పట్టుబడడం లేదా తప్పించుకోవడం మాత్రమే చూశాం. ఇక హత్యలకు సంకేతం అన్నట్లుగా పెంచలయ్య మర్డర్‌ను భావించాలి. పెంచలయ్యను చంపిన దుర్మార్గులను వారి వెనుకనున్న డాన్‌లపైన దృష్టి పెట్టాల్సి ఉంది. ఈ విషయంలో ఎపి ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలి. ఎందుకంటే గంజాయి చాపకింద నీరులా ప్రవహిస్తోంది.కాసులు కురిపించడంతో పలువురు దీనికి ఆకర్శితులై కుటీరపరిశ్రమగా వాడుకుంటున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఇది బాగా విస్తరించింది. అన్ని ప్రాంతాలలో విచ్చలవిడిగా గంజాయిని సరఫరా చేస్తున్నారు. దీనితో విద్యార్థులు యువత చెడుదారి పడుతున్నారు. డ్రగ్స్ మాఫియాల వెనక రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీల నాయకుల అండదండలు ఉన్నాయన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. వారిపై ఉక్కుపాదం మోపి, తక్షణం డ్రగ్స్, గంజాయి తదిర మాఫియాలను నిర్మూలించాల్సి ఉంది. ఎందుకంటే మద్యం, గంజాయి, డ్రగ్స్ మాఫియాలను అరికట్టకపోతే సమాజం దారి తప్పుతుంది. పాలకులు ఎంతసేపు పెన్షన్ల పంపిణీ, బియ్యం పంపిణీలపై దృష్టి పెట్టడం మానాలి. హెలికాప్టర్లు వేసుకుని ఊరేగడం మానాలి. హెలికాప్టర్, విమానాల్లో తిరగడానికి వందల కోట్లు తగలేస్తున్నారు. ఆ డబ్బులను మాఫియాలను అరికట్టేందుకు వినియోగించాలి. ప్రజా చైతన్య కార్యక్రమాలను చేపట్టాలి. విశాఖ,మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాల్లోని ఏజెన్సీ ప్రాంతాల్లో గంజాయి విచ్చలవిడిగా సాగవుతోంది. అక్కడ నుంచి జిల్లాలోకి అక్రమంగా గంజాయి రవాణా అవుతోంది. ముఖ్యంగా ఒడిశా, అల్లూరి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల నుంచి ఎక్కువగా వస్తోంది. మారేడుమిల్లి, రంపచోడవరం మీదుగా జగ్గంపేటకు గంజాయి రావాణా సాగుతోంది. అక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు గుట్టుచప్పుడు కాకుండా ఎగుమతి అవుతోంది. ఇటీవల తెలంగాణలో కూడా విచ్చల విడిగా గంజాయి ప ట్టుబడుతోంది. అయితే పట్టుబడుతున్న గంజాయి లేదా డ్రగ్స్ కొంత మాత్రమే. ఇప్పటికే అది గుట్టుచప్పుడు కాకుండా రవాణా అవుతున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వాలు తలచుకుని గట్టిగా చర్యలు తీసుకుంటే దీనిని అరికట్టవచ్చు. మొగ్గలోనే దీనిని తుంచివేయాలి. ఈగిల్ టీమ్‌లకు మరింత బలగాలను ఇచ్చి అదేపిగా తనిఖీలు చేపట్టాలి. ఎక్కడెక్కడ పండిస్తున్నారో గుర్తించి ధ్వంసం చేయాలి. అయితే పోలీసులు నిఘా పెట్టి అరెస్టులు చేస్తున్నా గంజాయి రవాణా మాత్రం ఆగట్లేదన్న ఆరోపణలే ఎక్కువగా ఉన్నాయి. ప్రధానంగా నగరాల్లో విద్యార్థులు, యువతను టార్గెట్ చేస్తున్నారు. అందుకే పట్టణ ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. యువత, విద్యార్థులనే గంజాయి మాఫియా టార్గెట్ చేసుకుంటోంది. ఒంటరిగా, జులాయిలా తిరిగే యువకులను రవాణాకు ఉపయోగించుకుంటోంది. గంజాయిని చిన్నచిన్న పొట్లాలు, లిక్విడ్, చాక్లెట్లుగా మార్చి యువతకు, విద్యార్థులకు అమ్ముతున్నారు. ఎక్కువగా ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాలల యువతనే వీరు లక్ష్యంగా చేసుకుని అమ్మకాలు సాగిస్తున్నారు. ఇటీవల ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పలు సందర్భాల్లో ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులు గంజాయి సేవిస్తూ పోలీసులకు చిక్కారు. కొన్నిచోట్ల రాజకీయ పలుకుబడితో కేసు నుంచి వారు తప్పించుకున్నారు. ఇలాంటి ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. గత జగన్ ప్రభుత్వ హయాంలో గంజాయి విక్రయాలు యథేచ్ఛగా సాగాయి. ప్రస్తుత ప్రభుత్వ హయాం లోనూ పరిస్థితిలో పెద్దగా మార్పు కానరావడంలేదు. మేము అధికారంలోకొస్తే గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కు పాదం మోపుతాం అని టిడిపి అధినేత చంద్రబాబు చెప్పుకొచ్చారు. అధికారంలోకొచ్చి ఏడాదిన్నర అయినా గంజాయికి అడ్డుకట్ట పడడంలేదు. గత ప్రభుత్వం లో మాదక ద్రవ్యాలు, గంజాయి రాష్ట్రమంతటా పాకాయి. వాటి మూలాలను గుర్తించి నివారించాలి. యువతను గంజాయి మత్తు నుంచి బయటకు తీసుకురావాలి. మాదకద్రవ్యరహిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సాధించాలి. ఇప్పటికీ గంజాయి మాఫియా రెచ్చిపోతోందనే విమర్శలు ఉన్నాయి. ఇందుకు పాలకపక్షం లోని కొందరి అండదండలే కారణమని ప్రచారం జరుగుతోంది. తాజాగా నెల్లూరు ఘటన దీనికి పరాకాష్టగా చూడాలి. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్న పెంచలయ్యను దారుణంగా హత్య చేయడం దారుణంకాక మరోటి కాదు. ఈ ఘటనతో స్థానికుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ప్రధాన హంతకుడు జేమ్స్ ఇంటిని వారు దగ్ధం చేశారు. నెల్లూరు నగరంలోని అయ్యప్పగుడి ప్రాంతంలోని ఆర్‌డిటి కాలనీలో పెంచలయ్య ఉంటున్న వీధిలోనే జేమ్స్ కుటుంబం ఉంటోంది. జేమ్స్ అక్క అరవ కామాక్షి గంజాయి, మాదక ద్రవ్యాలు, దొంగతనాలకు యువకుల ను ప్రోత్సహిస్తోంది. ఈ నేపథ్యంలో పెంచలయ్య తన స్నేహితులతో కలిసి గంజాయి అమ్మకాలు, మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. కామాక్షి తమ కాలనీకి రావద్దంటూ స్థానికులు నిర్ణయం చేశారు. దీంతో, కక్ష పెంచుకున్న జేమ్స్ మరికొందరితో కలిసి పెంచలయ్య ను హత్య చేశారని స్థానికులు చెబుతున్నారు. గంజాయిని అమ్మవద్దంటే చంపేస్తారా అంటూ స్థానిక మహిళలు, యువకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల్లో చైతన్యం తీసుకుని వస్తే వారే దీనిపై పోరాడుతారు. వారే సమాచారం ఇస్తారు. ఇక తెలంగాణలోనూ ఇటీవల ఈగిల్ టీమ్ దాడులు పెంచింది. పెద్ద ఎత్తున దాడులు చేస్తూనే ఉంది. ఇటీవల ఢిల్లీలో కూడా దాడులు చేసింది. అయినా మత్తు మాఫియాదే పైచేయి అవుతోంది. దీనిని కఠినంగా అణచివేయాలి. అందకు చిత్తశుద్ధితో కృషి చేయాలి. రవాణా జరుగుతున్న తీరును గుర్తించి మాటువేయాలి. విశాఖ నుంచి గంజాయి సరఫరా అవుతోంది. భద్రాచలం ఏజెన్సీ నుంచి కూడా వస్తోంది. ఈ రెండు ప్రాంతాల్లో గజాయి తోటలను ధ్వంసం చేస్తూ పోవాలి.

# సాధారణ స్థితికి చేరుకుంటున్నాం

**విమానాల అంతరాయాన్ని సరిదిద్దుతున్నాం**

**ఇండిగో విమానయాన సంస్థ తాజా ప్రకటన**




**న్యూఢిల్లీ,డిసెంబర్4:** దేశంలోనే అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో ప్రయాణ సేవల్లో తీవ్ర అంతరాయం కొనసాగుతున్నది. సిబ్బంది కొరతతో సతమతం అవుతున్న ఇండిగో.. నవంబర్‌లో ఏకంగా 1,232 సర్వీసులను రద్దు చేసినట్లు డీజీసీఏ ప్రకటించింది. అంతేకాదు, కేవలం గడిచిన రెండు రోజుల వ్యవధిలోనే వందలాది విమానాలను సంస్థ రద్దు చేసింది. ఢిల్లీ, ముంబై,హైదరాబాద్ సహా ఇతర పట్టణాలకు విమాన సర్వీసులు నిలిచిపోయాయి. దీంతో దేశవ్యాప్తంగా విమానాశ్రయాల్లో సంక్షోభం తలెత్తింది. మరోవైపు విమానాల రద్దు, ఆలస్యంపై ఇండిగో సంస్థ స్పందించింది. సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపింది. క్రమంగా తమ విమానాలు పునరుద్ధరించ నున్నామని వెల్లడించింది. విమానాల రద్దు కారణంగా ప్రభావితమైన ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేర్చేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపింది. 48 గంటల్లో తమ కార్యకలాపాలు సాధారణ స్థితికి వస్తాయని తెలిపింది. ఈ మేరకు గురువారం ఉదయం ప్రకటన విడుదల చేసింది. సిబ్బంది కొరత, సాంకేతిక సమస్యలు, ఎయిర్‌పోర్టులలో రద్దీ వంటి కారణాలు విమానాల రద్దుకు దారితీస్తున్నాయి. గత రెండు రోజుల్లోనే ఏకంగా 250 నుంచి 300 విమానాలను సంస్థ రద్దు చేసింది. ఈ కారణంగా ప్రధాన విమానాశ్రయాల్లో సంక్షోభం ఏర్పడింది. విమానాల రద్దుతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేలాది మంది ప్రయాణికులు ఎయిర్‌పోర్టుల్లో చిక్కుకుపోయి దిక్కుతోచని స్థితిలో ఆందోళన చెందుతున్నారు. ఎయిర్‌పోర్ట్స్ వద్ద భారీ క్యూలు దర్శనమిస్తున్నాయి. విమానాలు రద్దు కావడంతో ప్రముఖ ఎయిర్‌లైన్ సంస్థ ఇండిగో ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి క్షమాపణలు కోరింది. అదే సమయంలో తాజా పరిస్థితిపై ప్రయాణికులు నిరాశను వ్యక్తం చేస్తున్నారు. సంస్థ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విమాన సర్వీసులు రద్దు కావడంతో విమానాశ్రయాలలో ప్రయాణికులు ఆగ్రహంతో సిబ్బందిని నిలదీస్తున్న దఅశ్యాలు సోషల్ మీడియాలో దర్శనమిచ్చాయి. ప్రధాని నరేంద్ర మోడీ, పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడును ట్యాగ్ చేస్తూ పలువురు నెటిజన్లు ఎక్స్ వేదికగా తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. 7 గంటలకు పైగా చిక్కుకుపోయిన ఓ ప్రయాణికుడు ఢిల్లీ ఎయిర్‌పోర్టులో తీవ్ర గందరగోళం తలెత్తినట్లు ఎక్స్‌లో పేర్కొన్నాడు. ఢిల్లీ ఎయిర్‌పోర్టులో ప్రయాణికులు 12 గంటలకు పైగా ఎటువంటి కన్ఫర్మేషన్ లేకుండా పడిగాపులు పడుతున్నారని, ఇండిగో సిబ్బంది అబద్దాలు చెబుతూ జలగల్లా పీడిస్తున్నారని విమర్శించారు. సిబ్బంది కొరత, సాంకేతిక సమస్యలు, ఎయిర్‌పోర్టులలో రద్దీ వంటి కారణాలు విమానాల రద్దుకు దారితీస్తున్నాయి. సంస్థ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విమాన సర్వీసులు రద్దు కావడంతో విమానాశ్రయాలలో ప్రయాణికులు ఆగ్రహంతో సిబ్బందిని నిలదీ స్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో దర్శనమిచ్చాయి. ఇండిగో ఎయిర్‌లైన్స్ పనితీరును డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) బుధవారం ప్రశ్నిం చింది. నవంబర్‌లో 1,232 విమానాలు రద్దవడంతోపాటు విమానాల రాకపోకల సమయాల్లో జాప్యం జరిగింది. ఈ పరిస్థితిపై దర్యాప్తు చేస్తున్నట్లు డీజీసీఏ ఓ ప్రకట నలో తెలిపింది. ప్రయాణికులకు జరుగుతున్న అసౌకర్యాన్ని కనిష్ఠ స్థాయికి తగ్గిం చేందుకు చేపట్టవలసిన చర్యల గురించి ఇండిగోతో కలిసి మదింపు చేస్తున్నట్లు తెలిపింది.

# బంగారం, వెండి ధరల్లో దూకుడు

- గరిష్టస్థాయికి చేరుకున్న ధరల పెరుగుదల
- బంగారంతో పోటీ పడుతున్న వెండి ధరలు




**న్యూఢిల్లీ,డిసెంబర్4:** దేశంలో పసిడి ధరలు మళ్లీ పెరిగాయి. మంగళవారం కాస్తంత తగ్గిన ధరలు మళ్లీ విజృంభించాయి. వెండి ధర కూడా రికార్డు స్థాయికి చేరింది. అమెరికా ఆర్థిక వ్యవస్థ నెమ్మదిస్తున్న వైనం, ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేటు కోతపై అంతకంతకూ పెరుగుతున్న ఆశలు గోల్డ్‌కు డిమాండ్ మరింతగా పెరిగేలా చేస్తున్నాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, భారత్‌లో గురువారం ఉదయం 6.30 గంటల సమయంలో 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ. 1,30,590గా ఉంది. నిన్నటి రేట్‌తో పోలిస్తే ఇది రూ.720 అధికం. 22 క్యారెట్ 10 గ్రాముల గోల్డ్ రేట్ కూడా రూ. 650 మేర పెరిగి రూ.1,19,710కు చేరుకుంది. ఇక పారిశ్రామిక డిమాండ్ అధికంగా ఉండటంతో వెండి ధరలూ రికార్డు స్థాయిని తాకాయి. ప్రస్తుతం కిలో వెండి ధర రూ.1,91,100 వద్ద జీవితకాల గరిష్ఠానికి చేరింది. ఏడాదిలో ఇప్పటివరకూ బంగారం ధరలు 40 శాతం మేర పెరిగాయని పరిశీలకులు చెబుతున్నారు. వచ్చే ఏడాది కూడా గోల్డ్ రేట్స్‌లో జోరు కొనసాగుతుందని గోల్డ్‌మన్ శాక్స్ రీసెర్చ్ తాజా నివేదికలో తేలింది. కేంద్ర బ్యాంకులు భారీగా పసిడి కొనుగోళ్లకు దిగడం, నెమ్మదిస్తున్న అమెరికా ఆర్థిక వృద్ధి, బలహీనపడుతున్న డాలర్ వంటివి పుత్తడికి డిమాండ్ పెంచుతున్నాయి. ఇక అమెరికా ఫెడరల్ రిజర్వ్ చీఫ్‌గా కొత్త వ్యక్తిని ఎంపిక చేస్తామని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడంతో వడ్డీ రేట్ కోతపై ఆశలు మరింత పెరిగాయి. ఫలితంగా బంగారం ధరలు మరింత ఎగబాకాయి. ఎలక్ట్రానిక్స్, పునరుత్పాదక ఇంధన రంగాల నుంచి డిమాండ్ విపరీతంగా ఉండటం, సరఫరాలో తగ్గుదల వెరసి వెండి ధర ఆల్ టైమ్ గరిష్ఠాన్ని తాకేలా చేశాయి. గతేడాదితో ధరలతో పోలిస్తే అంతర్జాతీయ మార్కెట్‌లో వెండి ధర ఇప్పటివరకూ సుమారు 101 శాతం మేర పెరిగింది.




# చురుకుగా జైషే ఉగ్రవాద కూటమి

**జోరుగా మహిళల రిక్రూట్‌మెంట్**

**500లకే గంటపాటు శిక్షణ**

**ఇస్లామాబాద్,డిసెంబర్4:** పాకిస్థాన్ ఉగ్రవాద సంస్థ జైషే తన కార్యకలాపాలను విస్తరించేందుకు మహిళలతో ఏర్పాటు చేసిన ఉగ్రవాద గ్రూప్ చురుకుగా పనిచేసేందుకు చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే దీనికి మహిళల నుంచి మంచి స్పందన వస్తోందని ఆ సంస్థ ప్రకటించుకుంది. మసూద్ అజార్ సోదరి సాదియా అజార్ మహిళా గ్రూపుకు నేతృత్వం వహిస్తున్నారు. 'జమాతుల్-ముమినాత్'పేరుతో ఓ ప్రత్యేక యూనిట్‌ను తయారు చేస్తున్నది. అయితే, కొద్ది వారాల వ్యవధిలోనే వేల సంఖ్యలో మహిళల్ని ఆకర్షించి నట్లు తేలింది. ఈ విషయాన్ని స్వయంగా మసూద్ అజారే సోషల్ మీడియా వేదికగా వెల్లడించడం గమనార్హం. ఉగ్రవాద సంస్థ మహిళా విభాగంలో నియామకాల సంఖ్య పెరుగుతోందని జైష్ చీఫ్ మసూద్ అజార్ అందులో పేర్కొన్నారు. ఇప్పుడు జిల్లా యూనిట్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. 'జైషే మహిళా విభాగంలో నియామకాల సంఖ్య పెరుగుతోంది. చాలా తక్కువ సమయంలోనే 5,000 మందికిపైగా మహిళలు చేరారు. ఇదంతా అల్లా దయ వల్లే జరిగింది. చాలా మంది సోదరీమణులు నియామకం పొందిన వెంటనే తమ మానసిక స్థితిమారిపోయినట్లు చెబుతున్నారు. జీవిత లక్ష్యాన్ని గ్రహించినట్లు చెప్పారు. ఇప్పుడు జిల్లా యూనిట్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ప్రతి జిల్లాకు ఒక ముంటాజియా (మేనేజర్) ఉంటారు' అని ఆ పోస్టులో పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్ అవుతోంది. కాగా, పలు నివేదికల ప్రకారం.. జమాతుల్-ముమినాత్ కోసం నియామక డ్రైవ్ ఈ ఏడాది అక్టోబర్ 8న జైషే ప్రధాన కార్యాలయం మర్కజ్ ఉస్మాన్-ఓ-అలీలో ప్రారంభమైంది. ఈ డ్రైవ్‌లో భాగంగా పాక్‌లోని బహవల్‌పూర్, ముల్తాన్, సియాల్‌కోట్, కరాచీ, ముజఫరాబాద్, కోట్లి నుంచి మహిళలను ఉగ్రవాద సంస్థలోకి చేర్చుకున్నారు. ఈ సంస్థ రూ.500 ఫీజుతో 40 నిమిషాలు ఆన్‌లైన్ శిక్షణ ఇస్తూ.. మహిళల్ని ఉగ్రవాదం వైపు మళ్లించే ప్రయత్నాలు జరుగుతున్నాయని భద్రతా వర్గాలు అనుమానిస్తున్నాయి.



శుక్రవారం,
డిసెంబర్ 05, 2025
హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక


# గొర్రెల చోరీలకు పాల్పడుతున్న ఐదుగురు సభ్యుల ముఠా అరెస్టు

**హన్మకొండ,డిసెంబర్ 04 :** గ్రామీణ ప్రాంతాల్లో గొర్రెల దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు నిందితుల తో పాటు వీరికి సహకరించిన మరో నిందితుడిని గీసుగొండ పోలీసులు అరెస్టు చేసారు. వీరి నుండి పోలీసులు సుమారు 1,60,000 (లక్ష అరవై వేల రూపాయలను) రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అరెస్టు చేసిన నిందితుల వివరాలు:1). బాదవత్ సాయి చరణ్ ఆలియాస్ సిద్దు, వయస్సు 19, ముగ్దుంపురం, నర్సంపేట, వరంగల్ జిల్లా, 2).యం.డి గౌస్ పాషా, వయస్సు 18, పోచమ్మమైదాన్, వరంగల్. 3). కోట విశ్వతేజ, వయస్సు 18, కాశీబుగ్గ, వరంగల్. 4). రాయపురం సాయి, వయస్సు 23, ఇల్లందు, వర్ధన్నపేట, వరంగల్ జిల్లా. 5). అంగడి వెంకన్న, వయస్సు 45, ఇల్లందు, వర్ధన్నపేట, వరంగల్ జిల్లాకు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు.అరెస్టు సంబంధించి మామూనూర్ ఏసీపీ వెంకటేశ్ వివరాలను వెల్లడిస్తూ పోలీసులు అరెస్టు చేసిన నిందితుల మధ్య గతంలో పరిచయం వుండడంతో వీరికి వచ్చే అదాయం వీరూ చేసే జల్సాలకు సరి పోకపోవడం వలన నిందితులందరు కలసి గతంలో వరంగల్ కమిషనరేట్ పరిధిలో తాళం వేసి వున్న ఇండ్లల్లో చోరీలకు పాల్పడటంతో పాటు ద్విచక్ర వాహనాలను చోరీలకు పాల్పడటంతో పోలీసులు అరెస్టు చేసిన పలుమార్లు జైలుకు తరలించడం జరిగింది. నిందితులందరు జైలు నుండి విడుదల అయిన అనంతరం వారిలో ఎలాంటి మార్పు రాకపోగా, ఇండ్లల్లో చోరీలకు పాల్పడం ద్వారా పోలీసులకు చిక్కడం జరుగుతోందని భావించి



నిందితులు తమ పంథాను మార్చుకోని గ్రామాల్లో వుండే గొర్రెలను చోరీ చేసి వాటిని విక్రయించడం ద్వారా సులభంగా డబ్బు సంపాదించ వచ్చని నిందితులు నిశ్చయించుకుని నిందితులు అనుకున్న ప్రకారం ముందుగా గ్రామాల్లో రెక్కీ నిర్వహించి రాత్రి సమయాల్లో సెల్ఫ్ డ్రైవ్ కారులను కిరాయికి తీసుకొని ఆ కార్లల్లో వచ్చి తాము ముందుగా అనుకున్న ప్రాంతానికి వెళ్ళి అక్కడ వున్న గొర్రెలను దొంగిలించి కారులోకి ఎక్కించుకోని అక్కడి నుండి తప్పించుకోని పారిపోయేవారు. చోరీ చేసిన గొర్రెలను నిందితులు వర్ధన్న పేట ప్రాంతానికి చెందిన మాంస వ్యాపారం చేసే అంగడి వెంకన్నకు విక్రయించే వారు. నిందితులు ఇదే తరహాలో నాలుగు (4) గొర్రెల దొంగతనాలు పాల్పడ్డారు. ఇందులో గీసుగొండ, మామూనూర్, మిల్స్ కాలనీ, మడికొండ పోలీస్ స్టేషన్ల పరిధిలో పాల్పడ్డారు. అంతేకాక గీసుకొండ పరిధిలో కొమ్మాల గ్రామ శివారులో ఇంట్లో ఎవరూ లేని ది గమనించి ఇంటి తాళం పగలగొట్టి ఇంట్లో ఉన్న




రూ:1,05,000/- దొంగిలించారు అంతేకాక మామునూరు పరిధిలో నీ బొల్లికుంట గ్రామంలో రాత్రి వేళలో ఇండ్లల లో ఎవరూ లేనిది గమనించి రెండు ఇలా తాళాలు పగలగొట్టి కొంత డబ్బులను దొంగిలించినారు.గీసుకొండ పరిధిలో జరిగిన చోరీల పై ఫిర్యాదులు రావడంతో కేసులు నమోదు చేసుకున్న గీసుగొండ్ పోలీసులు ప్రస్తుతం అందుబాటులో వున్న టెక్నాలజీని వినియోగించుకోని దర్యాప్తు చేపట్టి పోలీసులు నిందితుల కదలికలపై నిఘా పెట్టడం జరిగింది. ఇందులో భాగంగా గీసుగొండ పోలీసులు గురువారం ఉకల్ హవేళి క్రాస్ రోడ్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, అనుమానస్పదంగా వస్తున్న రెండు కార్లను పోలీసులు అపి వేసి కార్లలో తనిఖీ చేయగా కార్లలో గొర్రెల మలంతో పాటు, వాటి జుట్టు కారులో గుర్తించి పోలీసులు కారులో ప్రయాణిస్తున్న నిందితులను అదుపులోకి తీసుకొని విచారించగా నిందితులు గొర్రెలను చోరీలకు పాల్పడి వాటిని విక్రయించే వారమని నిందితులు పోలీసుల ఎదుట అంగీకరించి అలా అమ్మగా వచ్చిన డబ్బు ఇదేనని నేరానికి పాల్పడగ వచ్చిన డబ్బులను పోలీసులు స్వాధీన పరచుకొని వారిని పోలీసులు నుంచి అరెస్ట్ చేయడం జరిగింది.నిందితులను పట్టు కోవడంలో ప్రతిభ కనబరిచిన గీసుగొండ ఇన్స్పెక్టర్ డి. విశ్వేశ్వర్, ఎస్.ఐ కె. కుమార్, కానిస్టేబుళ్ళు విజయ్, అరవింద్, సాయి, హరి, రజని కుమార్ మరియు ఇతర సహకరించిన సిబ్బందిని మామూనూర్ ఏసీపీ అభినందిస్తూ తగిన శాఖ పరమైన ప్రోత్సాహకాలు అందిస్తామని తెలియజేశారు.

# పంచాయతీ ఎన్నికలు నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలి

**రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని పంచాయతీ ఎన్నికల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన ఎన్నికల సంఘం కమీషనర్**

**హన్మకొండ,డిసెంబర్ -04 :** పంచాయతీ ఎన్నికలు నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ ఐ.రాణి కుముదిని అన్నారు.పంచాయతీ ఎన్నికల నిర్వహణ పై రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ ఐ. రాణి కుముదిని జిల్లా కలెక్టర్ లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పంచాయతీ ఎన్నికల ఫలితాల ప్రకటన నియమాలు, ఏకగ్రీవ స్థానాలలో ఉపసర్పంచ్ ఎన్నిక, పోస్టల్ బ్యాలెట్ ఏర్పాటు, నామినేషన్ల పై వచ్చే ఫిర్యాదులు, తదితర అంశాలపై ఎన్నికల కమిషనర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని మాట్లాడుతూ వార్డు సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామాలలో ఉప సర్పంచ్ నియామకం నిబంధనల ప్రకారం జరిగే విధంగా చూడాలన్నారు. ఏకగ్రీవంగా ఎంపికైన గ్రామ సర్పంచ్ స్థానాలకు ఫారం -10 ప్రకారం ఫలితాల ప్రకటన చేపట్టాలని అన్నారు. నామినేషన్ల ప్రక్రియ ముగిసిన తర్వాత సంబంధిత గ్రామాలలో స్టేజ్ 2 రిటర్నింగ్ అధికారుల నియామకం పూర్తి చేయాలని అన్నారు. నామినేషన్ల ప్రక్రియ చివరి దశకు చేరుకున్నందున సంబంధిత రిపోర్టులు టి- పోల్ లో పెండింగ్ లేకుండా నమోదు చేయాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీకి సంబంధించి వచ్చిన నామినేషన్ లలో వాలీడ్ నామినేషన్ వివరాలు అప్ డేట్ చేయాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ కోసం వచ్చిన ప్రతి దరఖాస్తు పరిశీలించి తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించాలని, ప్రతి మండలంలో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలని అన్నారు. బ్యాలెట్ పేపర్ నిబంధనల ప్రకారం ముద్రించాలని అన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో ఎటువంటి ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలు జరుగకుండా పక్కా నిఘా ఏర్పాటు చేయాలని అన్నారు. పంచాయతీ ఎన్నికలలో ఒక్క ఓటు కూడా చాలా ముఖ్యంగా మారుతుందని,






అధికారులు అప్రమత్తంగా ఉంటూ అవసరమైన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. లా అండ్ ఆర్డర్ అదనపు డిజిపి మహేష్ భగవత్ మాట్లాడుతూ, పంచాయతీ ఎన్నికల సందర్భంగా నిర్వహించే తనిఖీ లలో అక్రమంగా నగదు, మద్యం, ఆభరణాలను ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు తరలించే పక్షంలో నిబంధనల ప్రకారం సీజ్ చేయాలని అన్నారు. ఈ సందర్భంగా మూడు విడతల నామినేషన్లు, ఏకగ్రీవ గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నికల నిర్వహణ, ఎన్నికలకు వినియోగించే బ్యాలెట్ పేపర్లు, పోస్టల్ బ్యాలెట్, తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర ఎన్నికల కమిషర్ అడిగిన ప్రశ్నలకు హనుమకొండ జిల్లా వివరాలను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ వెల్లడించారు. హన్మకొండ జిల్లాలో మొదటి, రెండు విడతల్లో నామినేషన్ల స్వీకరణ పూర్తయిందని, మూడో విడత సర్పంచ్, వార్డు స్థానాలకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. మొదటి విడతలో నాలుగు గ్రామ పంచాయతీలు ఏక గ్రీవమయ్యాయని చెప్పారు. ఏక గ్రీవమైన గ్రామ పంచాయతీలకు ఉప సర్పంచ్ ఎన్నిక కూడా నిర్వహించామని పేర్కొన్నారు. జిల్లాలో ఐదు సర్పంచులు,153 వార్డు మెంబర్లు ఏక గ్రీవంగా ఎన్నికయ్యారని తెలిపారు. ఏక గ్రీవంగా ఎన్నికైన వారికి ఫారం- 10 ఇవ్వడం జరిగిందన్నారు. స్టేజ్- 2 ఆర్వోలకు శిక్షణ పూర్తయిందని, రేపటి (శుక్రవారం) రోజున జోనల్ అధికారులకు, మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల దృష్ట్యా ఓటరు స్లిప్పుల పంపిణీ కార్యక్రమం జరుగుతుందని, ఈ ప్రక్రియను మూడు రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. జిల్లాలో ఏకగ్రీవ స్థానాలు, అందుకు గల కారణలు ఏమై ఉంటాయని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అడిగిన ప్రశ్నకు జిల్లా కలెక్టర్ సమాధానమిస్తూ 95 వార్డులకు సింగిల్ నామినేషన్లు వచ్చాయని, ఇప్పటివరకు 153 వార్డులు ఏకగ్రీవం అయ్యాయని తెలిపారు. ఏకగ్రీవ సర్పంచ్, వార్డు స్థానాలకు డబ్బులతో కానీ, వేలం పాట ద్వారా జరిగినట్లు తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు. దీనిపై ఎంపీడీవోలు, ఎంపిఓ, పోలీస్ అధికారులతో వివరణ తీసుకున్నామని పేర్కొన్నారు. పోస్టల్ బ్యాలెట్, సర్వీస్ ఓట్లకు దరఖాస్తు చేసుకున్న వారిలో కొందరు సదరు చిరునామాలో లేరని, వారి సరియైన చిరునామా ను గుర్తించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కు కలెక్టర్ స్నేహ శబరీష్ తెలియజేశారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ ఫోటో వివరాలతో కూడిన ఓటరు స్లిప్పుల పంపిణీని త్వరగా పూర్తి చేయాలన్నారు. మొదటి విడత మూడు మండలాల్లో విధులు నిర్వర్తించే ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించు కునేందుకు ఎంపీడీవో కార్యాలయాల్లో ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్ లను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా పంచాయతి అధికారి లక్ష్మీ రమాకాంత్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మేన శ్రీను,జడ్పీసీఈవోరవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో కాంగ్రెస్ నాయకుల అత్యవసర సమావేశం..

**కరీంనగర్ టౌన్ డిసెంబర్ 04:** కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ నాయకులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. తాజాగా జిల్లా కాంగ్రెస్ కమిటీ డీసీసీ అధ్యక్షులుగా నియమితులైన మేడిపల్లి సత్యంకి ఘన స్వాగతం పలకడమే కాకుండా, ప్రతి బూత్ నుంచి 100 సంతకాల సేకరణ ప్రక్రియను ప్రారంభించే విషయాన్ని ఈ సమావేశంలో ప్రధాన ఎజెండాగా నిర్ణయించారు. అదేవిధంగా ఓటు చోరీ అంశంపై పార్టీ తరఫున చేపట్టాల్సిన చర్యలపై కూడా చర్చ జరిగింది.



# ట్రాఫిక్ జరిమానాలపై ఎలాంటి రాయితీ లేదు

**● హన్మకొండ ట్రాఫిక్ ఇన్స్ స్పెక్టర్ సీతారెడ్డి**

**హన్మకొండ,డిసెంబర్ -04 :** పెండింగ్ ట్రాఫిక్ చల్లన్ల గురించి సామాజిక మాధ్యమాలలో జరుగుతున్న అసత్య ప్రచారం గురించి పోలీసులు వివరణ ఇచ్చారు. గత కొద్ది రోజులుగా ఈ నెల 13 వ తేదీన జరిగే జాతీయ మెగా లోకదాలత్ లొ పెండింగ్ ట్రాఫిక్ చలానాలు డిస్కౌంట్ తో పరిష్కారం చేసుకోవచ్చు అని కొంత మంది వీడియోల తో అసత్య ప్రచారం చేస్తున్నారు. కానీ పెండింగ్ ట్రాఫిక్ చలానాలు డిస్కౌంట్ తో పరిష్కారం చేసుకోవచ్చు అనే ఉత్తరువులు ఉంటే ప్రభుత్వం, పోలీస్ డిపార్టుమెంటు నుండి తప్పకుండా ప్రకటన వస్తుంది. ఇప్పటి వరకు అటువంటి ఉత్తరువులు ఏమి లేవు. అలాగే సామజిక మాధ్యమాలలో అసత్య ప్రచారం చేసి ప్రజలను గందరగోళం కి గురి చేయవద్దని పోలీసులు విజ్ఞప్తి చేశారు మరియు వాహన దారులు ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించి చలానాల బారిన పడవద్దు.

# ముఖ్యమంత్రి పర్యటన బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన సిపి



**హన్మకొండ,డిసెంబర్ -04 :**నేడు రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నర్సంపేట పర్యటన సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ పోలీస్ మరియు రెవెన్యూ అధికారులతో ముఖ్య మంత్రి పర్యటించే ప్రదేశాలను సందర్శించి పోలీస్ బందోబస్త్ ఏర్పాట్లపై క్షేత్ర స్థాయిలో సమీక్ష జరిపారు. ముఖ్యంగా సభాస్థలవేదిక, హెలిప్యాడ్, పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించి ముఖ్య మంత్రి భద్రతకై తీసుకోవాల్సిన చర్యలపై సీపీ అధికారులకు పలు సూచనలు సలహాలు అందజేశారు.

# కలెక్టరేట్‌లో మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య వర్ధంతి

**రోశయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**

**హన్మకొండ,డిసెంబర్ -04 :**హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య వర్ధంతిని నిర్వహించారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలు లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి,



తది తరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై.వి. గణేష్, సహకార అధికారి సంజీవరెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ అప్పయ్య, పర్యాటక శాఖ అధికారి శివాజీ, ఎస్సి కార్పొరేషన్ ఈడీ బాలరాజు, బీసీ వెల్ఫేర్ అధికారి నరసింహ స్వామి, మెప్మా పీడీ జోనా, ఇతర అధికారులతో పాటు కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పలు పార్టీలకు రాజీనామా కాంగ్రెస్‌లో చేరిక

**ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభంలో మట్టా దయానంద్**

**పెనుబల్లి, డిసెంబర్ 04 :** పెనుబల్లి మండలం మర్లకుంట గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో గురువారం రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. పేద ప్రజలకు ఇందిరమ్మ ఇల్లు అందించిన తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి శ్రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రివర్యులు శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల



నాగేశ్వరావు కు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.వి ఎం బంజర గ్రామ కమిటీ ఆధ్వర్యంలో 10 కుటుంబాలు టిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్ట దయానంద్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో





చేరారు. అదేవిధంగా సత్తుపల్లి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కల్లూరు మండలం రాళ్ల బంజర గ్రామానికి చెందిన 15 కుటుంబాలు బిఆర్ఎస్, బిజెపి పార్టీలకు రాజీనామా చేసి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. అనంతరం ఇటీవల కాలంలో వంగా కాంతారావు అనారోగ్యం పాలుకాగా వారి కుటుంబానికి వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమం లో సత్తుపల్లి ఏఎంసి చైర్మన్ దోమ ఆనంద్ బాబు, పెనుబల్లి మండలం, కల్లూరు మండలం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మర్లకుంట ఇందిరమ్మ కమిటీ, లబ్ధిదారులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, ఎన్ఎస్యుఐ నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా దత్త జయంతి వేడుకలు.






**నారాయణఖేడ్ :** దత్త జయంతి పురస్కరించుకొని పెద్ద శంకరంపేటలోని మాణిక్ ప్రభు మందిరంలో.సంతోషిమాత ఆలయంలో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుండి ఆలయ పూజారులు రాయల కృష్ణ శర్మ మహేష్ శర్మ అభిలాష్ శర్మ లు ఆధ్వర్యంలో భక్తులు స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు హెూమం ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. వేకువ జాము నుండి అధిక సంఖ్యలో భక్తులు ఆయా ఆలయాలలో స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయాలను వివిధ రకాల పూలతో విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఐ ఆలయాలలో భక్తులందరికీ అన్న ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాణిక్ ప్రభు మందిరం ఆలయ కమిటీ సభ్యులు గాండ్ల సర్వేశ్వర్ దయానంద్ కాంతం సత్యనారాయణ ఆలయాలలో కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో మహిళలు భక్తులు పాల్గొన్నారు.

# ఏకగ్రీవ సర్పంచులకు ధ్రువపత్రాలు అందజేత



**నారాయణఖేడ్:** పెద్దశంకరపేట మండలంలో 27 గ్రామ పంచాయతీలగాను ఐదు గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. ఆయా స్థానాలకు ఒకే నామినేషన్ రావడంతో అధికారులు గురువారం కొత్తపేట, సంగారెడ్డిపేట, మాడ్చెట్ పల్లి, ఇసుకపాయ తండా, గట్టు మ కిందితాండ పంచాయతీ పరిధిలో సర్పంచ్ అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారిని గ్రామస్తులు అభినందించారు. కొత్తపేట గ్రామంలో ఏకగ్రీవ సర్పంచ్ ఎన్నికైన తంబి గారి పోచమ్మ గ్రామం ప్రజలకు తన ఎన్నికలకు సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు

# తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల్లో యఫ్ ఆర్ ఎస్ హాజరు నమోదు అమలు




**రంగారెడ్డి జిల్లా :** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో యఫ్ ఆర్ ఎస్ (ఫేసియల్ రికగనైసన్ సిస్టమ్ ) ద్వారా హాజరు నమోదు విధానాన్ని నూతనంగా ప్రవేశపెడుతున్న నేపథ్యంలో, పలు సంఘాలు, పేరెంట్ అసోసియేషన్ తమ అభిప్రాయాలు తెలియజేశాయి.ప్రస్తుతం గవర్నమెంట్ కాలేజీలు, జెడ్పీ పాఠశాలల్లో ఉపాధ్యాయులందరికీ నిర్ణీత “ఫిక్స్ టైమ్ టేబుల్” ఉన్నప్పటికీ, టీ జి ఎస్ డబ్ల్యూ ఆర్ ఈ ఐ ఎస్ ఉపాధ్యాయులు పలు విధులు నిర్వర్తించాల్సి ఉండటం వల్ల సమయానికి హాజరు కావడం, వెళ్లడం సవాలుగా మారుతున్నట్లు వారు తెలిపారు. దీంతో యఫ్ ఆర్ ఎస్ హాజరు విధానం అమలులో సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది.సాంఘిక సంక్షేమ గురుకుల స్టాండింగ్ ఆర్డర్స్ ప్రకారము ప్రిన్సిపల్‌తో పాటు పి డి, పి ఈ టి, ప్రతి రోజు తెల్లవారుజాము ఉదయం 5 గంటలకు హాజరు కావాల్సి ఉంటుంది. వార్డెన్లు స్థానికంగా ఉండి పాఠశాల పర్యవేక్షణలో పాల్గొనాలని కూడా నిబంధన ఉంది. ఇతర ఉపాధ్యాయులు ఉదయం 8 గంటలకు హాజరు కావాలి. ఆఫీస్ సిబ్బంది 10 గంటలకు డ్యూటీలో చేరాలి. మొత్తం రోజువారీ డ్యూటీ సమయం. ప్రిన్సిపాల్ కు 514 నిమిషాలు ఉండేలా స్పష్టం చేస్తున్నాయి ప్రిన్సిపల్స్ స్థానికంగా ఉండకపోవడంపై వివిధ విద్యార్థి సంఘాలు, పేరెంట్స్ , ఉపాధ్యాయ సంఘాలు మాట్లాడుతూ ప్రిన్సిపాల్‌లు, పి డి, పి ఈ టి, వార్డెన్ రెండవ హజరు నమోదు చేయాలి ప్రిన్సిపల్ రాత్రి 9:30 గంటలకు రెండవ హాజరు నమోదు చేయాలి తద్వారా గురుకుల వ్యవస్థ మరింత సమర్థవంతంగా పనిచేస్తుందని తెలియచేసినారు.అయితే చాలామంది ప్రిన్సిపాల్స్ హైదరాబాద్ వంటి సుదూర ప్రాంతాల నుండి వరంగల్, నల్గొండ, మహబూబ్‌నగర్ మెదక్ వికారాబాద్ తదితర జిల్లాల్లోని రాకపోకలు చేయడం వల్ల గురుకుల నిర్వహణలో సమస్యలు తలెత్తుతున్నాయని తెలియజేశారు ఎఫ్.ఆర్.ఎస్ హాజరు నమోదు విధానంపై పలు సంఘాలు, పేరెంట్ అసోసియేషన్ డిమాండ్ చేస్తూ సీనియర్ ఉపాధ్యాయులు,గురుకులాల విద్యార్థుల భద్రత, నియమ నిబంధనలు, నిర్వహణ పరమైన అంశాల్లో ఏకాభిప్రాయం వచ్చిన తర్వాతే యఫ్ ఆర్ ఎస్ అమలు చేయాలని వారు అభిప్రాయపడ్డారు.

# అర్థ సుధాకర్ రెడ్డి కీ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నుండి పిలుపు



**వికారాబాద్ జిల్లా డిసెంబర్ 5 పరిగి :** నిరంతరం పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ వికారాబాద్ నియోజకవర్గంతో పాటు జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీలో మంచి గుర్తింపు తెచ్చుకున్న నాయకుడు అర్థ సుధాకర్ రెడ్డి, ఇటీవలే వికారాబాద్ జిల్లా డీసీసీ పదవీ కోసం రేసులో ఉన్నారు. తీరా అతనికి ఇవ్వకుండా మరొకరికి ఇవ్వడంతో రాష్ట్ర పార్టీ అధిష్టానం పై నిరుస్తా పడటం పార్టీ కార్యకలాపాలకు కొంత దూరంగా ఉండడం జరిగింది ఇట్టి విషయం తెలుసుకోని భవిష్యత్తులో మంచి అవకాశం కల్పించేందుకు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు తెలంగాణ శాసనసభ సభాపతి వికారాబాద్ శాసనసభ్యులు గడ్డం. ప్రసాద్ కుమార్ సూచనల మేరకు గురువారం ఏఐసీసీ తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, మర్యాదపూర్వకంగా భేటీ అయిన వికారాబాద్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అర్థ. సుధాకర్ రెడ్డి, ఈ సందర్భంగా వారితో తాజా రాజకీయ విషయలపై సుదీర్ఘ చర్చ జరిపినట్టు తెలిసింది. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కె. సంతోష్, పాల్గొన్నారు.

# కంపెనీల పేరు చెప్పి పేదల భూములు దోచుకున్నారు

**ఇసుక దందా కోసమే జగన్నాథ్ పూర్ ప్రాజెక్ట్ నిలిపేశారు**
**సిర్పూర్ ప్రజలే నా కుటుంబ సభ్యులు**
**డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్**
**రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బిఆర్ఎస్**



**కాగజ్ నగర్ 04 డిసెంబర్ :** స్థానిక ప్రజల కోసం కంపెనీలు పెడుతున్నామని,భూమి ఇచ్చిన వారికి ఉద్యోగం కూడా ఇస్తామని నమ్మించి పేదల భూములను గుంజుకొని బినామీల పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించి కంపెనీ ఏర్పాటు చేయకుండా ప్రజలను మోసం చేశారని బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు.స్థానిక సర్పంచ్ ఎన్నికల సందర్భంగా ఈ రోజు ఆయన కాగజ్ నగర్ మండలంలోని జగన్నాథపూర్ గ్రామంలో పర్యటించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ,ఇప్పటివరకు జగన్నాథపూర్ ప్రాజెక్టు పాలకులు ఎందరు మారినా ఎందుకు పూర్తిచేయలేదని ప్రశ్నించారు.గత పాలకులు జగన్నాథపూర్ ప్రాజెక్టును ఇసుక దందా చేయడానికే వాడుకున్నారని ఆరోపించారు. ప్రాజెక్టు కట్టకుండా,కాలువలు తవ్వి వదిలేశారని,ప్రజలు కాగజ్ నగర్ వెళ్లడానికి కనీసం బ్రిడ్జి కూడా నిర్మించలేకపోయారని విమర్శించారు. సిర్పూర్ నియోజకవర్గంలో నాకు బంధువులు, కుటుంబ సభ్యులు ఎవరూ లేరని,ఆస్తులను కుటుంబ సభ్యులకు పంచడం,కాంట్రాక్టులు బంధువులకు ఇవ్వడం వంటి పనులు చేయనని,నేను ఇతర ప్రాంతాల నుండి బంధువుల కుటుంబా లను ఇక్కడికి తీసుకొచ్చి దోపిడీ చేయనన్నారు.సిర్పూర్ ప్రజలే నా కుటుంబ సభ్యులని స్పష్టం చేశారు.ఇక్కడి ప్రజల అభివృద్దే నాకు ముఖ్యమన్నారు.బోరిగాం,జవాజిగూడ ప్రజలు కాగజ్ నగర్ రావడానికి రోడ్డు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని,వందేళ్ల నుండి ఈ గ్రామం అభివృద్ధికి నోచుకోలేదన్నారు.జవాజిగూడ గ్రామానికి చెందిన మహిళలు అంగన్ వాడీ సబ్ సెంటర్ కావాలని,పాఠశాలకు ఇద్దరి బదులు ఒకరే టీచర్ ఉన్నారని,యువతకు ఉపాధి అవకాశాలు కావాలని అడిగారు.అనంతరం పాఠశాల విద్యార్థులతో కలిసి మాట్లాడారు,వారితో బోర్డుపై లెక్కలు చేయించి బహుమతి ఇచ్చి ప్రోత్సహించారు,ఇంకా బాగా చదువుకోవాలని చెప్పారు.రాబోయే స్థానిక సర్పంచ్ ఎన్నికల్లో తాము బలపరిచిన అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విద్య,వైద్యం మరియు ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు,సీనియర్ నాయకులు కొంగ సత్యనారాయణ, మండల కన్వీనర్ పర్వతి అంజన్న,మహేష్,మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# బసవలింగ పట్టదేవర అమృత మహెూత్సవాలు జయప్రదం చేయండి

**నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి.**





**పెద్ద శంకరంపేట** నారాయణాఖేడ్ మున్సిపల్ పట్టణం లోని బసవ మండపం లో ని ర్వహించిన బసవలింగ పట్టు దేవర అమృత మహెూత్సవాలు జయప్రదం చేయాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం అమృత ఉత్సవాల కరపత్రాన్ని విడుదల చేస్తూ ఆయన మాట్లాడారు.నారాయణఖేడ్ పట్టణం బసవ మండపం లో డిసెంబర్ 7 నుండి 21 వ తారీకు వరకు సాయంత్రం 6:30 నుండి 7:30 వరకు ప్రవచనాలు కార్యక్రమం జరుగుతుందని, రోజు ఉదయం యోగ కార్యక్రమం జరుగుతుందని, వీటిని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మహెూత్సవాలకు నా వంతు సహకారం ఉంటుందని అన్నారు. మాజీ జిల్లా ప్రణాళిక సంఘం అధ్యక్షులు నాగేష్ సెట్కార్ మాట్లాడుతూ. మా ప్రాంతంలో ఈ అమృత్ మహెూత్సవాలను జరుగుతున్నాయి కాబట్టి మేమందరం కలిసికట్టుగా పనిచేస్తామని, జయప్రదం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బసవలింగ సమాజం నాయకులు నాగిశెట్టి, కత్తే శివకుమార్ పాటిల్, శివ కుమార్, శంకర్రావు పాటిల్, నందప్ప, వీరిశెట్టి, సంగిశెట్టి, నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# దోమ మండలంలో కాంగ్రెస్ కు భారీ షాక్

**- మాజీ ఎమ్మెల్యే సమక్షంలో కారెక్కిన కాంగ్రెస్, నాయకులు**
**- పరిగి లో బిఆర్ఎస్ లోకి పెరుగుతున్న వలసల పర్వం**
**- పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం**
**- పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి**



**వికారాబాద్ జిల్లా డిసెంబర్ 5 పరిగి :** ప్రజావ్యతిరేక పాలన అంతం కావాలంటే రాష్ట్రంలో మళ్లీ కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి రావాలని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు చేసిన మోసాలను అవినీతి అక్రమాలను సహించలేక కాంగ్రెస్ పార్టీని వీడి బిఆర్ఎస్ పార్టీలోకి వలసలు మొదలయ్యాయి. దోమ మండలం గూడూరు గ్రామానికి చెందిన గంపల్లి మహేష్, శ్రీనాథ్,కొత్తూరు వెంకటయ్య,చాకలి వెంకటయ్య ,ఆంజనేయు లు, నవీన్,సత్తయ్య,నరేష్ కాంగ్రెస్, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, సుమారు 20 మందికి పైగా మాజీ జడ్పిటిసి కొప్పుల నాగి రెడ్డి ఆధ్వర్యంలో పరిగి నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కొప్పుల మహేష్ రెడ్డి, సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు.వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి,మాట్లాడుతూ...రాష్ట్రంలో మార్పు మొదలైంది, అధికార పార్టీని వీడి బిఆర్ఎస్ పార్టీ లోకి వలసలు పెరుగుతాతున్నాయన్నారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలు విస్మరిస్తూ కేవలం అధికారం కోసం మాత్రమే ప్రజలకు మోసపూరిత హామీలు ఇచ్చారంటూ మండిపడ్డారు. అధికారం లోకి వచ్చిన నాటి నుండి బీఆర్ఎస్ వర్గ నాయకులపై అక్రమ కేసులు బనాయించి బెదిరింపులకు పాల్పడడమే పనిగా పెట్టుకున్నారని ఎద్దవా చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నడుపిస్తున్నది.. ప్రజా పాలనా కాదు దుర్మార్గ పాలన నడుస్తుందన్నారు.రాష్ట్రంలో ప్రభుత్వం పై ప్రజలలో వ్యతిరేకత పెరుగుతుందని భావించి ప్రజల దృష్టి మరల్చడానికి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్‌ప్రెసిడెంట్ కేటీఆర్, పై అక్రమంగా పార్ములా ఈ కారు రేసు కేసును పెట్టి ఎలాగైనా జైలు, కు పంపాలని రేవంత్‌రెడ్డి కుట్రలు చేస్తున్నాడని మండిపడ్డారు. కాంగ్రెస్ చేస్తున్న కుట్రలాన్ని రాష్ట్ర ప్రజలు గమినిస్తున్నారు. ఈ ప్రభుత్వానికి త్వరలో ప్రజలు తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కొంతమంది. నాయకులు స్వార్థం కోసం పార్టీలు మారుతుంటే యువత మాత్రం కేసీఆర్ వెంటే నడవాలని బిఆర్ఎస్ పార్టీలో చేరుతున్నరన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే యువత బతుకులు బాగుపడతాయని బోగస్ హామీలిచ్చి యువతను నిండా ముంచిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులను రాజకీయాలకు మాత్రమే వాడుకుని మోసం చేసిందని విమర్శించారు. ఇచ్చిన హామీలను సంపూర్ణంగా అమలు చేస్తారని ఆశించిన యువత అంతా కూడా ఆందోళనలో ఉందన్నారు. యావత్ తెలంగాణ యువత నిరాశలో ఉందని, ఈ తెలంగాణ రాష్ట్రానికి కేసీఆర్ మాత్రమే శ్రీరామరక్ష అని అన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు మాజీ సర్పంచ్ చంద్రశేఖర్ రెడ్డి, అధ్యక్షులు చంద్రశేఖర్, సీనియర్ నాయకులు రఘు మోహన్ రెడ్డి, వీర లింగం, రాజశేఖర్ రెడ్డి నవీన్ రెడ్డి గూడూరు రాఘవేందర్ రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలి

**మైక్రో అబ్జర్వరులు శిక్షణా కార్యక్రమంలో జిల్లా సాధారణ పరిశీలకులు యాస్మిన్ బాషా,**






**వికారాబాద్ జిల్లా డిసెంబర్ 5 పరిగి :** పోలింగ్ రోజు మైక్రో అబ్జర్వర్లు విధుల పట్ల నిబద్ధతతో పనిచేయాలని జిల్లా సాధారణ పరిశీలకులు షేక్ యాస్మిన్ భాష అన్నారు. గురువారం ఐ.డి.ఓ.సి సమావేశ హాలు నందు ఏర్పాటు చేసిన మైక్రో అబ్జర్వరు లు పోలింగ్ రోజున చేపట్టే విధివిధానాల శిక్షణా కార్యక్రమంలో జిల్లా అధికారులతో కలిసి పాల్గొన్నా సాధారణ పరిశీలకులు యాస్మిన్ బాష, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా లో 594 గ్రామా పంచయతిలకు గాను 98 మంది మైక్రో అబ్జర్వర్లను కేటాయించడం జరుగుతుందని ,ఎన్నికల నిర్వహణ మొత్తానికి కండ్లు, చెవులు మైక్రోఅబ్జర్వర్లె నని , ఎన్నికల నియమావళి ని అనుసరించి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. వికారాబాద్, తాండూర్, కోడంగల్ , పరిగి నియోజకవర్గాలలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో మైక్రో అబ్జర్వర్ల విధులు కీలకమని అన్నారు. తప్పక చెక్ లిస్ట్ ప్రకారం విధులు నిర్వహించాలని సూచించారు. మైక్రో అబ్జర్వర్ల పోలింగ్ రోజున పోలింగ్ బూత్ లో జరిగే పోలింగ్ ప్రక్రియను పరిశీలన చేయడానికి నియమించడం జరుగుతుందని, వెబ్ క్యాస్టింగ్ ,పోలింగ్ బూత్ లో ప్రిసైడింగ్ అధికారికరెక్ట్ గా చేస్తున్నారా లేదా వారు చేసే ప్రతి అంశాన్ని పరిశీలన చేయాలని తెలిపారు. పోలింగ్ రోజున పోలింగ్ నిర్వహణ పరిశీలన చేయాలని సూచించారు. ఎంత మంది పోలింగ్ ఏజెంట్లు హాజరు అయినది లేనిది తప్పక చూడాలని అన్నారు. ముఖ్యంగా బ్యాలట్ బాక్సు ఖాళీ గా ఉన్నాయా లేదా చెక్ చేయాలనీ, సీలింగ్ చేస్తున్నారా, లేదా చెక్ చేసుకోవాలని,పోలింగ్ కేంద్రాలలో అన్ని సౌకర్యాలు పరిశీలన చేయాలని సూచించారు. మైక్రో అబ్జర్వర్ల లు పోలింగ్ ముగిసిన అనంతరం సాధారణ పరిశీలకులకు రిపోర్ట్ లు సబ్మిట్ చేయాలని తెలిపారు. పోలింగ్ స్టేషన్ లో ప్రశాంతంగా నిబద్ధతతో పనిచేయాలని పరిశీలనకు ప్రాధాన్యత ఉండాలని, విధుల పట్ల ఎలాంటి పొరపాట్లు జరుగకుండా విధులు నిర్వహించాలని మైక్రో అబ్జర్వర్లు కు ఆదేశించారు. పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా పోలింగ్ రోజు మైక్రో అబ్జర్వర్లు చేయాల్సిన విది విధానాలు మాస్టర్ ట్రైనర్స్ రామ్ రెడ్డి, కృష్ణా రెడ్డి పని చేయు విధానం గురించి వివరించారు.ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, డి ఆర్ డి ఓ శ్రీనివాస్. ఎల్ డి ఎం యాదగిరి, బి సి వెల్ఫేర్ అధికారి మాధవ రెడ్డి, మైక్రో అబ్జర్వర్స్ తదితరులు పాల్గొన్నారు.

పీపుల్స్ న్యూస్ దినపత్రిక



## ప్రోటీన్ల లోపం ఉంటే మన శరీరంలో కనిపించే లక్షణాలు, సంకేతాలు ఇవే.. ఏయే ఆహారాలను తినాలంటే..?




మన శరీరానికి రోజూ అవసరం అయ్యే పోషకాల్లో ప్రోటీన్లు కూడా ఒకటి. ప్రోటీన్లు మనకు పెద్ద ఎత్తున అవసరం అవుతాయి. ప్రతి ఒక్కరు రోజూ కచ్చితంగా తమ శరీర బరువుకు అనుగుణంగా ప్రోటీన్లను తీసుకోవాల్సి ఉంటుంది. ప్రతి ఒక కిలో శరీర బరువుకు గాను 0.75 గ్రాముల ప్రోటీన్లను మనం తీసుకోవాలి. అప్పుడే శరీరానికి శక్తి లభిస్తుంది. కండరాలు మరమ్మత్తులకు గురై ఆరోగ్యంగా ఉంటాము. దేహం దృఢంగా మారుతుంది. రోజంతా శక్తి స్థాయిలు అధికంగా ఉంటాయి. ఎలాంటి రోగాలు రాకుండా ఉంటాయి. అయితే ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతున్న గణాంకాల ప్రకారం ప్రస్తుతం చాలా మంది ప్రోటీన్లు ఉండే ఆహారాలను సరిగ్గా తీసుకోవడం లేదని తేలింది. అందరూ జంక్ ఫుడ్‌కు అలవాటు పడ్డారు. దీని కారణంగా చాలా మందికి ప్రోటీన్ల లోపం కూడా వస్తుందని హెచ్చరిస్తున్నారు.విపరీతమైన అలసట, నీరసం..ప్రోటీన్ల లోపం ఉంటే మన శరీరం మనకు పలు లక్షణాలను, సంకేతాలను తెలియజేస్తుంది. ప్రోటీన్ల లోపం ఉన్నవారు ఎల్లప్పుడూ నీరసంగా ఉంటారు. బలహీనంగా అనిపిస్తారు. అలసట ఎక్కువగా ఉంటుంది. చిన్న పనిచేసినా విపరీతమైన అలసట వస్తుంది. అలాగే కండరాల నొప్పులు కూడా ఉంటాయి. బద్ధకంగా ఉంటారు. ఏ పని చేయాలనిపించదు. ఇక బరువు తగ్గడం కోసం ఎన్ని వ్యాయామాలు చేసినా డైట్‌ను పాటించినా బరువు తగ్గలేకపోతుంటారు. ప్రోటీన్ల లోపం వల్ల కూడా ఇలా జరుగుతుంది. ఈ లోపం ఉంటే మెదడుపై కూడా ప్రభావం పడుతుంది. దీని వల్ల మూడ్ మారుతుంది. ఎల్లప్పుడూ ఏదో కోల్పోయినట్లు ఉంటారు. ఒత్తిడి, ఆందోళన అధికంగా ఉంటాయి.ఎముకలు, చర్మం, జుట్టు సమస్యలు..ప్రోటీన్ల లోపం ఉన్నవారికి లో షుగర్ సమస్య ఏర్పడుతుంది. శరీరంలో షుగర్ లెవల్స్ ఎల్లప్పుడూ పడిపోతుంటాయి. దీంతో నీరసం వచ్చి స్పృహ తప్పినట్లు అనిపిస్తుంది. ప్రోటీన్ల లోపం ఉంటే ఎముకలకు క్యాల్షియం, విటమిన్ డి సైతం సరిగ్గా లభించవు. దీంతో అవి నొప్పులుగా ఉంటాయి. ఎల్లప్పుడూ ఎముకల నొప్పి ఉంటుంది. ఎముకలు బలహీనంగా కూడా మారుతాయి. చిన్న దెబ్బ తగిలినా ఎముకలు విరిగిపోయే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ప్రోటీన్ల లోపం ఉంటే చర్మం ఎల్లప్పుడూ కందిపోయి ఎర్రగా కనిపిస్తుంది. కొందరికి చర్మంపై పొట్టు రాలుతుంది. పొలుసులుగా ఏర్పడి చర్మం ఊడిపోతుంది. అలాగే జుట్టు బాగా రాలిపోతుంది. వెంట్రుకలు పలుచబడతాయి. అలాగే గోర్లు బలహీనంగా మారుతాయి. అందవిహీనంగా కనిపిస్తాయి. గోర్లు చిట్లిపోతాయి. ఇలా ప్రోటీన్ల లోపాన్ని మనం సులభంగా గుర్తించవచ్చు.ఈ ఆహారాలను తినాలి..ఇక ఈ లక్షణాలు ఉన్నవారు రోజూ ప్రోటీన్లు ఉండే ఆహారాలను తింటుంటే ఈ లోపం నుంచి బయట పడవచ్చు. దీంతో ఆయా అనారోగ్య సమస్యలు కూడా తగ్గిపోతాయి. ఆరోగ్యంగా ఉంటారు. ఇక ప్రోటీన్లు మనకు ఎక్కువగా పప్పు దినుసులు, బీన్స్, శనగలు, బాదంపప్పు, జీడిపప్పు, వాల్ నట్స్, పిస్తా, గుమ్మడి విత్తనాలు, పొద్దు తిరుగుడు విత్తనాలు, చియా సీడ్స్, అవిసె గింజలు, పచ్చి బఠానీలు, కాలిఫ్లవర్, క్యాబేజీ, చికెన్, మటన్, మటన్ లివర్, చేపలు, గుడ్లు, పాల వంటి ఆహారాల్లో లభిస్తాయి. కనుక వీటిని రోజువారి ఆహారంలో భాగం చేసుకుంటే కావల్సినన్ని ప్రోటీన్లు లభిస్తాయి. ఇవి మనల్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. రోగాలు రాకుండా చూస్తాయి.

## పీకన్ నట్స్ గురించి మీరు ఎప్పుడైనా విన్నారా..? వీటిని రోజూ తింటే ఎన్నో అద్భుతమైన లాభాలను పొందవచ్చు..!



బాదంపప్పు, జీడిపప్పు, వాల్ నట్స్ వంటి అనేక రకాల నట్స్ గురించి చాలా మందికి తెలుసు. కానీ మనకు తెలియని ఇంకా ఎన్నో రకాల నట్స్ మనకు అందుబాటులో ఉన్నాయి. అవన్నీ మనకు ఆరోగ్యకరమైన ప్రయోజనాలను అందిస్తాయి. ఇక అలాంటి నట్స్‌లో పీకన్ నట్స్ కూడా ఒకటి. అయితే వీటి గురించి చాలా మందికి తెలియదు. వీటి గురించి చాలా మంది ఎప్పుడూ విని కూడా ఉండరు. కానీ ఇవి కూడా మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. పీకన్ నట్స్ ఎంతో రుచిగా ఉండడమే కాదు, అనేక పోషకాలను సైతం కలిగి ఉంటాయి. వీటిల్లో ఆరోగ్యకరమైన కొవ్వులు, ఫైబర్, శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. అందువల్ల ఈ నట్స్‌ను రోజూ తింటే అనేక లాభాలను పొందవచ్చు. పలు వ్యాధులను నయం చేసుకునేందుకు, పోషకాహార లోపాన్ని తగ్గించుకునేందుకు ఈ నట్స్ ఎంతగానో దోహదం చేస్తాయి. కనుక వీటిని రోజూ తినాలని పోషకాహార నిపుణులు, వైద్యులు సూచిస్తున్నారు.గుండె జబ్బులు రాకుండా..పీకన్ నట్స్‌లో మోనో అన్‌శాచురేటెడ్ ఫ్యాటీ యాసిడ్లు అధికంగా ఉంటాయి. ఇవి ఆరోగ్యకరమైన కొవ్వుల జాబితాకు చెందుతాయి. కనుక ఈ నట్స్‌ను తింటే శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. దీని వల్ల గుండె జబ్బులు రాకుండా అడ్డుకోవచ్చు. ముఖ్యంగా హార్ట్ స్ట్రోక్స్ రాకుండా ఉంటాయి. ఈ నట్స్‌లో మెగ్నీషియం, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండడం వల్ల వీటిని తింటుంటే శరీరంలోని వాపులు తగ్గుతాయి. ముఖ్యంగా రక్త నాళాల వాపులను తగ్గించుకోవచ్చు. దీని వల్ల రక్త నాళాలు వెడల్పుగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. రక్త సరఫరా మెరుగు పడుతుంది. బీపీ తగ్గుతుంది. హైబీపీ ఉన్నవారికి ఈ నట్స్ ఎంతో దోహదం చేస్తాయి. ఈ నట్స్‌ను రోజూ తింటుంటే బీపీని కంట్రోల్‌లో ఉంచుకోవచ్చు.బరువు తగ్గేందుకు..పీకన్ నట్స్‌లో విటమిన్ ఇ తోపాటు పాలిఫినాల్స్, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. కనుక వీటిని తింటే ఫ్రీ ర్యాడికల్స్‌ను తొలగిస్తాయి. ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. ఈ నట్స్‌లో ఫైబర్ అధికంగా ఉంటుంది. అందువల్ల వీటిని తింటే జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. ముఖ్యంగా మలబద్దకం తగ్గుతుంది. అలాగే ఈ నట్స్‌లో ఉండే ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వుల కారణంగా వీటిని తింటే కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇలా బరువు తగ్గడం చాలా తేలికవుతుంది. కనుక అధికంగా బరువు ఉన్నవారు రోజూ ఈ నట్స్‌ను తింటుంటే ఎంతగానో ఫలితం ఉంటుంది. వీటిని తినడం వల్ల మాంగనీస్ అధికంగా లభిస్తుంది. ఇది శరీర మెటబాలిజం పెరిగేలా చేస్తుంది. దీని వల్ల క్యాలరీలు ఖర్చయి కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు.రక్తహీనతకు..పీకన్ నట్స్‌లో కాపర్ అధికంగా ఉంటుంది. ఇది ఎర్ర రక్త కణాల నిర్మాణానికి సహాయం చేస్తుంది. ఐరన్‌ను శరీరం శోషించుకునేలా చేస్తుంది. దీని వల్ల రక్తం వృద్ధి చెందుతుంది. రక్త హీనత తగ్గుతుంది. అలాగే నాడీ మండల వ్యవస్థ మెరుగ్గా పనిచేస్తుంది. పీకన్ నట్స్‌లో విటమిన్ బి1 అధికంగా ఉంటుంది. ఇది నాడీ మండల వ్యవస్థ సక్రమంగా పనిచేసేందుకు దోహదం చేస్తుంది. శరీర మెటబాలిజం పెరిగేలా చేస్తుంది. దీని వల్ల శరీరంలో శక్తి స్థాయిలు అధికంగా ఉంటాయి. ఉత్సాహంగా పనిచేస్తారు. చురుగ్గా ఉంటారు. నీరసం, అలసట తగ్గుతాయి. బద్దకం పోతుంది. శారీరక శ్రమ లేదా వ్యాయామం చేస్తున్నవారు, జ్వరం వచ్చిన వారు ఈ నట్స్‌ను తింటుంటే ఎంతగానో ఫలితం ఉంటుంది. వీటిని తినడం వల్ల షుగర్ ఉన్నవారికి కూడా ఎంతో మేలు జరుగుతుంది. షుగర్ లెవల్స్‌ను కంట్రోల్‌లో ఉంచుకోవచ్చు. టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారికి ఇవి ఎంతో సహాయం చేస్తాయి. ఇలా పీకన్ నట్స్‌ను రోజూ తినడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు. అయితే వీటిని రోజూ ఒక గుప్పెడు మోతాదులో తింటుంటే సరిపోతుంది.

## జాప్యం లేకుండా కార్మికులకు సీఎం పీఎఫ్ సేవలు




**రీజనల్ కమిషనర్ కే. గోవర్ధన్.( సీఎం పిఎఫ్ ).**

**మందమర్రి,డిసెంబర్ 4** ఏరియాలోని జనరల్ మేనేజర్ కార్యాలయంలో గురువారం సి ఎం పి ఎఫ్ కోఆర్డినేషన్ కమిటీ మీటింగ్ ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ గారి అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేయడమైనది.జాప్యం లేకుండా సీఎంపిఎఫ్ సేవలను ఉద్యోగులకు త్వరగా అందించేందుకు కృషి చేస్తున్నామని సీ.ఎం.పి.ఎఫ్ రీజినల్ కమిషనర్ కె.గోవర్ధన్ అన్నారు.మందమర్రి జనరల్ మేనేజర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ. సీ.ఎం.పి.ఎఫ్, పెన్షన్ లకు సంబంధించిన లావాదేవిలు అన్నీ సి-కేర్స్ పోర్టల్ ద్వారా మాత్రమే జరుగుతున్నట్టు తెలిపారు. అలాగే కొత్తగా సీ.ఎం.పి.ఎఫ్ పెన్షన్ కి సంబంధించిన క్లెయిమ్స్ త్వరగతిన పూర్తి చేయడానికి ప్రయాస్ అనే పద్దతిని తీసుకువచ్చామని అన్నారు. బొగ్గు మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు జీరో పెండింగ్ గా సీ.ఎం పి.ఎఫ్ పెన్షన్ సంబంధించిన క్లైములను సెటిల్ చేస్తు న్నామని అన్నారు. మధ్యవర్తులు ప్రమేయం లేకుండా సీ.ఎం.పి.ఎఫ్ సేవలను పారదర్శకంగా పొందవచ్చు అని తెలిపారు. కార్మికులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ న్. రాధాకృష్ణ మాట్లాడుతూ ఈ ప్రయాస్ ద్వారా సీ.ఎం.పి.ఎఫ్, పెన్షన్ కి సంబందించిన సమస్యలు లేకుండా చూసేందుకు ప్రయత్నిస్తు చర్యలు తీసుకుంటున్న అధికారులకు ధన్యవాదలు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్.ఓ.టు జి.ఎం.జి.ల్ ప్రసాద్, సి.ఎం.పి.ఎఫ్ రీజినల్ కమిషనర్ కె.గోవర్ధన్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ శంకర్, సీ.ఎం.పి.ఎఫ్ రీజినల్ ఆఫీసు సిబ్బంది,అన్ని గనుల సంక్షేమ అధికారులు, క్లరికల్ సిబ్బంది పాల్గొన్నారు.

## మాజీ ముఖ్యమంత్రి రోశయ్య వర్ధంతి, చిత్రపుటానికి పుష్ప మాల వేసి నివాళులర్పించిన





**జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్.**

**ఆదిలాబాద్ జిల్లా** నిర్మల్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య వర్ధంతి కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ మరియు కలెక్టర్, కార్యాలయం అధికారులు రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కిషోర్ కుమార్ మాట్లాడుతూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ముఖ్యమంత్రిగా, మంత్రిగా ఆయన చేసిన సేవలు మరువలేనివని అన్నారు.ఈ వర్ధంతి కార్యక్రమంలో జిల్లా బిసి, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ అధికారులు శ్రీనివాస్, అంబాజీ, మోహన్ సింగ్, డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మేనేజరు నరసింహ రెడ్డి, హార్టికల్చర్ అధికారి రమణ,, ఎల్డీఎం, రామ్ గోపాల్, కలెక్టర్ కార్యాలయ పర్యవేక్షకులు సూర్యారావు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సెలెక్టర్లపై రింకూ అభిమానుల ఆగ్రహం



దక్షిణాఫ్రికాతో జరిగే ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు బీసీసీఐ జట్టును ప్రకటించింది. సూర్యకుమార్ యాదవ్ 15 మంది ఆటగాళ్లకు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు, శుభ్‌మన్ గిల్ వైస్ కెప్టెన్‌గా, హార్దిక్ పాండ్యా తిరిగి జట్టులోకి వచ్చారు. రింకు సింగ్‌ను జట్టు నుంచి తొలగించడంపై చాలా మంది అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు, సోషల్ మీడియాలో సెలెక్టర్లను విమర్శిస్తున్నారు.రింకు సింగ్ ఫినిషర్ పాత్ర పోషిస్తున్నాడు, అయితే అతనికి ప్లేయింగ్ ఎలెవెన్‌లో స్థిరమైన అవకాశాలు రాలేదు. హార్దిక్ పాండ్యా గాయం కారణంగా అతను కేవలం ఆసియా కప్ ఫైనల్‌లో మాత్రమే ఆడే అవకాశం లభించింది. ఈ సంవత్సరం, రింకు ఆరు టీ20లలో ఆడాడు, వాటిలో మూడు మ్యాచ్‌లలో బ్యాటింగ్ చేశాడు. అతనికి పరిమిత అవకాశాలు లభించినప్పటికీ, అతను చాలా మ్యాచ్‌లలో తనదైన ముద్ర వేశాడు. ఇప్పుడు, దక్షిణాఫ్రికాతో జరిగే టీ20 సిరీస్ నుంచి తొలగించడంతో, అతని అభిమానులు సెలెక్టర్లపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఒక వినియోగదారుడు రింకు సింగ్ టీ20 గణాంకాలను ప్రస్తావిస్తూ, అతను టీ20లలో భారతదేశపు అత్యుత్తమ ఫినిషర్ అని పేర్కొన్నాడు, అయినప్పటికీ అతన్ని తొలగించారు. మరొక వినియోగదారుడు చీఫ్ సెలెక్టర్, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌పై తమకు నచ్చిన ఆటగాళ్లను ఎంచుకున్నారని ఆరోపించారు.

# ఆసీస్ గడ్డపై రూట్ సెంచరీ



2025 యాషెస్ సిరీస్‌లో ఆస్ట్రేలియా- ఇంగ్లాండ్ మధ్య రెండో టెస్టులో తొలి రోజు ఆట ముగిసింది. తొలి ఇన్నింగ్స్‌లో తొలుత బ్యాటింగ్ చేస్తున్న ఇంగ్లాండ్ 325-9 స్కోర్‌తో ఉంది. క్రీజులో జో రూట్ (135 పరుగులు), జోఫ్రా ఆర్చర్ (32 పరుగులు) ఉన్నారు. ఆసీస్ బౌలర్లలో మిచెల్ స్టార్క్ 6, మిచెల్ నజీర్, స్కాట్ బొలాండ్ చెరో 1 వికెట్ దక్కించుకున్నారు. తొలి ఇన్నింగ్స్‌లో రూట్ బ్యాటింగే హైలైట్. తన టెస్టు కెరీర్‌లో తొలిసారి ఆస్ట్రేలియా గడ్డపై సెంచరీ సాధించాడు. ఆస్ట్రేలియాలో రూట్ శతకం నమోదు చేసేందుకు 30 ఇన్నింగ్స్‌లు తీసుకున్నాడు. అలాగే రూట్ కెరీర్‌లో ఇది 40వ టెస్టు సెంచరీ కావడం విశేషం. కెరీర్‌లో లోటుగా మారిన ఈ సెంచరీని సాధించేందుకు జోరూట్‌కు తాజా పర్యటనలో మూడు ఇన్నింగ్స్‌ల సమయం పట్టింది. తొలి టెస్ట్‌లో దారుణంగా విఫలమైన జోరూట్.. పింక్ బాల్ టెస్ట్‌లో తన ట్రేడ్ మార్క్ బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. మిచెల్ స్టార్క్ ధాటికి ఆదిలోనే బెన్ డకెట్, ఓలీ పోప్ డకౌటవ్వగా.. జాక్ క్రాలీ(76)తో కలిసి జోరూట్ జట్టును ఆదుకున్నాడు. మూడో వికెట్‌కు 107 పరుగుల భాగస్వామ్యాన్ని అందించాడు. జాక్ క్రాలీ వెనుదిరిగినా.. హ్యారీ బ్రూక్(31), బెన్ స్టోక్స్(19), విల్ జాక్స్(19), జోఫ్రా ఆర్చర్(32 బ్యాటింగ్)ల సాయంతో విలువైన భాగస్వామ్యాలను నెలకొల్పాడు.ఈ క్రమంలో 83 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్న జోరూట్.. 181 బంతుల్లో శతకాన్ని పూర్తి చేశాడు. ఈ భారీ ఇన్నింగ్స్‌తో ఆస్ట్రేలియా గడ్డపై 1000 పరుగుల మార్క్‌ను అందుకున్నాడు. ఇప్పటి వరకు ఆసీస్ గడ్డపై 30 ఇన్నింగ్స్‌లు ఆడిన జోరూట్ 1006 పరుగులు చేశాడు. ఇందులో తాజా సెంచరీతో పాటు 9 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో జోరూట్‌కు ఇది 22వ సెంచరీ. ఇప్పటికే ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉన్న జోరూట్.. తన స్థానాన్ని మరింత పదిలం చేసుకున్నాడు. మరే బ్యాటర్ కూడా అతనికి దరిదాపుల్లో లేడు. డబ్ల్యూటీసీ చరిత్రలో 129 ఇన్నింగ్స్‌లు ఆడిన జోరూట్ 22 శతకాలు చేయగా.. స్టీవ్ స్మిత్ 13, మార్నస్ లబుషేన్ 11, కేన్ విలియమ్సన్ 11, శుభ్‌మన్ గిల్ 10 సెంచరీలతో తర్వాతి స్థానంలో నిలిచారు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఇంగ్లండ్ తరపున అత్యధిక సెంచరీలు బాదిన బ్యాటర్ల జాబితాలో జోరూట్(59లి) అగ్రస్థానంలో కొనసాగుతుండగా.. అలిస్టర్ కుక్(38), కెవిన్ పీటర్సన్(32), గ్రహమ్ కోచ్(28), ఆండ్రూ స్ట్రాస్(27) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. అంతర్జాతీయ క్రికెట్‌లో 100 సెంచరీలతో సచిన్ టెండూల్కర్ అగ్రస్థానంలో ఉండగా.. విరాట్ కోహ్లీ(84), రికీ పాంటింగ్(71), కుమార సంగక్కర(63), జాక్వాస్ కల్లీస్(62), జోరూట్(59లి) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. జోరూట్ సెంచరీతో తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ 74 ఓవర్లలో 9 వికెట్లకు 325 పరుగులు చేసింది. క్రీజులో జోరూట్(135 బ్యాటింగ్), జోఫ్రా ఆర్చర్(32 బ్యాటింగ్) ఉన్నాడు. ఆసీస్ బౌలర్లలో మిచెల్ స్టార్క్(6/71) ఆరు వికెట్లు తీయగా.. మైఖేల్ నెజర్, స్కాట్ బోలాండ్ తలో వికెట్ తీసారు.

# దక్షిణాఫ్రికాపై కోహ్లీ ఆధిపత్యం..



భారత క్రికెట్ 'రన్ మెషిన్' విరాట్ కోహ్లీ మరోసారి మైదానంలో తన ఆధిపత్యాన్ని చాటుతున్నాడు. దక్షిణాఫ్రికాతో రాయ్‌పూర్‌లో జరిగిన రెండో వన్డే మ్యాచ్‌లో కోహ్లీ అద్భుతమైన 102 పరుగులు చేసి తన అంతర్జాతీయ కెరీర్‌లో 84వ శతకం సాధించాడు. ఈ సిరీస్‌లో అతని ఫామ్ అద్భుతంగా ఉంది, ఎందుకంటే మొదటి మ్యాచ్ తర్వాత వరుసగా రెండో మ్యాచ్‌లోనూ అతని బ్యాట్ నుంచి సెంచరీ వచ్చింది. ఈ సెంచరీతో కోహ్లీ వన్డే క్రికెట్‌లో మొత్తం 53 సెంచరీలు పూర్తి చేశాడు. ఆస్ట్రేలియా పర్యటనలో ప్రారంభ వైఫల్యం తర్వాత విరాట్ కోహ్లీ అద్భుతంగా పుంజుకున్నాడు. దక్షిణాఫ్రికాతో జరుగుతున్న సిరీస్‌లో అతని బ్యాట్ ఫైర్ మీద ఉంది. రాయ్‌పూర్‌లో చేసిన 102 పరుగుల సెంచరీతో ఇప్పుడు ఆఫ్రికన్ జట్టుపై అతని వన్డే సెంచరీల సంఖ్య 7కి చేరుకుంది. ఈ ప్రదర్శనతో కోహ్లీ 2027 వన్డే ప్రపంచ కప్‌లో భారత్ కోసం కీలక పాత్ర పోషించడానికి సిద్ధంగా ఉన్నాడని స్పష్టంగా తెలుస్తోంది. వన్డే ఫార్మాట్‌లో సెంచరీల రికార్డులో విరాట్ కోహ్లీ ప్రస్తుతం అగ్రస్థానంలో ఉన్నాడు. గణాంకాలను పరిశీలిస్తే, కోహ్లీకి శ్రీలంక బౌలర్లు బాగా నచ్చారు. అతను శ్రీలంకతో ఆడిన 56 మ్యాచ్‌లలో 54 ఇన్నింగ్స్‌లలో అత్యధికంగా 10 సెంచరీలు సాధించాడు. ఆ తర్వాత వెస్టిండీస్ ఉంది, దీనిపై కోహ్లీ 43 మ్యాచ్‌ల్లో 9 సెంచరీలు నమోదు చేశాడు. వన్డే సెంచరీలలో సచిన్ టెండూల్కర్ (49) రెండో స్థానంలో, రోహిత్ శర్మ (33) మూడో స్థానంలో ఉన్నారు.రాయ్‌పూర్‌లో 102 పరుగులు చేసి అవుటైన కోహ్లీకి ఇప్పుడు విశాఖపట్నంలో జరిగే మూడో వన్డేలో చరిత్ర సృష్టించే సువర్ణావకాశం ఉంది. అంతర్జాతీయ క్రికెట్ మూడు ఫార్మాట్‌లలో (టెస్ట్, వన్డే, టీ20) కలిపి 28,000 పరుగులు పూర్తి చేయడానికి కోహ్లీకి ఇప్పుడు కేవలం 90 పరుగులు మాత్రమే అవసరం. మూడో మ్యాచ్‌లో ఈ పరుగులు చేస్తే సచిన్ టెండూల్కర్, కుమార సంగక్కర తర్వాత ఈ ఘనత సాధించిన ప్రపంచ మూడో బ్యాట్స్‌మెన్‌గా నిలుస్తాడు.దక్షిణాఫ్రికాపై 33 వన్డేల్లో, విరాట్ కోహ్లీ 31 ఇన్నింగ్స్‌లలో 1741 పరుగులు చేశాడు, 50ం పరుగుల 15 సార్లు సాధించాడు, ఇది ప్రోటీస్‌పై ఏ భారతీయ బ్యాట్స్‌మన్ చేసిన అత్యధిక స్కోరు. రాయ్‌పూర్‌లో తన సెంచరీతో, విరాట్ కోహ్లీ ఇప్పుడు 34 వేర్వేరు వేదికల్లో వన్డే సెంచరీలు సాధించాడు, వివిధ మైదానాల్లో అత్యధిక సెంచరీలు చేసిన టెండూల్కర్ రికార్డును సమం చేశాడు.

# ప్రసిద్ధ్ కృష్ణ పేలవ బౌలింగ్



రాయ్‌పూర్‌లో జరిగిన రెండో వన్డేలో టీమిండియా ఓటమికి ఒక ఆటగాడి పేలవ ప్రదర్శన ప్రధాన కారణమని విశ్లేషణలు వెలువడుతున్నాయి. ఆ ఆటగాడి కారణంగానే గెలుస్తుందనుకున్న మ్యాచ్ చేజారిందని క్రికెట్ వర్గాలు భావిస్తున్నాయి. రాయ్‌పూర్ వేదికగా జరిగిన రెండో వన్డేలో టీమిండియా 4 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికా చేతిలో ఓటమిపాలైంది. ఈ మ్యాచ్‌లో ఓటమికి ప్రధాన కారణం భారత పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ పేలవ బౌలింగ్ అని చెప్పవచ్చు. ఈ మ్యాచ్‌లో ప్రసిద్ధ్ కృష్ణ రెండు వికెట్లు తీసినప్పటికీ, భారీగా పరుగులు సమర్పించుకున్నాడు. 8.2 ఓవర్లు బౌలింగ్ చేసిన అతను ఏకంగా 85 పరుగులు ఇచ్చాడు. అతని ఎకానమీ రేటు 10.20గా ఉండటం గమనార్హం. మొదట బ్యాటింగ్ చేసిన టీమిండియా 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 358 పరుగులు చేసింది. విరాట్ కోహ్లీ (102), రుతురాజ్ గైక్వాడ్ (105) సెంచరీలతో చెలరేగారు. ఈ భారీ స్కోరుతో టీమిండియా విజయం ఖాయమని అందరూ భావించారు. అయితే, దక్షిణాఫ్రికా 49.2 ఓవర్లలోనే 6 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. దీంతో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ ప్రస్తుతం 1-1తో సమమైంది.ఈ మ్యాచ్‌లో అత్యధిక పరుగులు ఇచ్చిన బౌలర్‌గా ప్రసిద్ధ్ కృష్ణ నిలిచాడు. మహమ్మద్ షమీ వంటి అనుభవజ్ఞులైన బౌలర్లు జట్టులో అవకాశం కోసం ఎదురుచూస్తుండగా, ప్రసిద్ధ్ కృష్ణ ఇలాంటి ప్రదర్శన చేయడం అతని కెరీర్‌కు ఇబ్బందికరంగా మారే అవకాశం ఉంది. షమీ వంటి బౌలర్లు ఉండి ఉంటే ఫలితం వేరేలా ఉండేదని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. దక్షిణాఫ్రికాతో రాయ్‌పూర్‌లో జరిగిన రెండో వన్డేలో ప్రసిద్ధ్ కృష్ణ రెండు వికెట్లు తీసి ఉండవచ్చు. కానీ, అతను భారీగా పరుగులు సమర్పించుకున్నాడు. దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో వన్డేలో ప్రసిద్ధ్ కృష్ణ 8.2 ఓవర్లలో 85 పరుగులు ఇచ్చాడు. ఈ కాలంలో అతని ఎకానమీ రేటు 10.20గా ఉంది. రాయ్‌పూర్‌లో దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో వన్డేలో, భారత బౌలర్లలో ప్రసిద్ కృష్ణ అత్యధిక పరుగులు చేసిన బౌలర్‌గా నిలిచాడు. ప్రసిద్ కృష్ణ పేలవమైన ప్రదర్శన తర్వాత, అతని వన్డే కెరీర్ ఇప్పుడు ప్రమాదంలో పడింది. మహమ్మద్ షమీ వంటి ప్రాణాంతకమైన, అనుభవజ్ఞుడైన ఫాస్ట్ బౌలర్ టీమిండియాలో అవకాశం కోసం ఎదురు

## డెవాల్డ్ బ్రెవిస్ బ్యాటింగ్
# మైండ్ బ్లోయింగ్
### టీమిండియా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్

సౌతాఫ్రికా యువ బ్యాటర్, చెన్నై సూపర్ కింగ్స్ హిట్టర్ డెవాల్డ్ బ్రెవిస్‌పై టీమిండియా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ప్రశంసల జల్లు కురిపించాడు. భారత్‌తో రాయ్‌పూర్ వేదికగా జరిగిన రెండో వన్డేలో అతని బ్యాటింగ్ అద్భుతంగా ఉందని కొనియాడాడు. ఈ మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన సౌతాఫ్రికా 4 వికెట్ల తేడాతో విజయం సాధించిన విషయం తెలిసిందే.ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్లకు 358 పరుగుల భారీ స్కోర్ చేసింది. విరాట్ కోహ్లీ(93 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లతో 102), రుతురాజ్ గైక్వాడ్(83 బంతుల్లో 12 ఫోర్లు, 2 సిక్స్‌లతో 105) సెంచరీలతో చెలరేగగా.. కెప్టెన్ కేఎల్ రాహుల్(43 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 66 నాటౌట్) హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. సౌతాఫ్రికా బౌలర్లలో మార్కో యాన్సెన్(2/63) రెండు వికెట్లు తీయగా.. నండ్రే బర్గర్(1/43), లుంగి ఎంగిడి(1/51) చెరో వికెట్ తీసారు.అనంతరం సౌతాఫ్రికా 49.2 ఓవర్లలో 6 వికెట్లకు 362 పరుగులు చేసి గెలుపొందింది. ఓపెనర్ ఎయిడెన్ మార్క్‌రమ్(98 బంతుల్లో 10 ఫోర్లు, 4 సిక్స్‌లతో 110) సెంచరీతో చెలరేగగా.. మాథ్యూ బ్రిట్జ్‌కే(64 బంతుల్లో 5 ఫోర్లతో 68), డెవాల్డ్ బ్రెవిస్(34 బంతుల్లో ఫోర్, 5 సిక్స్‌లతో 54) హాఫ్ సెంచరీలతో రాణించారు. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్, ప్రసిధ్ కృష్ణ రెండేసి వికెట్లు తీయగా.. హర్షిత్ రాణా, కుల్దీప్ యాదవ్ చెరో వికెట్ పడగొట్టారు.కోహ్లీ, రుతురాజ్ గైక్వాడ్ శతకాలతో చెలరేగినా

# టీ20 క్రికెట్‌లో రోహిత్ రీఎంట్రీకి రెడీ



టీమిండియా టెస్టు, వన్డే కెప్టెన్ రోహిత్ శర్మ సంచలన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అంతర్జాతీయ టీ20లకు వీడ్కోలు పలికిన ఈ స్టార్ బ్యాటర్, దేశవాళీ టీ20 టోర్నమెంట్ అయిన సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ఆడేందుకు సిద్ధంగా ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి.రోహిత్ శర్మ తన సొంత జట్టు ముంబై తరపున సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ నాకౌట్ మ్యాచ్‌లలో ఆడేందుకు ఆసక్తి చూపించినట్లు సమాచారం. ఈ విషయాన్ని ముంబై క్రికెట్ అసోసియేషన్ వర్గాలు ధృవీకరించినట్లు జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి. ముంబై జట్టు లీగ్ దశలో అద్భుత ప్రదర్శనతో నాకౌట్‌కు చేరడం ఖాయంగా కనిపిస్తోంది. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ నాకౌట్ మ్యాచ్‌లు డిసెంబర్ 12 నుంచి 18 మధ్య జరగనున్నాయి. ప్రస్తుతం రోహిత్ శర్మ దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్ ఆడుతున్నారు. ఈ సిరీస్ డిసెంబర్ 6న ముగుస్తుంది. ఆ తర్వాత రోహిత్ ముంబై జట్టుకు అందుబాటులో ఉంటారు.2024 టీ20 వరల్డ్ కప్ విజయానంతరం రోహిత్ శర్మ అంతర్జాతీయ టీ20లకు గుడ్ బై చెప్పిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మళ్లీ టీ20 ఫార్మాట్‌లో బ్యాట్ పట్టుకునేందుకు



# చిత్రపరిశ్రమలో ఒడుదొడుకులు సహజం

### నటి రకుల్ ప్రీత్ సింగ్ వ్యాఖ్య

చిత్రపరిశ్రమలో ఒడుదొడుకులు సహజమని నటి రకుల్ ప్రీత్ సింగ్ అన్నారు. సినిమా అన్నాక విజయాలు, అపజయాలు..నష్టాలు, లాభాలు కూడా సహజమని అన్నారు. తన భర్త జాకీ భగ్నానీ దివాలా తీశారంటూ ఇటీవల వచ్చిన వార్తలపై ఆమె స్పందించారు. కంపెనీ మూసివేశారనే వార్తలను ఖండించారు. ఆ సమయంలో మీడియాలో వచ్చిన రూమర్స్ గురించి ప్రస్తావించారు. క్లిక్స్ కోసం ఏమైనా రాసే సంస్కృతికి అలవాటు పడ్డారు. వాస్తవానికి, ఆ వార్తలకు చాలా వ్యత్యాసం ఉంటుంది. నాకు నిజానిజాలు అన్నీ తెలుసు కాబట్టి నేను వాటిని పట్టించుకోలేదు. పరిశ్రమలో భాగమైనప్పుడు కొన్ని విషయాల గురించి మౌనంగా ఉండడమే మంచిది. సమయం వచ్చేవరకూ ప్రజలకు అసలు నిజమేమిటనేది తెలియదు. జాకీ భగ్నానీపై వార్తలు వచ్చినప్పుడు అతడు ఎన్ని సవాళ్లు ఎదుర్కొన్నాడో నేను దగ్గర నుంచి చూశాను. కంపెనీ మూసేశారని రాశారు. అతడు నిర్మాతగా వ్యవహరించిన మూడు సినిమాలు ఆదరణ సొంతం చేసుకోలేదన్నమాట వాస్తవమే. కానీ, కంపెనీ మూసివేయలేదు. ఆర్థికంగా చాలా నష్టపోయాం. ఇండస్ట్రీలోని ప్రతి నిర్మాతకు అలా జరుగుతుంది. ఒకనొక సమయంలో అమితాబ్‌బచ్చన్‌కు కూడా ఇలానే జరిగింది. ఎదుగుతున్న సమయంలో ఇదంతా ఒక దశ అని రకుల్ అన్నారు. బాలీవుడ్ నటులు అక్షయ్‌కుమార్ (ం÷ఖబరజా ఐబీపజీస), టైగర్ ష్రాఫ్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'బడే మియా.. ఛోటే మియా'. భారీ తారాగణంతో రూపొందిన ఈ సినిమా అనుకున్న స్థాయిలో విజయాన్ని అందుకోలేకపోయింది. దీంతో ఈ సినిమా నిర్మాత, రకుల్ ప్రీత్ సింగ్ భర్త జాకీ భగ్నానీ దివాలా తీశారంటూ గతంలో వార్తలు వచ్చాయి.

# మనశంకరవరప్రసాద్ నుంచి మరో పాట

### 8న విడుదలకు చిత్రబృందం సన్నాహాలు

అగ్ర కథానాయకుడు మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న 'మన శంకరవర ప్రసాద్' చిత్రం నుంచి తాజాగా రెండో పాట విడుదల తేదీ ఖరారైంది. ఇప్పటికే విడుదలైన మొదటి పాట 'మీసాల పిల్ల' భారీ విజయాన్ని సాధించి ప్రేక్షకులను ఉర్రూతలూగిస్తున్న నేపథ్యంలో చిత్ర బృందం తదుపరి పాట అప్‌డేట్‌తో అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతోంది. 'శశిరేఖ' అనే పేరుతో రాబోతున్న ఈ రెండో పాట డిసెంబర్ 8న విడుదల కాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ పాటకు సంబంధించిన ప్రోమో డిసెంబర్ 6న విడుదల చేయనున్నట్లు తెలిపింది. ఈ సినిమాకు అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తుండగా.. మెగాస్టార్ చిరంజీవితో పాటు విక్టరీ వెంకటేశ్, నయనతార, కేథరిన్ థ్రెసా వంటి అగ్ర తారలు నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని సాహు గారపాటి, సుష్మిత కొణిదెల, వి. హరికృష్ణ సంయుక్తంగా నిర్మిస్తున్నారు.






# ప్రముఖ నిర్మాత శరవణన్ మృతి

### నివాళి అర్పించిన పలువురు ప్రముఖులు



ప్రముఖ కోలీవుడ్ నిర్మాత, ఏవీఎం నిర్మాణ సంస్థ అధినేత ఏవీఎం శరవణన్ (85) కన్నుమూశారు. చెన్నైలోని ఆయన నివాసంలో గురువారం ఉదయం తుదిశ్వాస విడిచారు. తమిళ్, తెలుగు, మలయాళం, హిందీ భాషల్లో శరవణన్ పలు హిట్ చిత్రాలను నిర్మించి గుర్తింపుతెచ్చుకున్నారు. ఏవీఎం బ్యానర్‌పై మొత్తం 300 సినిమాలకు పైగా నిర్మించారు. తెలుగులో 'సంసారం ఒక చదరంగం', 'ఆ ఒక్కటీ అడక్కు', 'మెరుపు కలలు', 'జెమిని', 'శివాజీ' వంటి సినిమాలను అందించారు. శరవణన్ మృతితో చిత్ర పరిశ్రమలో విషాదం నెలకొంది. ప్రముఖులు ఆయనకు నివాళు లర్పిస్తున్నారు. ఏవీఎం నిర్మాణ సంస్థ అధినేత శరవణన్ భౌతిక కాయానికి నివాళులర్పిస్తూ నటుడు సూర్య భావోద్వేగానికి గురయ్యారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ కంటతడి పెట్టుకున్నారు. తమిళనాడు సీఎం స్టాలిన్, రజనీకాంత్, సూర్య తండ్రి శివకుమార్ తదితరులు నిర్మాత భౌతిక కాయానికి నివాళులర్పించారు. సూర్య నటించిన 'పెరళగన్' (సుందరాంగుడు), 'వీడొక్కడే' తదితర చిత్రాలు ఏవీఎం ప్రొడక్షన్స్‌లోనే తెరకెక్కాయి. శరవణన్ మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా సంతాపం ప్రకటించారు. శరవణన్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. తాను చిన్న వయసులో.. శరవణన్‌ను కలిశానని, ఏవీఎం స్టూడియోస్‌లో ఎన్నో పాఠాలు నేర్చుకున్నానని విశాల్ గుర్తుచేసుకున్నారు.


# బాహుబలి కోసం జపాన్‌కు ప్రభాస్

### స్పిరిట్ షూట్‌కు తాత్కాలిక బ్రేక్

గ్లోబల్ స్టార్ ప్రభాస్ ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాల్లో నటిస్తున్నాడు. ముందుగా ప్రకటించిన ప్రకారం జపాన్‌లో బాహుబలి : ది ఎపిక్ స్పెషల్ ప్రీమియర్‌కు హాజరు కావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ప్రభాస్ గురువారం జపాన్‌కు వెళ్లాడు. ఈవెంట్‌కు బాహుబలి ఫ్రాంచైజీ నిర్మాత శోభు యార్లగడ్డ కూడా హాజరు కానున్నారు. బాహుబలి : ది ఎపిక్ జపాన్‌లో డిసెంబర్ 12న గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ మేరకు మేకర్స్ డిసెంబర్ 5, 6వ తేదీల్లో స్పెషల్ ప్రీమియర్స్ ఏర్పాటు చేశారు. ప్రభాస్ కల్కి 2898 ఏడీ ప్రమోషన్స్ టైంలో జపాన్‌లో తాను కలవలేకపోయిన అభిమానులను కలుస్తానని హామీనిచ్చాడని తెలిసిందే. వారికిచ్చిన మాట ప్రకారం జపాన్‌లో అభిమానులతో చిట్‌చాట్ చేయనున్నాడు. ఇదిలా ఉంటే యానిమల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా ఇప్పటికే షూటింగ్ మొదలు పెట్టిన విషయం తెలిసిందే. ప్రభాస్, తృప్తి డిమ్రిపై వచ్చే కొన్ని సన్నివేశాలను కూడా ఇటీవలే షూట్ చేశారు. షూటింగ్ నుంచి చిన్న బ్రేక్ తీసుకున్న ప్రభాస్ జపాన్ టూర్ అయిపోగానే మళ్లీ స్పిరిట్ షూట్‌తో బిజీగా కానున్నాడు. టాలీవుడ్ డైరెక్టర్ మారుతి–ప్రభాస్ కాంబోలో రాజాసాబ్ వస్తుందని తెలిసిందే. హార్రర్ కామెడీ జోనర్‌లో వస్తోన్న ఈ చిత్రాన్ని సంక్రాంతి కానుకగా 2026 జనవరి 9న విడుదల చేయనున్నారు. ఇప్పటికే ప్రమోషన్స్‌లో భాగంగా లాంచ్ చేసిన పోస్టర్లు, టీజర్లు, ట్రైలర్స్‌కు మంచి స్పందన వస్తోంది.

-----------





# ఇళయారాజాతో 50 లక్షలతో మైత్రీ

మైత్రీ మూవీ మేకర్స్ సినిమాలలో ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా పాటల వినియోగానికి సంబంధించి కొన్నిరోజులుగా వివాదం నెలకొన్న విషయం తెలిసిందే. తాజాగా ఈ వివాదం ఎట్టకేలకు పరిష్కారమైనట్లు తెలుస్తుంది. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ.. తమ సినిమాలైన 'డ్యూడ్' మరియు 'గుడ్ బ్యాడ్ అగ్లీ' చిత్రాలలో ఇళయరాజా పాటలను ఉపయోగించినందుకు గాను, ఆయనకు

# అందరి చూపు 'అఖండ 2' పైనే..



నందమూరి బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వస్తున్న భారీ చిత్రం 'అఖండ 2: తాండవం' మరికొన్ని గంటల్లో థియేటర్లలోకి రానుంది. ఈరోజు రాత్రి నుంచే ప్రీమియర్ షోలు ప్రారంభం కానుండగా, రేపు ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ చిత్రం బాలకృష్ణ కెరీర్‌లో తొలి పాన్–ఇండియా సినిమా కావడంతో ఇండస్ట్రీ వర్గాల్లో, ప్రేక్షకుల్లో తీవ్ర ఆసక్తి నెలకొంది.గతంలో వచ్చిన 'అఖండ' మొదటి భాగం కేవలం తెలుగులోనే విడుదలై సంచలన విజయం సాధించింది. ముఖ్యంగా హిందీ డబ్బింగ్ వెర్షన్ యూట్యూబ్‌లో కోట్లాది వ్యూస్ సాధించడంతో 'అఖండ 2'ను హిందీతో పాటు తమిళ, కన్నడ, మలయాళ భాషల్లోనూ విడుదల చేస్తున్నారు. ఉత్తరాది ప్రేక్షకులను ఆకట్టుకునేందుకు బాలయ్య స్వయంగా హిందీలో డబ్బింగ్ చెప్పడం, బాలీవుడ్ నటులను భాగం చేయడం వంటి ప్రత్యేక వ్యూహాలను అనుసరించారు. ముంబైలో

# ఉదయ్‌పూర్‌లో రష్మిక-విజయ్‌ల డెస్టినేషన్ వెడ్డింగ్

### పెళ్లి ఎప్పుడో ఇప్పుడే చెప్పలేనన్న క్యూట్ రష్మిక

టాలీవుడ్ క్యూట్ కపుల్ విజయ్ దేవరకొండ –రష్మిక మందన్న వివాహంపై గత కొన్ని రోజులుగ వాడి వేడి చర్చ నడుస్తోంది. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో రాజస్థాన్‌లోని ఉదయపూర్ ప్యాలెస్‌లో వీరి పెళ్లి జరగనుందని ప్రచారం జోరుగా సాగుతోంది. ఇటీవలే రష్మిక అక్కడి ఏర్పాట్లను పర్యవేక్షించిందన్న సమాచారం బయటకు రావడంతో ఈ రూమర్స్ మరింత వేగం పుంజుకున్నాయి. అయితే ఇప్పటి వరకు ఈ వార్తలపై ఇద్దరు నటుల తరఫున ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఈ నేపథ్యంలో ఓ హాలీవుడ్ మీడియాకు ఇచ్చిన తాజా ఇంటర్వ్యూలో రష్మిక తన వివాహ వార్తలపై మొదటిసారి స్పందించింది. రూమర్స్‌ను ఖండించలేనని, ప్రస్తుతం మాత్రం ఏ




Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,

Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com